Postel No. MBN/08/2016-2018




పురాతనమైన సమస్త రోగాలకు
ఆయుర్వేద చికిత్స
మూల వ్యాధి, తెల్లమచ్చలు, చర్మవ్యాధులతో పాటు అన్ని రకాల రోగాలకు వనమూలికలతో వైద్యం చేయబడును.
శ్రీ దత్తత్రిలింగేశ్వరామాలయము
నారాయణపేట రోడ్డు, ఉట్కూర్ మండలం
మహబూబ్‌నగర్ జిల్లా సెల్ 9640418895



# వార్తాతరంగాలు

జాతీయ తెలుగు దిన పత్రిక

website: www.vaarthatarangalu.com email:vtarangalu.222208@gmail.com

Published from mahabub nagar సంపుటి :24 సంచిక :332 సంపాదకులు: కోటకొండ ఎడ్ల విజయరాజు బుధవారం 01ఏప్రిల్ 2026 పేజీలు :12 వెల రూ5 /-


## పొంగులేటీ టార్గెట్ వెనుక...
# ఏం జరుగుతోంది

హైదరాబాద్ మార్చి 31:తెలంగాణ రాజకీయ క్షేత్రంలో ప్రస్తుతం బిఆర్ఎస్ వర్సెస్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మధ్య జరుగుతున్న యుద్ధం అత్యంత ఆసక్తికరంగా మారింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కంటే ఎక్కువగా పొంగులేటిని టార్గెట్ చేయడం వెనుక బలమైన రాజకీయ కనిపిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా ఒక కీలక విషయాన్ని లేవనెత్తారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన కొన్ని అక్రమ వ్యవహారాలు, కొత్త ప్రాజెక్టుల విషయంలో బిఆర్ఎస్ నేతలు చేస్తున్న పైరవీలకు పొంగులేటి అడ్డుపడుతున్నారని, అందుకే ఆయనను వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తున్నారని రేవంత్ రెడ్డి ఆరోపిస్తున్నారు.గతంలో తమకు అనుకూలంగా ఉన్న వ్యవస్థలను పొంగులేటి ఇప్పుడు ప్రక్షాళన చేస్తుండటంతో, తమ పనులు కావడం లేదన్న కోపంతోనే బిఆర్ఎస్ పెద్దలు పొంగులేటి అక్రమ మైనింగ్ పై హౌస్ కమిటీ వేయాలని డిమాండ్ చేస్తున్నారని అధికార పక్షం వాదన. పొంగులేటిని ఒత్తిడిలోకి నెట్టడం ద్వారా తమ పాత



పనులను చక్కబెట్టుకోవాలనే వ్యూహం ఇందులో ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు, బిఆర్ఎస్ నేతలు మాత్రం పొంగులేటిపై అక్రమ మైనింగ్ అనే అస్త్రాన్ని బలంగా ప్రయోగిస్తున్నారు. కేవలం అసెంబ్లీకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటనలు - మిగతా3లో

## ఇవాళ్టి నుంచి
# దేశవ్యాప్తంగా జనగణన...

## 33 ప్రశ్నలు అడగనున్న అధికారులు....

హైదరాబాద్, మార్చి 31:జనాభా గణన దిశగా కీలక అడుగు పడింది. ఏప్రిల్ 1న ప్రారంభం కానున్న గృహాల జాబితా ప్రక్రియ కోసం కేంద్ర ప్రభుత్వం 33 ప్రశ్నలతో కూడిన ఒక కొత్త ప్రశ్నావళిని విడుదల చేసింది. ఇంటర్నెట్ సదుపాయం, ఎల్‌పిజి, నీరు, పారిశుధ్యం వంటి ప్రాథమిక సౌకర్యాలతో పాటు మారుతున్న సామాజిక స్వరూపాన్ని అర్థం చేసుకోవడంపై ప్రత్యేకంగా దృష్టి సారించింది.

**ఇంటర్నెట్ సౌకర్యాల లభ్యత..**

2011లో నిర్వహించిన గత జనాభా గణన తర్వాత భారత సమాజంలో వచ్చిన మార్పులను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రశ్నావళిని రూపొందించడం




జరిగింది. గృహాల రకం, ప్రదేశం, నిర్మాణం గురించిన ప్రశ్నలతో పాటు ఇంటర్నెట్ సౌకర్యాల లభ్యతకు సంబంధించిన ఒక కొత్త ప్రశ్నను కూడా చేర్చడం జరిగింది. అంతేకాకుండా ఎల్‌పిజి, తాగునీరు, ఇతర ప్రాథమిక సౌకర్యాల లభ్యతకు సంబంధించిన సమాచారం కూడా సేకరిస్తారు.

**ఆహార భద్రత, ప్రాంతీయ ఆహారపు అలవాట్లు..**

ఈ ప్రశ్నావళి పారిశుధ్యం, మౌలిక సదుపాయాలకు సంబంధించిన అంశాలపై ప్రత్యేకంగా దృష్టి పెడుతుంది. ఇందులో మరుగుదొడ్ల లభ్యత, మురుగునీటి పారుదల వ్యవస్థలు, స్నానపు సౌకర్యాలకు సంబంధించిన ప్రశ్నలు ఉంటాయి. అదనంగా, కుటుంబాలలో వినియోగించే ప్రధాన ధాన్యాల గురించి కూడా సమాచారం సేకరించబడుతుంది. ఇది ఆహార భద్రత గతిశీలతను, ప్రాంతీయ - మిగతా3లో

# రేవంత్ రెడ్డి
# మైండ్ బ్లోయింగ్ గ్రాఫ్!

హైదరాబాద్ మార్చి 31:భారతదేశంలో అత్యంత ప్రభావవంతమైన వ్యక్తుల జాబితాలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాధించిన స్థానం ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ప్రధాని నరేంద్ర మోదీ అగ్రస్థానంలో నిలవడం సహజమే అయినా, కేవలం కొన్ని ఏళ్లలోనే ప్రాంతీయ స్థాయి నుంచి జాతీయ స్థాయి గుర్తింపు పొందడంలో రేవంత్ రెడ్డి సక్సెస్ గ్రాఫ్ అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. ఈ జాబితాలో ఆయనకు లభించిన 25వ స్థానం కేవలం ఒక అంకె మాత్రమే కాదు, అది ఆయన రాజకీయ చతురతకు, వ్యూహరచనకు నిదర్శనం.ఢిల్లీ రాజకీయాల్లో దశాబ్దాల అనుభవం ఉన్న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే (43వ స్థానం), గాంధీ కుటుంబ వారసురాలు ప్రియాంక గాంధీ (35వ స్థానం) వంటి ఉద్దండుల కంటే రేవంత్ రెడ్డి ముందు వరుసలో నిలవడం చిన్న విషయం కాదు. తన రాజకీయ గురువు, ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు 13వ స్థానంలో ఉండగా, ఆయన శిష్యుడిగా రాజకీయ ప్రస్థానం మొదలుపెట్టిన రేవంత్, అనతి కాలంలోనే 25వ



స్థానానికి చేరుకోవడం విశేషం. తెలంగాణ కాంగ్రెస్‌లో హేమాహేమీల వంటి సీనియర్లు ఉన్నప్పటికీ, - మిగతా3లో

## కమర్షియల్ ఎల్పీజీ సరఫరా పెంపు

**కేంద్ర కీలక నిర్ణయం**

పశ్చిమ ఆసియాలో యుద్ధం కారణంగా భారత్లో ఏర్పడిన ఇంధన సంక్షోభం సమయంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వాణిజ్య ఎల్పీజీ సరఫరాను పెంచి, సంక్షోభానికి ముందున్న స్థాయికి 50 శాతం వరకు పెంచారు. ప్రభుత్వం ప్రధానంగా ఆహార సేవా రంగం, సామాజిక వంటశాలలపై ఫోకస్ చేసింది. తద్వారా సామాన్య ప్రజలకు ఊరట కలగనుంది. దాంతో అత్యవసర సేవలు ప్రభావితం కాకుండా ఉంటాయి.మరో వైపు కేంద్ర ప్రభుత్వం పిఎన్జీ పైప్డ్ నేచురల్ గ్యాస్ వైపు మారడంపై ప్రజలను ప్రోత్సహిస్తోంది. దీని కోసం తప్పనిసరి రిజిస్ట్రేషన్ ప్రక్రియను కూడా అమలు చేస్తున్నారు. పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ ప్రకారం, ఈ అదనపు 20 శాతం ఎల్పీజీని అత్యధిక అవసరం ఉన్న ప్రాంతాలకు ప్రాధాన్యతనిస్తారు

## కమలంలో...
# కాసుల లొల్లి

హైదరాబాద్ మార్చి 31:రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల కోసం అధిష్టానం పంపిన నిధులు దుర్వినియోగమైనట్లు బీజేపీ నాయకత్వం ఒక అంచనాకు వచ్చినట్లు తెలిసింది. పార్టీ పంపిన ఫండ్స్ పూర్తిస్థాయిలో అభ్యర్థులకు చేరలేదని, మధ్యలో ఆయా జిల్లాల బాధ్యులు సగానికి పైగా 'స్వాహా' చేశారని




గుర్తించినట్లు సమాచారం. పలు రకాల సమీక్షల అనంతరం అగ్రనేతలు ఈ అంచనాకు వచ్చినట్లు చర్చ జరుగుతున్నది. ముందుగా చెప్పిన ఓట్లు, సీట్లకు, ఫలితాలకు ఏ మాత్రం పొంతన కుదరకపోవడంతో.. అభ్యర్థుల ఓటమికి వీరే కారణమని భావిస్తున్నట్లు టాక్. ఈ నేపథ్యంలో ఫండ్స్ స్వాహా చేసిన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని, అవసరమైతే పార్టీ పదవుల నుంచి తొలగించాలని నిర్ణయానికి వచ్చినట్లు చర్చ జరుగుతున్నది.లోక్ సభ ఎన్నికల్లో 36 శాతం ఓట్లతో - మిగతా3లో



## బీఆర్ఎస్ పార్టీ మీద బురదజల్లడానికే ఇదంతా

**హరీష్ రావు**

హైదరాబాద్:రేవంత్ రెడ్డి, సీఆర్ పాటిల్ వ్యాఖ్యలకు మధ్య తేడా లేదు. కాళేశ్వరం ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వమే అన్ని అనుమతులు ఇచ్చిందని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. మంగళవారం అయన మీడియాతో మాట్లాడారు.కేంద్ర ప్రభుత్వం, కేంద్ర మంత్రులు, సుప్రీంకోర్టు కూడా కాళేశ్వరం చాలా గొప్ప ప్రాజెక్టు అని ప్రశంసించాయి. నితిన్ గడ్కరీ, పీవీ నరసింహన్ లాంటి ఎందరో ప్రముఖులు కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణాకు వరప్రదాయిని అని అన్నారు. ఇటీవల పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం పెట్టిన ఎకనామిక్ సర్వేలో కాళేశ్వరం వల్ల సాగు భూమి విస్తీర్ణత పెరిగిందని చెప్పింది. అసెంబ్లీలో ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా కాళేశ్వరం వల్ల గత రెండేళ్లలో వేల ఎకరాల సాగు భూమి విస్తీర్ణత పెరిగిందని నివేదిక పెట్టాడని అన్నారు. ఆలేరు నియోజకవర్గంలో గంధమల్ల ప్రాజెక్టుకు, మూసీలో తెచ్చే గోదావరి నీళ్లు కాళేశ్వరం నుండి వచ్చేవే కదా. సీఆర్ పాటిల్ ఒకసారి తెలంగాణకు వచ్చి ఇక్కడ రైతులను అడిగితే, నీళ్లు ఎప్పుడు వచ్చాయి, ఎలా వచ్చాయని స్పష్టంగా తెలుస్తుంది. కేవలం బీఆర్ఎస్ పార్టీ మీద బురదజల్లడానికే కాళేశ్వరం గురించి తప్పుగా మాట్లాడుతున్నారు. ఒక్క 50 కోట్లు ఇస్తే ఇంకొక 2 లక్షల ఎకరాల ఆయకట్టు వస్తుందని, రెండేళ్ల నుండి దాదాపు 20 లేఖలు రాస్తున్నా ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందిస్తలేదు . మీకు మా మీద కోపం ఉంటే తీర్చుకోండి కానీ ఆ కోపాన్ని రైతుల మీద చూపకండని అన్నారు.

## ఏపీకి జూపల్లి
# వార్నింగ్

హైదరాబాద్, మార్చి 31:శ్రీశైలం జలాశయం నుంచి ఏపీ ప్రభుత్వం అక్రమంగా నీటిని తరలిస్తూ విద్యుత్ ఉత్పత్తి చేయడాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు తీవ్రంగా ఖండించారు. నీటి మట్టం తగ్గినప్పుడు విద్యుత్ ఉత్పత్తి చేయకూడదనే నిబంధన ఉన్నా.. ఏపీ ప్రభుత్వం దాన్ని ఉల్లంఘిస్తోందని. ఈ చర్య వల్ల తెలంగాణలో పంటలు ఎండిపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే ఏపీ అలుసుగా తీసుకుందని.. తెలంగాణ రైతుల హక్కుల కోసం సమిష్టిగా పోరాడుతామని జూపల్లి స్పష్టం చేశారు.శ్రీశైలం జలాశయంలో నీటి నిల్వలు కనిష్ట స్థాయికి చేరుకున్నా.. ఏపీ ప్రభుత్వం అక్రమంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తోందని తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తీవ్ర స్థాయిలో ఫైరయ్యారు. తెలంగాణ నీళ్లు దోచుకుంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఇవాళ గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మట్లాడిన ఆయన.. ఏపీ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. చంద్రబాబు సర్కార్ బరితెగించి నీటిని దోచుకుంటోందని ఆరోపించారు. తెలంగాణలోని ఖమ్మం, నల్గొండ, పాలమూరు జిల్లాల్లో సాగునీరు అందక పంటలు ఎండిపోతుంటే.. ఏపీ ప్రభుత్వం కనీసం తాగడానికి కూడా నీళ్లు లేకుండా విద్యుత్ ఉత్పత్తి పేరిట నీటిని తరలించడం అన్యాయమని ఫైరయ్యారు.జలాశయంలో నీటి నిల్వలు తక్కువగా ఉన్నప్పుడు విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేయాలనే స్పష్టమైన నిబంధనలు ఉన్నాయని మంత్రి గుర్తు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో




2012లో కూడా ఇలాగే అక్రమంగా నీటిని తరలించుకుపోయారని.. తాము ధర్నాకు దిగే వరకు ఆ దోపిడీ ఆగలేదని మంత్రి జూపల్లి విమర్శించారు. నాడు ఈ వ్యవహారంపై హైకోర్టును ఆశ్రయించగా.. అక్రమ నీటి తరలింపును ఆపాలని కోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని గుర్తు చేశారు. ఇప్పుడు కూడా అదే పంథాను అనుసరిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.శ్రీశైలం నీటిలో తెలంగాణకు 64 శాతం వాటా ఉందని.. దక్షిణ తెలంగాణ రైతాంగం హక్కులను కాలరాస్తే చూస్తూ ఊరుకోబోమని జూపల్లి స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. 'మీరేమైనా చదువురాని వాళ్లా? జీవోలు స్పష్టంగా ఉన్నాక ఇంకా సమాచారం - మిగతా3లో

## 15వ ఆర్థిక సంఘం
# నిధులు విడుదల




హైదరాబాద్, మార్చి 31:తెలంగాణ పల్లెలకు కేంద్రం తీపి కబురు చెప్పింది. 15వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు తెలంగాణ సహా ఆరు రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం రూ. 1,500 కోట్లకు పైగా గ్రాంట్లను విడుదల చేసింది. ఇందులో భాగంగా తెలంగాణ పంచాయతీరాజ్ సంస్థలకు రూ. 247.94 కోట్ల అన్‌టైడ్ గ్రాంట్స్ కేటాయించారు. ఈ నిధులతో రాష్ట్రంలోని 12600 గ్రామ పంచాయతీల్లో మౌలిక సదుపాయాల కల్పన జరగనుంది. జీతాలకు కాకుండా కేవలం అభివృద్ధి పనులకే ఈ నిధులను వినియోగించాలని కేంద్రం నిబంధన విధించింది.తెలంగాణలోని గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. 15వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు రాష్ట్రంలోని పంచాయతీరాజ్ సంస్థల బలోపేతానికి రూ. 247.94 కోట్ల నిధులను విడుదల చేస్తూ కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన మొదటి విడత అన్‌టైడ్ గ్రాంట్స్ కింద ఈ నిధులను కేటాయించింది. తెలంగాణతో పాటు మరో ఐదు రాష్ట్రాలకు కలిపి మొత్తం రూ. 1,500 కోట్లకు పైగా నిధులను కేంద్రం విడుదల చేసింది.కేంద్రం విడుదల చేసిన ఈ నిధుల ద్వారా తెలంగాణవ్యాప్తంగా ఉన్న దాదాపు 12,600 గ్రామ పంచాయతీలకు నేరుగా ప్రయోజనం చేకూరనుంది. ఇవి అన్‌టైడ్ గ్రాంట్స్ కావడంతో, స్థానిక అవసరాలకు అనుగుణంగా గ్రామ సభలు నిర్ణయించిన ప్రాధాన్యత పనులకు ఈ నిధులను - మిగతా3లో

## సంపాదకీయం

# భారత్‌కు ఫుల్ ఎనర్జీ

గల్ఫ్ ఉద్రిక్తతల నేపథ్యంలో ఇంధన కొరత ప్రపంచ మార్కెట్లను అతలాకుతలం చేసింది. లక్షల కోట్ల సంపద ఆవిరైంది. చమురు, ఎల్‌పీజీ, ఎల్ఎన్‌జీ కొరత ఏర్పడింది. పాకిస్తాన్, శ్రీలంక, బంగ్లాదేశ్ తీవ్ర ఇబ్బందులు పడ్డాయి. మరోవైపు భారత్‌లో చమురు కొరత లేకపోయినా ఎల్‌పీజీ కొరత ఏర్పడింది. దీంతో కేంద్రం గృహ, కమర్షియల్ గ్యాస్ ధరలు పెంచింది. అయినా ఎల్‌పీజీ సరిపడా లేకపోవడంతో కమర్షియల్ సరఫరా నిలిపివేసింది. తాజాగా ఐదు రోజుల యుద్ధ విమరణ, భారత్ ఇరాన్‌తో జరిపిన చర్చలు, ఇరుదేశాల దౌత్య సంబంధాలతో హోర్మూజ్‌లో చిక్కుకున్న భారత నౌకలు భారత్‌కు వస్తున్నాయి. ఈ క్రమంలో భయాలను పటాపంచలు చేస్తూ కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. రాబోయే 60 రోజులకు దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్‌కు ఎలాంటి లోటు ఉండదని, వంటగ్యాస్ (ఎల్‌పీజీ) సరఫరా కూడా యథావిధిగా సాగుతుందని స్పష్టం చేసింది.కేంద్ర పెట్రోలియం శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం.. దేశంలోని ప్రతీ పౌరుడి అవసరాలకు సరిపడా నిల్వలు ఉన్నాయి. వచ్చే 60 రోజులకు సరిపడా స్టాక్ సిద్ధంగా ఉంది. తర్వాతి రెండు నెలలకు అవసరమైన ముడిచమురు దేశానికి చేరుతోంది. హోర్మూజ్ జలసంధి మూతపడినా, ఇతర మార్గాల ద్వారా 70% క్రూడాయిల్ సరఫరా కొనసాగుతోంది. అమెరికా, రష్యా, ఆస్ట్రేలియా, ఇతర దేశాల నుంచి 8 లక్షల టన్నుల ఎల్‌పీజీ దిగుమతికి ఏర్పాట్లు జరిగాయి. వచ్చే నెల రోజుల వరకు ఎలాంటి ఇబ్బంది ఉండదు.ఇరాన్ యుద్ధం కారణంగా హోర్మూజ్ జలసంధి వద్ద ప్రతికూల పరిస్థితులు ఉన్నా, భారత్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న 41కి పైగా దేశాల నుంచి క్రూడాయిల్‌ను దిగుమతి చేసుకుంటోంది. ఇంతకు ముందు హోర్మూజ్ ద్వారా వచ్చిన దానికంటే ఎక్కువ ముడిచమురు ఇప్పుడు ఇతర మార్గాల్లో వస్తోంది. దేశంలోని అన్ని చమురు శుద్ధి కర్మాగారాలు (రిఫైనరీలు) వంధశాతం కన్నా ఎక్కువ సామర్థ్యంతో పనిచేస్తున్నాయి.గ్యాస్ కొరత వస్తుందనే భయంతో ప్రజలు ముందే బుక్ చేసుకోవడం వల్ల తలెత్తింది. గత కొన్ని రోజులుగా డిమాండ్ ఒక్కసారిగా పెరిగింది. దీంతో కొన్ని ప్రాంతాల్లో తాత్కాలిక ఆలస్యం జరిగినా, సరఫరా వ్యవస్థ పూర్తి స్థాయిలో పనిచేస్తోంది. గృహ వినియోగదారులకు వంద శాతం ఎల్పీజీ సిలిండర్లు అందుబాటులో ఉన్నాయని ప్రభుత్వం ధ్రువీకరించింద భారత్ ఇంధన భద్రత కోసం 85 శాతం క్రూడ్ ఆయిల్ దిగుమతిని 41కిపైగా దేశాల నుంచి కొనసాగిస్తోంది. రిఫైనరీలన్నీ వందశాతానికిపైగా సామర్థ్యంతో పనిచేస్తున్నాయి. మరోవైపు 8 లక్షల టన్నుల ఎల్‌పీజీ అమెరికా, రష్యా, ఆస్ట్రేలియా నుంచి వస్తోంది. దీంతో పెట్రోల్ 60 రోజులకు, డీజిల్ 90 రోజులకు సరిపడా నిల్వలు ఉన్నాయి.ప్రపంచంలో ఏం జరిగినా భారత ఇంధన భద్రతకు లోటు లేదని కేంద్రం స్పష్టం చేసింది. పశ్చిమాసియా యుద్ధ కారణంగా ఇంధన సంక్షోబం ఏర్పడింది. పాకిస్తాన్, బంగ్లాదేశ్, శ్రీలంకతోపాటు భారత్ కూడా ఇబ్బంది పడుతోంది. ఎల్‌పీజీ, సీఎన్‌జీ, ఎల్ఎన్‌జీ ఇబ్బందలు తలెత్తాయి. ఇరాన్ హోర్మూజ్ జలసంధిని మూసివేయడంతో చమురు రవాణా ఆగిపోయింది. భారత్ దిగుమతి చేసుకునే చమురులో 40 శాతం ఈ సంధి గుండానే వస్తుంది. యుద్ధం ఇంకా పెరిగి జలసంధి పూర్తిగా మూసివేస్తే చమురు రవాణా పూర్తిగా నిలిచిపోతుంది. ఈ నేపథ్యంలో భారత ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. ప్లాన్ బి సిద్ధం చేస్తోంది.ఏప్రిల్ నెలకు 6 కోట్ల బ్యారెళ్ల ముడి చమురును రష్యా నుంచి దిగుమతి చేస్తూ భారత్ కొత్త ఒప్పందాలు ఖరారు. అమెరికా మినహాయింపుతో (30 రోజులు) తక్కువ ధరలకు సరఫరా భద్రపరుస్తోంది, ఇది దేశ ఆర్థిక భారాన్ని తగ్గిస్తుంది. దేశంలో 33 లక్షల టన్నులు పైగా చమురు, మార్కెటింగ్ కంపెనీలతో కలిపి 74 రోజుల అవసరానికి సరిపోయే స్టాక్ సిద్ధంగా ఉంది. పెట్రోల్, డీజిల్, గ్యాస్ కొరత లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది33 కోట్ల కుటుంబాలకు వంటగ్యాస్ అందేలా దేశీయ ఉత్పత్తి 25 శాతం పెంచారు. హోటళ్లు మూతలు, అధిక కొనుగోళ్లకు ప్రజలు ఆందోళన చెందకుండా పర్యవేక్షణ పెంచారు. చమురు దిగుమతి చేసుకునే దేశాల సంఖ్యను కూడా 27 నుంచి 41 దేశాలకు విస్తరించింది. సౌదీ, యూఏఈ పైప్‌లైన్లు, అమెరికా మార్గాలు ప్రత్యామ్నాయాలుగా పనిచేస్తున్నాయి. పీఎన్‌జీ విస్తరణకు ఆదేశాలు జారీ చేసింది.ప్లాన్ బీ వల్ల ఇంధన ధరలు అదుపులో ఉంటాయి. ఆర్థిక స్థిరత్వం కాపాడుకుంటుంది. రష్యా ఆధారం పెరగడం అమెరికా సంబంధాలకు సవాల్. కానీ, దౌత్య నైపుణ్యంతో భారత్ భద్రత పటిష్టం అవుతోంది. భవిష్యత్తులో వైవిధ్యీకరణ దీర్ఘకాల రక్షణగా మారుతుంది. వ్యూహాత్మక నిల్వలు, వైవిధ్యీకృత దిగుమతి మార్గాలు, పూర్తి సామర్థ్యంతో నడుస్తున్న రిఫైనరీలు దేశాన్ని ఇంధన సంక్షోభం నుంచి కాపాడుతున్నాయి. ప్రజలు ధైర్యంగా ఉండి, పుకార్లకు భయపడకుండా సాధారణ వినియోగం

# 500 కోట్లపైగానే ఆస్తి....



**చెన్నై, మార్చి 31:**తమిళనాడు లో మరో నెలరోజుల్లో ఎన్నికల సమరం జరగబోతోంది. ఈసారి తమిళ రాజకీయాలపై యూత్ ప్రత్యేకమైన ద్రుష్టి పెట్టింది. ఎందుకంటే తమిళనాడు బిగ్గెస్ట్ సూపర్ స్టార్స్ లో ఒకరైన విజయ్ ుఎఖ పార్టీ ద్వారా పోటీ చేయబోతున్నాడు. నిన్ననే ఈ పార్టీ నుండి పోటీ చేయబోతున్న ఎమ్మెల్యే అభ్యర్థుల మొదటి జాబితా ని విడుదల చేసాడు విజయ్. తన దగ్గర కారు డ్రైవర్ గా పని చేసే వ్యక్తి కొడుక్కి ఎమ్మెల్యే టికెట్ ఇవ్వడం తమిళనాడు రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది. ఇది కదా న్యూ ఏజ్ పాలిటిక్స్ అంటే అంటూ సోషల్ మీడియా లో నెటిజెన్స్ విజయ్ ని పొగుడుతున్నారు . ఇది కాసేపు పక్కన పెడితే సీనియర్ ఎన్టీఆర్ , చిరంజీవి, పవన్ కళ్యాణ్ తరహాలోనే రెండు స్థానాల్లో పోటీ చేయబోతున్నాడు. అందులో ఒక స్థానం పెరంబూర్ కాగా, మరొక స్థానం ట్రిచి సిటీ భారీ ర్యాలీ నడుమ అభిమానులతో ఊరేగింపు గా వెళ్లి పెరంబూరు లో ఎన్నికల నామినేషన్ వేసాడు విజయ్. అంతే కాకుండా నేటి నుండే ఆయన ఎన్నికల ప్రచారం కూడా మొదలు పెట్టేసాడు.

ఇదంతా పక్కన పెడితే నేడు ఆయన సమర్పించిన నామినేషన్స్ పాత్రలలో ఆయన ఆస్తుల వివరాలను చూసి షాక్ అవుతున్నారు నెటిజెన్స్. ఆయన ఆదాయం వివరాలను ఒకసారి పరిశీలిస్తే 2020 -- 2021 వరకు 8 కోట్ల రూపాయిలు సంపాదించగా, 2021 -- 2022 సంవత్సరానికి 237 కోట్లు, 2022 -- 2023 వరకు 198 కోట్లు , 2023 -- 2024 వరకు 105 కోట్ల రూపాయిలు, 2024 నుండి 2025 వరకు 184 కోట్ల రూపాయిలు సంపాదించినట్టు తెలుస్తోంది. ఇక ఆస్తుల వివరాల్లోకి వెళ్తే మూవబుల్ అస్సెట్స్ 400 కోట్ల రూపాయిలు ఉండగా, నాన్ మూవబుల్ అస్సెట్స్ 115 కోట్ల రూపాయిల వరకు ఉంటుంది.విజయ్ తమిళనాడు లో ప్రస్తుతం స్టార్ స్టేటస్ పరంగా సూపర్ స్టార్ రజినీకాంత్ కనే పెద్దోడు. టాక్ తో సంబంధం లేకుండా విజయ్ సినిమాలు ఇక్కడ బాక్స్ ఆఫీస్ వద్ద సెన్సేషనల్ రికార్డ్స్ ని నమోదు చేసుకుంటూ ఉంటుంది . అందుకే ఒక్కో సినిమాకు ఆయన 150 కోట్ల రూపాయలకు పైగా రెమ్యూనరేషన్ అందుకుంటూ ఉంటాడు. వీటితో పాటు ఓటీటీ రైట్స్ మరియు ఇతర నాన్ థియేట్రికల్ రైట్స్ కలిపి విజయ్ సినిమాకు కనీవినీ ఎరుగని రేట్స్ పలుకుంటూ ఉంటాయి. వాటిల్లో కూడా విజయ్ కి లాభాలు ఉన్నాయి. అవన్నీ ఈ ఎన్నికల అఫిడిఫీట్ లో పొందుపరిచాడు విజయ్. అందుకు సంబంధించిన నామినేషన్ పత్రాలు ఇప్పుడు సోషల్ మీడియా లో బాగా వైరల్ అయ్యాయి.

# లివ్ ఇన్ రిలేషన్ షిప్ లో ఉంటే కుటుంబ హోదా...

**హైదరాబాద్, మార్చి31:**లివ్ ఇన్ రిలేషన్ షిప్‌లో ఉండే వారి పట్ల కేంద్రం సంచలన నిర్ణయం తీసుకుంది. కేంద్ర ప్రభుత్వం సెన్సస్ నిబంధనల్లో కీలక మార్పులు చేసింది. దేశవ్యాప్తంగా జనగణన -- 2027 ప్రక్రియ ఏప్రిల్ 1వ తేదీ నుంచి ప్రారంభవుతుంది. అయితే, ఈ జనగణనలో సహజీవన జంటలకు సైతం కుటంబ హోదా ఇవ్వనున్నట్లు కేంద్రం ప్రకటించింది. చాలాకాలంగా కలిసి ఉంటున్న వారిని ఇకపై ఒకే కుటుంబంగా గుర్తించాలని నిర్ణయం తీసుకున్నట్లు తాజాగా కేంద్రం వెల్లడించింది.మన దేశంలో సాధారణంగా పదేళ్లకోసారి జనగణన నిర్వహిస్తారు. ఆఖరిగా 2011లో జనాభా లెక్కలు సేకరించారు. కొవిడ్ కారణంగా 2021లో నిర్వహించాల్సిన జనగణనకు ఆటంకం ఏర్పడింది. ప్రస్తుతం జనాభా గణన ప్రక్రియ ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమవుతుంది. రెండు దశల్లో నిర్వహిస్తారు. మొదటి దశలో భాగంగా గృహ గణన చేపట్టనున్నారు. మొబైల్ యాప్ ద్వారా అధికారులు ఇంటింటికీ వెళ్లి ఇళ్ల వివరాలు సేకరించనున్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి నెలలో రెండో దశలో జనాభా లెక్కల సేకరణ ఉంటుంది. జనగణన కోసం 33 ప్రశ్నలతో ఓ ప్రశ్నావళిని రూపొందించారు. రెండో దశలో లడఖ్ కేంద్ర పాలిత, జమ్మూకాశ్మీర్ కేంద్ర పాలిత ప్రాంతాల్లోని మంచుతో కప్పబడిన ప్రాంతాలు, అలాగే హించల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలు మినహా భారతదేశం వ్యార్తంగా జనాభా గణన ప్రారంభమవుతుంది. ఈ రెండు రాష్ట్రాల్లో ఈ ఏడాది సెప్టెంబర్ నెలలో నిర్వహిస్తారురెండవ దశలో కుటుంబంలో వ్యక్తుల సంఖ్య, వారి పేర్లు, వయస్సు, లింగం, వైవాహిక స్థితి, కులం, మతం, విద్య, భాష, వైకల్యం, వలస, వృత్తి, సంతానోత్పత్తి (వివాహిత మహిళల విషయంలో) వివరాలు సేకరిస్తారు. అదేవిధంగా ఫోన్లు, ఇంటర్నెట్, వాహనాలు, గృహోపకరణాలు వంటి వివరాలను అడుగుతారు. తృణ ధాన్యాల వినియోగం, తాగునీటి వనరులు, మరుగుదొడ్ల వాడకం, వంటగది సౌకర్యాలు, పంటకు వినియోగించే ఇంధనం వివరాలు సేకరిస్తారు.




# భారీగా తగ్గిన ఇంజనీరింగ్ అప్లికేషన్స్

**హైదరాబాద్ మార్చి 31:**రాష్ట్రంలో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే టీజీ ఈఏపీసెట్ 2026 ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు ఆలస్య రుసుములేకుండా ఏప్రిల్ 4తో ముగియనున్నాయి. ఈ క్రమంలో ఈసారి ఈఏపీసెట్ దరఖాస్తుల సంఖ్య తగ్గే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. మార్చి 28 నాటికి ఇంజినీరింగ్‌కు 1,78,442 మంది, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగానికి 73,782 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. ఆలస్య రుసుం లేకుండా దరఖాస్తు చేసుకునే గడువు ఏప్రిల్ 4తో ముగుస్తుంది. అంటే మరో 6 రోజులే సమయం ఉంది. ఆ తర్వాత ఆలస్య రుసుంతో మే 2 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. అయినప్పటికీ గత కొన్నేళ్ల గణాంకాలను పరిశీలిస్తే ఆ సంఖ్య 6 వేలకు మించదని తెలుస్తుంది. గత ఏడాది ఇంజినీరింగ్ విభాగానికి ఏకంగా 2.20 లక్షల దరఖాస్తులు అందాయి. ఇక అగ్రికల్చర్‌కు దాదాపు 87 వేలు వస్తాయి. మొత్తం కలిపి 3.07 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈసారి ఇంజినీరింగ్‌కు 2 లక్షలు, అగ్రికల్చర్‌కు 80 వేల మంది లోపే దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. దీంతో దాదాపు 30 వేల వరకు దరఖాస్తులు తక్కువగా వచ్చే అవకాశం ఉందని ఎప్‌సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ కె




విజయకుమార్‌రెడ్డి తెలిపారు.గత ఏడాది ఏపీ విద్యార్థులు భారీగా దరఖాస్తు చేసుకోవడం వల్ల దరఖాస్తుల సంఖ్య పెరిగింది. ఈఏపీసెట్ ఇంజినీరింగ్ విభాగం పరీక్షలు మే 9 నుంచి 11 వరకు జరుగుతాయి. ఇక ఆ మరుసటి రోజు నుంచే అంటే మే 12 నుంచి ఏపీ ఇంజినీరింగ్ విభాగం పరీక్షలు మొదలవుతాయి. దీంతో ఈసారి ఏపీ విద్యార్థుల సంఖ్య తగ్గింది. గత ఏడాది ఇంజినీరింగ్‌కు 17,834 మంది, అగ్రికల్చర్‌కు 2,877 మంది ఇతర రాష్ట్రాల విద్యార్థులు దరఖాస్తు చేశారు. ఈసారి ఇప్పటివరకు ఇంజినీరింగ్‌కు 8 వేలు, అగ్రికల్చర్‌కు 1400 మంది మాత్రమే దరఖాస్తు చేశారు.

ఆలస్య రుసుము లేకుండా దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 4, 2026.

రూ.250 ఆలస్య రుసుముతో దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 10, 2026.

రూ.500 ఆలస్య రుసుముతో దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 15, 2026.

రూ.2,500 ఆలస్య రుసుముతో దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 20, 2026.

రూ.5,000 ఆలస్య రుసుముతో దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 24, 2026.

రూ.10,000 ఆలస్య రుసుముతో దరఖాస్తుకు చివరి తేదీ: మే 2, 2026 వరకు

దరఖాస్తు సవరణ: ఏప్రిల్ 6 నుంచి 8 వరకు.

అగ్రికల్చర్, ఫార్మసీ హాల్‌టికెట్ డౌన్‌లోడ్ తేదీ: ఏప్రిల్ 23, 2026.

ఇంజినీరింగ్ హాల్‌టికెట్ డౌన్‌లోడ్ తేదీ: ఏప్రిల్ 27, 2026.

అగ్రికల్చర్ a ఫార్మసీ పరీక్ష తేదీలు: మే 4, 5 తేదీల్లో

ఇంజినీరింగ్ పరీక్ష తేదీలు: మే 9 నుంచి మే 11 వరకు.

# తమిళనాడులో మనీ కూపన్ల మాయాజాలం

**చెన్నై, మార్చి 31:**తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల కురుక్షేత్రంలో 'మేనిఫెస్టో'ల యుద్ధం తారస్థాయికి చేరింది. ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ విడుదల చేసిన డీఎంకే మేనిఫెస్టో, ప్రత్యర్థుల ఎత్తుగడలకు ఏమాత్రం తలొగ్గకుండా తన ద్రవిడ మోడల్ నమ్మకాన్నే ప్రతిఫలించింది. అన్నాడీఎంకే ఉచితాల వర్షం కురిపించినా, విజయ్ తన టీవీకే ద్వారా కొత్త ఆశలు రేపినా.. స్టాలిన్ మాత్రం తనదైన శైలిలో, అదనపు ఆకర్షణల కంటే ఆచరణాత్మక పాలనకే మొగ్గు చూపారుడీఎంకే మేనిఫెస్టోను సూపర్ స్టార్ గా అభివర్ణించిన స్టాలిన్, ప్రత్యర్థుల ఉచితాలకు దీటుగా తనదైన శైలిలో ఇల్లత్తరసి అనే పథకాన్ని ప్రకటించారు ఆదాయ పన్ను పరిధిలోకి రాని గృహిణులకు ఏకంగా రూ.8,000 విలువైన కూపన్ అందజేస్తామని, దీనితో వారికి నచ్చిన వాషింగ్ మెషీన్, టీవీ లేదా ఫ్రిజ్ వంటి ఎలక్ట్రానిక్ వస్తువులను కొనుగోలు చేసుకోవచ్చని వెల్లడించారు. అలాగే కలైంజ్ఞర్ మహిళా హక్కు పథకం కింద ఇస్తున్న నగదును ?1,000 నుండి 2,000కు పెంచుతున్నట్లు ప్రకటించారు. ప్రత్యర్థి పార్టీలు తన పాత పథకాలనే ప్రాతిపదికగా తీసుకుని పోటీ పడుతుండటంతో, తాను పెద్దగా పంథా మార్చుకోవాల్సిన అవసరం లేదని స్టాలిన్ బలంగా నమ్ముతున్నారు.అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి తన మేనిఫెస్టోలో ఉచిత రిఫ్రిజిరేటర్లు, ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు, మహిళలకు రూ.2,000 చొప్పున ఆర్థిక సాయం వంటి భారీ హామీలు గుప్పించారు. అయితే, స్టాలిన్ దీనికి భిన్నంగా ఎంపిక చేసుకునే అవకాశాన్ని లబ్ధిదారులకే వదిలేశారు. ప్రభుత్వం నేరుగా వస్తువులు ఇచ్చే కంటే, ప్రజలే తమకు నచ్చిన వస్తువును కొనుగోలు చేసుకునే వెసులుబాటు కల్పించడం ద్వారా అవినీతికి తావులేకుండా చేయవచ్చని స్టాలిన్ భావిస్తున్నారు. అన్నాడీఎంకే ఉచితాల హోరును చూసి ఆయన ఏమాత్రం ఆందోళన చెందకుండా, తన పాత పథకాలనే స్కేల్-అప్ చేయడం ఆయన ధీమాకు నిదర్శనం.సినీ నటుడు విజయ్ తన తమిళగ వెట్రి కళగం మేనిఫెస్టోలో నిరుద్యోగ భృతి , డ్రగ్-ఫ్రీ స్టేట్ వంటి అంశాలకు ప్రాధాన్యత ఇచ్చారు. కొత్త ఓటర్లు, యువతను ఆకట్టుకోవడమే లక్ష్యంగా విజయ్ అడుగులు వేస్తుంటే, స్టాలిన్ మాత్రం నాన్ ముదల్వన్ పథకం ద్వారా ఇప్పటికే 5 లక్షల మంది యువతకు శిక్షణ, నెలకు 1,500 స్టైపెండ్ ఇస్తున్నామని గుర్తు చేస్తున్నారు. కొత్త పార్టీల రాకతో ఓట్లు చీలిపోయినా, తన డెలివరీ సిస్టమ్ ( బలంగా ఉండటంతో విజయం తనదేనని స్టాలిన్ ఫిక్స్ అయ్యారు.తమిళనాడు చరిత్రలో ఏ ప్రభుత్వం చేయని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేశామని, ప్రజల మద్దతుతో ఏడవసారి ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని స్టాలిన్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యర్థులు తనను అనుకరిస్తున్నారే తప్ప కొత్తగా ఏమీ చేయడం లేదన్నది ఆయన విశ్లేషణ. ఏప్రిల్ 23న జరగనున్న పోలింగ్‌లో ఈ మేనిఫెస్టోల యుద్ధం ఎవరిని సింహాసనంపై కూర్చోబెడుతుందో చూడాలి.

# ఏపీ రాజధాని అమరావతికి చట్టబద్ధత..

## పార్లమెంటులోకి కీలక బిల్లు.. సర్వత్రా ఉత్కంఠ

**న్యూఢిల్లీ/ అమరావతి, మార్చి 31:**ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి పూర్తిస్థాయి చట్టబద్ధత కల్పించే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. బుధవారం (ఏప్రిల్ 1న) లోక్‌సభలో ఏపీ పునర్విభజన చట్టం సవరణ బిల్లు-2026 పేరుతో ఈ ప్రతిపాదిత బిల్లును ప్రవేశపెట్టనున్నట్లు కేంద్ర హోంశాఖ ఇప్పటికే స్పీకర్ కార్యాలయానికి సమాచారం అందించింది. రాష్ట్ర విభజన తర్వాత నెలకొన్న రాజధాని సందిగ్ధతకు ముగింపు పలికేలా, అమరావతికి రాజ్యాంగపరమైన రక్షణ కల్పించడమే ఈ బిల్లు ప్రధాన ఉద్దేశం.ఏప్రిల్ 1న ఉదయం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగే కేంద్ర కేబినెట్ భేటీలో ఈ సవరణ బిల్లుకు అధికారికంగా ఆమోదం తెలపనున్నారు. కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన వెంటనే, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ లోక్‌సభలో ఈ బిల్లును ప్రవేశపెట్టనున్నారు. దీని ద్వారా ఏపీ రాజధాని అమరావతి హోదాపై ఉన్న న్యాయపరమైన, సాంకేతిక పరమైన చిక్కులు తొలగిపోయి, కేంద్రం నుంచి అందే నిధులు, అభివృద్ధి కార్యక్రమాలకు మార్గం సుగమం కానుంది.ఏపీ రాజకీయాల్లో, రాష్ట్ర అభివృద్ధిలో ఈ బిల్లు అత్యంత కీలకం కానుంది. గత కొన్నేళ్ళుగా అమరావతి రాజధాని విషయంలో కొనసాగుతున్న ఉత్కంఠకు ఈ పార్లమెంటు బిల్లుతో ఒక స్పష్టత రానుంది. కేంద్ర ప్రభుత్వం ఈ ప్రక్రియను వేగవంతం చేయడంతో ఏపీ ప్రజలు, అమరావతి రైతులు ఈ పరిణామంపై ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.ఆంధ్రప్రదేశ్ ఏకైక, శాశ్వత రాజధానిగా అమరావతిని ఖరారు చేస్తూ ఇటీవల రాష్ట్ర అసెంబ్లీ తీర్మానం చేసింది. 2014 విభజన చట్టంలో ఆంధ్రప్రదేశ్‌కు కొత్త రాజధాని ఉంటుందని పేర్కొన్నారే తప్ప, 'అమరావతి' అనే పేరును స్పష్టంగా పొందుపరచలేదు. గత ప్రభుత్వ హయాంలో తలెత్తిన 3 రాజధానుల గందరగోళం భవిష్యత్తులో పునరావృతం కాకుండా ఉండాలంటే, విభజన చట్టంలోనే అమరావతి పేరు ఉండాలని ప్రస్తుత ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం సెక్షన్ 5(2) కు సవరణ కోరుతూ చేసిన ఈ తీర్మానం కేవలం ఒక ప్రకటన మాత్రమే కాదు, అమరావతికి బలమైన చట్టపరమైన రక్షణ కల్పించే దిశగా వేసిన అడుగు.రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన ఈ తీర్మానం



తదుపరి చర్యల కోసం కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు పంపిస్తారు. సాధారణంగా ఇటువంటి అంశాలపై నిర్ణయం తీసుకోవడానికి సమయం పట్టినప్పటికీ, ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఉన్న సమన్వయం కారణంగా ఈ ప్రక్రియ వేగవంతం కానుంది. కేంద్ర క్యాబినెట్ ఈ ప్రతిపాదనను పరిశీలించి ఆమోదం తెలిపిన తర్వాత, దీనిని ఒక సవరణ బిల్లు రూపంలో పార్లమెంట్‌లో ప్రవేశపెడతారు. లోక్‌సభ మరియు రాజ్యసభలు ఈ బిల్లును ఆమోదించి, గౌరవ రాష్ట్రపతి సంతకం చేసిన వెంటనే ఇది గెజిట్ నోటిఫికేషన్‌గా మారుతుంది.పార్లమెంట్ ఆమోదంతో 2014 ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో అమరావతి పేరు అధికారికంగా చేరుతుంది. దీనివల్ల అమరావతికి 'స్టాట్యూటరీ స్టేటస్' (చట్టబద్ధమైన హోదా) లభిస్తుంది. ఈ చట్టపరమైన రక్షణ వల్ల భవిష్యత్తులో ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా, పార్లమెంట్ చట్టాన్ని మార్చకుండా రాజధానిని మార్చడం సాధ్యం కాదు. ఇది అమరావతి ప్రాంత రైతులకు, అక్కడ పెట్టుబడులు పెట్టే పారిశ్రామికవేత్తలకు మరియు ప్రజలకు పెద్ద ఎత్తున భరోసాను ఇస్తుంది. కేంద్ర ప్రభుత్వం కూడా ఈ విషయంలో సానుకూల సంకేతాలు ఇవ్వడంతో, ఈ ప్రక్రియ త్వరలోనే పూర్తి కావచ్చని అంచనా వేస్తున్నారు.

**వైసీపీ స్టాండ్ ఏంటీ**

ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లు పార్లమెంట్ ముందుకు రావడం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కీలక మార్పులు తేనున్నాయి. ముఖ్యంగా ఈ బుధవారం లోక్‌సభలో ఈ బిల్లు ప్రవేశపెట్టనున్న సమయంలో ప్రతిపక్ష వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అనుసరించబోయే వ్యూహం ఇప్పుడు సర్వత్రా ఆసక్తిని రేకెత్తిస్తోంది. గతంలో కేంద్రం ప్రవేశపెట్టిన పలు బిల్లులకు మద్దతు నిలిచిన వైసీపీ, సొంత రాష్ట్ర ప్రయోజనాలతో ముడిపడి ఉన్న అమరావతి విషయంలో ఏ అడుగు వేస్తుందన్నది రాజకీయ విశ్లేషకులకు ఒక సవాలుగా మారింది.ఇటీవలే ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో అమరావతిని ఏకైక రాజధానిగా గుర్తిస్తూ చేసిన తీర్మానానికి వైసీపీ ఎమ్మెల్యేలు హాజరుకాకుండా దూరంగా ఉన్నారు. అసెంబ్లీలో ఈ తీర్మానాన్ని అధికారికంగా స్వాగతించకపోవడమే కాకుండా, ఇది కేవలం రాజకీయ డ్రామా అని ఆ పార్టీ నేతలు కొట్టిపారేస్తున్నారు. ఈ కారణంగా పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును ప్రవేశపెట్టినప్పుడు వైసీపీ ఎంపీలు దీనిని వ్యతిరేకిస్తారా లేదా గైర్హాజరవుతారా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఒకవేళ వ్యతిరేకిస్తే అమరావతి వ్యతిరేకి అనే ముద్ర పడే ప్రమాదం ఉంది, సమర్థిస్తే తమ పాత మూడు రాజధానుల వాదనకు తిలోదకాలు ఇచ్చినట్లవుతుంది.వైసీపీ నేతలు గత కొన్ని రోజులుగా ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో ప్రాంతీయ సెంటిమెంట్లను రగిల్చేలా వ్యాఖ్యలు చేస్తున్నారు. అమరావతికి చట్టబద్ధత కల్పిస్తే ఇతర ప్రాంతాలకు అన్యాయం జరుగుతుందనే ప్రచారాన్ని వారు గట్టిగా వినిపిస్తున్నారు. ఈ వ్యూహం ద్వారా అమరావతి బిల్లును పార్లమెంట్‌లో వ్యతిరేకించడానికి ఒక బలమైన సాకును వెతుక్కుంటున్నట్లు కనిపిస్తోంది. అయితే, కేంద్రంతో సత్సంబంధాలు కొనసాగించే క్రమంలో నేరుగా బిల్లును వ్యతిరేకించకుండా, చర్చలో పాల్గొని తమ అభ్యంతరాలను వ్యక్తం చేసి ఓటింగ్‌కు దూరంగా ఉండే అవకాశం కూడా లేకపోలేదని అంచనా వేస్తున్నారు. రాజకీయంగా చూస్తే వైసీపీ ఇప్పుడు ఆత్మరక్షణలో పడింది. అమరావతికి చట్టబద్ధత లభిస్తే, భవిష్యత్తులో ఏ ప్రభుత్వం వచ్చినా రాజధానిని మార్చడం అసాధ్యం అవుతుంది. ఇది జగన్ మోహన్ రెడ్డి ప్రతిపాదించిన వికేంద్రీకరణ సిద్ధాంతానికి గట్టి దెబ్బ. అందుకే, వైసీపీ ఈ బిల్లును పరిపాలనాపరమైన అవసరం కంటే రాజకీయ కక్ష గా చిత్రీకరించే ప్రయత్నం చేస్తోంది.

# కమలంలో... కాసుల లొల్లి

- మొదటి పేజీ తరువాయి

బీజేపీ ఎనిమిది స్థానాలను గెలుపొందింది. అంతేకాకుండా పార్టీకి ఎమ్మెల్యేలతోపాటు ఎమ్మెల్సీలు సైతం ఉన్నారు. పట్టణాల ప్రాంతాల్లో బీజేపీకి పట్టు ఉన్నదని సర్వేల ద్వారా గుర్తించగా.. మున్సిపల్ ఎన్నికలపై ఆ పార్టీ భారీ ఆశలు పెట్టుకున్నది. గతంలో కంటే స్థానాలు పెరుగుతాయని, కొన్ని మేయర్, చైర్మన్లయినా కైవసం చేసుకుంటామని భావించింది. మహారాష్ట్ర మంత్రి ఆశీష్ షెలార్ కు కీలక బాధ్యతలు అప్పగించింది. అనంతరం ఎన్నికల కోసం భారీగా నిధులు సమకూర్చినట్లు తెలిసింది. అయితే ఫలితాలను చూసి నాయకులు తీవ్ర నిరాశకు గురైనట్లు సమాచారం. దీంతో మున్సిపాలిటీలు, జిల్లాల వారీగా ఫలితాలపై పార్టీ సమీక్షించింది. కనీస స్థాయిలో కౌన్సిలర్లు, కార్పొరేటర్ స్థానాల్లో విజయం సాధించకపోవడం, చైర్మన్, మేయర్ స్థానాలను సైతం కైవసం చేసుకోవడంలో విఫలం కావడం పట్ల రాష్ట్ర నాయకత్వంపై అధిష్ఠానం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లుగా పార్టీ నాయకుల ద్వారా తెలిసింది.రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వార్డులు, డివిజన్లను బీజేపీ ఏ, బీ, సీ, డీ గా విభజించింది. విజయావకాశాలు ఏ మాత్రం లేని వాటిని డీ కేటగిరిలో చేర్చింది. ఆ తర్వాత ఏ, బీ, సీ కేటగిరీల వార్డులకు కొంత మొత్తాన్ని నిర్ణయించి పార్టీ జిల్లా అధ్యక్షులకు నిధులు పంపించినట్లు నేతల ద్వారా తెలిసింది. అయితే ఆ నిధుల్లో వారు అత్యధిక శాతం నొక్కేసినట్లు చర్చ జరుగుతున్నది. అంతేకాకుండా ఏ కేటగిరి డివిజన్లకు బీ, సీ కేటగిరిలకు నిర్ణయించిన మొత్తాన్ని అభ్యర్థులకు ఇచ్చినట్లు పార్టీ నాయకత్వం గుర్తించినట్లు తెలిసింది. ఇలా పది మంది జిల్లా అధ్యక్షులు పెద్ద ఎత్తున నిధులు స్వాహా చేసినట్లు అంచనాకు వచ్చిన రాష్ట్ర నాయకత్వం.. వారిపై చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది.ఉత్తర తెలంగాణలోని ఒక జిల్లాకు చెందిన మహిళా నాయకురాలిపై అక్కడి బీజేపీ నాయకులు రాష్ట్ర నాయకత్వానికి ఫిర్యాదు చేసినట్లుగా పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. పార్టీ పంపించిన నిధులను అభ్యర్థులకు ఇవ్వకుండా స్వాహా చేశారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. అయితే ఆమెకు అక్కడి ముఖ్య ప్రజాప్రతినిధి మద్దతు ఉన్నట్లు తెలిసింది. ఉత్తర తెలంగాణలో ఉద్యమాల జిల్లాగా గుర్తింపు ఉన్న మరో జిల్లాలో రెండంకెల ఓట్లు రాని వార్డులను సైతం ఏ గ్రేడ్ గా చూపించి నిధులను మెక్కేసినట్లు పార్టీ గుర్తించింది. అక్కడ పార్టీకి అంత పట్టులేదని ఆ తర్వాత జరిగిన సమీక్షలో పార్టీ ముఖ్యనేత చెప్పినట్లు సమాచారం. దీంతో సంబంధిత బాధ్యుడిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన కీలక నేతలు.. మొత్తం డబ్బులు కక్కాల్సిందేనని చెప్పినట్లు తెలిసింది. దీంతోపాటు మరికొన్ని జిల్లాల్లోనూ ఇదే తరహాలో నిధులు స్వాహా చేశారని పార్టీ నాయకత్వం గుర్తించినట్లు సమాచారం.గతంలో బీజేపీలో ఉన్న క్రమశిక్షణ, నిబద్ధత ఇప్పుడు కరువయ్యాయని పాత కేడర్ ఆవేదన వ్యక్తం చేస్తున్నది. అయితే డబ్బులు ఇచ్చి పదవులు తెచ్చుకున్నామని అంతర్గతంగా తమ అనుచరులకు




చెబుతున్న నేతలు.. వచ్చే ఎన్నికల వరకు తమకు ఖర్చులకు డబ్బులు కావాలి కదా అనే రీతిలో మాట్లాడుతున్నట్లు చర్చ జరుగుతున్నది. అయితే నిధుల స్వాహాలో ముఖ్యంగా పది జిల్లాల బాధ్యులను గుర్తించగా.. వారిని తొలగించడం ఎంత వరకు సాధ్యమనే కోణంలో రాష్ట్ర నాయకత్వం ఆలోచిస్తున్నట్లు తెలిసింది. దాని కంటే ముందు వారికి నోటీసులు ఇవ్వాలని భావిస్తున్నట్లు సమాచారం. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ ఇలాగే నిధులు దుర్వినియోగమైనట్లు గుర్తించగా.. మున్సిపల్ ఎన్నికల్లోనూ ఇది రిపీట్ కావడంతో.. గట్టి చర్యలు తీసుకుంటేనే ఇలాంటివి పునరావృతం కావని అధిష్ఠానం ఒక నిర్ణయానికి వచ్చినట్లు చర్చ జరుగుతున్నది.

# ఇవాళ్టి నుంచి దేశవ్యాప్తంగా జనగణన...

- మొదటి పేజీ తరువాయి

ఆహారపు అలవాట్లను అర్థం చేసుకోవడానికి సహాయపడుతుంది.

**ఫిబ్రవరి 1, 2027న రెండో దశ ప్రారంభం..**

2027 జనాభా లెక్కలు రెండు దశల్లో నిర్వహిస్తారు. మొదటి దశలో ఇళ్ల జాబితా ప్రక్రియ ఉంటుంది. రెండో దశలో అసలైన జనాభా గణన ఫిబ్రవరి 1, 2027న ప్రారంభమవుతుంది. ఇది భారతదేశానికి మొత్తం మీద 16వ జనాభా లెక్కలు. స్వాతంత్ర్యం తర్వాత ఇది ఎనిమిదవది. ఇది దేశవ్యాప్తంగా విధాన రూపకల్పన, అభివృద్ధి ప్రణాళికకు అవసరమైన కీలకమైన సమాచారాన్ని అందిస్తుంది.

**2027 జనాభా లెక్కలలో అడిగే 33 ప్రశ్నలు ఇవే..**

భవన సంఖ్య (పురపాలక లేదా స్థానిక అధికార సంస్థ లేదా జనాభా లెక్కల సంఖ్య)
ఇంటి సంఖ్య
ఇంటి నేల కోసం ప్రధానంగా ఉపయోగించిన పదార్థం
ఇంటి గోడల కోసం ప్రధానంగా ఉపయోగించిన పదార్థం
ఇంటి పైకప్పు కోసం ప్రధానంగా ఉపయోగించిన పదార్థం
ఇంటి ఉపయోగం




ఇంటి పరిస్థితి
కుటుంబ సంఖ్య
కుటుంబ సభ్యుల సంఖ్య
కుటుంబ పెద్ద పేరు
కుటుంబ పెద్ద లింగం
షెడ్యూల్డ్ కులం / షెడ్యూల్డ్ తెగ / ఇతర
ఇంటి యాజమాన్య స్థితి
ఇంటిలోని గదుల సంఖ్య
కుటుంబంలోని వివాహిత జంటల సంఖ్య
తాగునీటి ప్రధాన వనరు
తాగునీటి వనరు లభ్యత
ప్రధాన లైటింగ్ వనరు
టాయిలెట్ సౌకర్యం లభ్యత
టాయిలెట్ రకం
మురుగునీటి పారుదల సౌకర్యం
స్నానపు సౌకర్యం లభ్యత
వంటగది, ఎల్‌పిజి / పిఎన్‌జి కనెక్షన్
వంటకు ఉపయోగించే ప్రధాన ఇంధనం
రేడియో / ట్రాన్సిస్టర్
టెలివిజన్
ఇంటర్నెట్ సౌకర్యం
ల్యాప్‌టాప్ / కంప్యూటర్
టెలిఫోన్ / మొబైల్ ఫోన్ / స్మార్ట్‌ఫోన్
సైకిల్ / స్కూటర్ / మోటార్‌సైకిల్ / మోపెడ్
కారు / జీప్ / వ్యాన్
ప్రధానంగా తినే ధాన్యం
మొబైల్ నంబర్ 2011లో నిర్వహించిన గత జనాభా గణన తర్వాత సమాజంలో సంభవించిన మార్పులను పరిగణనలోకి తీసుకుని ఈ ప్రశ్నావళిని రూపొందించారు.

# పొంగులేటీ టార్గెట్ వెనుక... ఏం జరుగుతోంది

- మొదటి పేజీ తరువాయి



చేయడం, గవర్నర్‌కు ఫిర్యాదు చేయడం ద్వారా దీనిని ఒక పెద్ద స్కామ్‌గా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారు.పొంగులేటి వ్యాపార సామ్రాజ్యాన్ని దెబ్బతీయడం ద్వారా ఆయన రాజకీయ ప్రభావాన్ని తగ్గించవచ్చని బిఆర్ఎస్ భావిస్తున్నట్లుగా చెబుతున్నారు. గతంలో తమ పార్టీలో ఉన్న వ్యక్తి కావడంతో, ఆయన బలహీనతలు తమకు తెలుసని, అందుకే పకడ్బందీగా ఆధారాలతో దాడి చేస్తున్నామని బిఆర్ఎస్ నేతలు చెబుతున్నారు. అయితే, ఇది నిజంగా అవినీతిపై పోరాటమా లేక రాజకీయ కక్షసాధింపా అన్నది ప్రజల్లో చర్చనీయాంశమైంది.రాజకీయంగా చూస్తే, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఖమ్మం జిల్లాలో బిఆర్ఎస్‌కు కోలుకోలేని దెబ్బ తీశారు. గత ఎన్నికల్లో అక్కడ బిఆర్ఎస్ క్లీన్ స్వీప్ అవ్వడానికి ఆయనే ప్రధాన కారకుడు. భవిష్యత్తులో కూడా ఆయన తన పట్టును పెంచుకుంటే బిఆర్ఎస్ ఆ జిల్లాలో కోలుకోవడం అసాధ్యం. అందుకే, ఆయనపై అవినీతి ముద్ర వేయడం ద్వారా ప్రజల్లో ఆయన ఇమేజ్‌ను దెబ్బతీయాలనేది బిఆర్ఎస్ వ్యూహంగా కనిపిస్తోంది. రేవంత్ రెడ్డి కంటే పొంగులేటిని టార్గెట్ చేయడం వల్ల అటు ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టవచ్చు, ఇటు తమ బద్ధశత్రువుపై పగ తీర్చుకోవచ్చు అనే వ్యూహం అమలు చేస్తున్నారని భావిస్తున్నారు.

# రేవంత్ రెడ్డి మైండ్ బ్లోయింగ్ గ్రాఫ్!

- మొదటి పేజీ తరువాయి



అధిష్టానం రేవంత్ రెడ్డికే పగ్గాలు అప్పగించడం వెనుక ఉన్న నమ్మకాన్ని ఆయన వంద శాతం నిలబెట్టుకున్నారురేవంత్ రెడ్డి కేవలం ఒక ముఖ్యమంత్రిగానే కాకుండా, పార్టీని నడిపించే ఒక శక్తివంతమైన సైన్యాధ్యక్షుడిగా ఎదిగారు. కాంగ్రెస్ వంటి అంతర్గత ప్రజాస్వామ్యం, అసమ్మతి ఎక్కువ ఉన్న పార్టీలో, అందరినీ కలుపుకుపోతూ గ్రూపు రాజకీయాలకు తావులేకుండా చేయడంలో ఆయన సఫలమయ్యారు. క్షేత్రస్థాయిలో పార్టీ క్యాడర్‌ను ఉత్సాహపరచడం, ప్రత్యర్థుల ఎత్తుగడలను చిత్తు చేయడంలో రేవంత్ స్టైల్ ప్రత్యేకం. సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే కాకుండా, రాష్ట్ర అభివృద్ధిపై స్పష్టమైన విజన్‌తో ముందుకు సాగుతున్నారు. దూకుడుగా ఉండే ప్రసంగాలు, తడబడని నడక ఆయనను యువతలో తిరుగులేని నాయకుడిగా నిలబెట్టాయి.సాధారణంగా కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంతో నిరంతరం ఘర్షణ వైఖరిని అవలంబిస్తుంటారు. కానీ, రేవంత్ రెడ్డి ఇక్కడ విలక్షణమైన పంథాను అనుసరిస్తున్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రంతో సఖ్యతగా ఉంటూనే, రాజకీయంగా ఎక్కడ తగ్గాలో, ఎక్కడ నెగ్గాలో ఆయనకు బాగా తెలుసు. మోదీ సర్కార్ కూడా తెలంగాణ ప్రభుత్వానికి సానుకూలంగా స్పందిస్తుండటం రేవంత్ రెడ్డి దౌత్యనీతికి నిదర్శనం. వివాదాల కంటే అభివృద్ధి ముఖ్యం అనే ధోరణితో ఆయన కేంద్రం నుంచి నిధులు, ప్రాజెక్టులు రాబట్టుకోవడంలో సక్సెస్ అవుతున్నారు.ఈ పవర్ ఫుల్ పర్సన్స్ జాబితా ఒక సంకేతాన్ని స్పష్టం చేస్తోంది. భవిష్యత్తులో జాతీయ రాజకీయాల్లో, ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీలో రేవంత్ రెడ్డి కీలక పాత్ర పోషించబోతున్నారు. దక్షిణాదిలో పార్టీని బలోపేతం చేయడమే కాకుండా, జాతీయ స్థాయిలో మోదీ వంటి బలమైన నాయకుడిని ఎదుర్కోవడంలో రేవంత్ వ్యూహాలు పార్టీకి కీలకం కానున్నాయి. ఒక సామాన్య కార్యకర్త స్థాయి నుంచి దేశంలోనే 25వ అత్యంత శక్తివంతమైన వ్యక్తిగా ఎదిగిన రేవంత్ రెడ్డి ప్రస్థానం, రాజకీయాల్లో పట్టుదల ఉంటే ఏదైనా సాధ్యమని నిరూపిస్తోంది.

# ఏపీకి జూపల్లి వార్నింగ్

- మొదటి పేజీ తరువాయి

ఇవ్వాల్సిన అవసరం ఏముంది?' అంటూ ఏపీ అధికారుల తీరును తీవ్రంగా తప్పుబట్టారు. తెలంగాణ ఎప్పుడో విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేసి బాధ్యతాయుతంగా వ్యవహరిస్తుంటే.. ఏపీ ప్రభుత్వం మాత్రం చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తోందని ఫైరయ్యారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం శ్రీశైలంలో నీటి దోపిడీని పట్టించుకోకపోవటం వల్లే ఏపీ ప్రభుత్వం ఇప్పుడు అలుసుగా తీసుకుంటోందని విమర్శించారు.ఏపీ ప్రభుత్వం తన అక్రమాలను తక్షణమే నిలిపివేయాలని లేదంటే తెలంగాణ ప్రభుత్వం, రైతులు, కాంగ్రెస్ పార్టీ సమిష్టిగా పోరాటం చేస్తామని జూపల్లి హెచ్చరించారు. రెండు రాష్ట్రాల మధ్య నీటి కేటాయింపులు ఇంకా పూర్తిస్థాయిలో జరగలేదని.. ఈ క్రమంలో ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. తమ నీటి వాటాను కాపాడుకోవడానికి ఎంతటి పోరాటానికైనా సిద్ధమని ఏపీ ప్రభుత్వానికి తేల్చి చెప్పారు. ఇప్పటికైనా ఏపీ ప్రభుత్వం విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేయాలని లేదంట తీవ్ర పరిణామాలు ఉంటాయని మంత్రి జూపల్లి కృష్ణారావు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు.


# 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల

- మొదటి పేజీ తరువాయి

ఖర్చు చేసే వెసులుబాటు ఉంటుంది. గ్రామాల్లో అంతర్గత రహదారుల నిర్మాణం, మురుగునీటి కాల్వల మరమ్మతులు, వీధి దీపాల ఏర్పాటు, శ్మశాన వాటికల నిర్వహణ వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ఈ నిధులు ఊతమివ్వనున్నాయి. అయితే ఈ నిధులను కేవలం అభివృద్ధి పనులకే వాడాలని, సిబ్బంది జీతాలు లేదా కార్యాలయ నిర్వహణ ఖర్చులకు వినియోగించరాదని కేంద్రం స్పష్టమైన నిబంధనలు విధించింది.ఈ విడతలో అత్యధికంగా మహారాష్ట్రకు రూ. 800 కోట్లు కేటాయించగా.. రాజస్థాన్‌కు రూ. 315.61 కోట్లు విడుదలయ్యాయి. ఉత్తరాఖండ్‌కు రూ. 91.31 కోట్లు, మేఘాలయకు రూ. 49.20 కోట్లు అందాయి. తెలంగాణకు కేటాయించిన రూ. 247.94 కోట్లు రాష్ట్రంలోని గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పరుగులు పెట్టించేందుకు దోహదపడతాయని విశ్లేషకులు భావిస్తున్నారు. క్షేత్రస్థాయిలో ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా కేంద్రం ఈ గ్రాంట్లను నేరుగా స్థానిక సంస్థల ఖాతాల్లోకి మళ్లిస్తోందని చెప్పారు.గతంలో నిధుల వినియోగంలో జరిగిన జాప్యం, మళ్లింపు ఆరోపణల నేపథ్యంలో కేంద్రం ఇప్పుడు కఠిన నిబంధనలను అమలు చేస్తోంది. ప్రతి పైసా ఆడిట్ కావాలని, గ్రామ పంచాయతీలు తమ అభివృద్ధి ప్రణాళికలను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించింది. తెలంగాణ ప్రభుత్వం కూడా ఈ నిధులను సకాలంలో పంచాయతీలకు చేరవేసి, గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలని సర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధులు కోరుతున్నారు. పల్లె ప్రగతిలో ఈ నిధులు కీలక పాత్ర పోషించనున్నాయి. కాగా, గతేడాది డిసెంబర్‌లో తెలంగాణ గ్రామ పంచాయతీ ఎన్నికలు జరగ్గా.. పల్లెల్లో కొత్త పాలకవర్గాలు కొలువుదీరాయి. దాదాపు రెండేళ్లు ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామాలు ఉండగా.. పాలకవర్గం కొలువుదీరటంతో అభివృద్ధి పనులు స్పీడ్‌గా కొనసాగుతున్నాయి

వార్తాతరంగాలు బుధవారం 01 ఏప్రిల్ 2026

# గురుకుల విద్యార్థులు శవాలపై ఇంటికి వెళుతున్నారు



**హైదరాబాద్:**కేసీఆర్ పాలనలో గురుకుల విద్యార్థులు ఉన్నత చదువులకు విదేశాలకు వెళ్తే.. ఈరోజు కాంగ్రెస్ పాలనలో శవాలై ఇంటికి వెళ్తున్నారని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. గద్వాల జిల్లా అయిజ మండలంలో నిరీక్షణ, ప్రసన్న అనే అమ్మాయిలకు చిన్నతనంలోనే బాల్యవివాహాలు చేయాలని వాళ్ళ తల్లిదండ్రులు అనుకున్నారు. తల్లిదండ్రులను ఎదురించి నిరీక్షణ అనే అమ్మాయి ఢిల్లీ యూనివర్సిటీలో, హర్యానా సెంట్రల్ యూనివర్సిటీలో చదివింది. ప్రసన్న అనే అమ్మాయి ఢిల్లీలో, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో చదివి ఇప్పుడు అమెరికాకు 5 సంవత్సరాల కోర్సుకు వెళ్ళింది. వీళ్ళు నా దగ్గరికి వచ్చి మీ కృషి వల్ల, కేసీఆర్ ఆశీర్వాదం వల్ల ఈ స్థాయికి ఎదిగామని అంటుంటే ఎంతో సంతోషంగా ఉందని అయన అన్నారు.

# జైన సమాజానికి అండగా వుంటాం

**అహింసా, సత్యం వంటి మహావీర్ బోధించిన సూక్తులను ప్రతి ఒక్కరూ పాటించాలి**
**సన్మార్గంలో నడవాలి...**
**తలసాని శ్రీనివాస్ యాదవ్**



**సికింద్రాబాద్:**నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో ఏర్పాటు చేసిన మహావీర్ జయంతి వేడుకలలో బి ఆర్ ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ లు హరీష్ రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు. తలసాని మాట్లాడుతూ జైన్ సమాజ్ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పేదలకు అండగా నిలుస్తుంది. కేసీఆర్ ప్రభుత్వం జైన్ సమాజానికి అన్ని విధాలుగా అండగా నిలిచింది. ఉప్పల్ భగాయత్ లో జైన్ భవన్ నిర్మాణానికి 2 ఎకరాల స్థలం కేటాయించింది. రానున్న రెండున్నర సంవత్సరాల తర్వాత తిరిగి బిఆర్ఎస్ ప్రభుత్వం వస్తుంది. జైన్ భవన నిర్మాణం పూర్తయిన తర్వాత మా ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభిస్తాం. 10 సంవత్సరాల కేసీఆర్ ప్రభుత్వం లో రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారు. జైన్ సమాజ్ కు ఎల్లవేళలా అండగా ఉంటామని అన్నారు.

# హనుమాన్ శోభాయాత్ర రూట్ మ్యాప్ ను పరిశీలించిన సీపీ సజ్జనార్



**సికింద్రాబాద్:**ఈ నెల 2 న హనుమాన్ జయంతి నేపథ్యంలో తాడు బండ్ వద్ద జరుగుతున్న ఏర్పాట్లను హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ పరిశీలించారు.హనుమాన్ జయంతి శోభాయాత్ర రూట్ మ్యాప్ ను పరిశీలించిన సిపి సజ్జనార్ పలు సూచనలు చేశారు.తాడు బండ్ దేవాలయం వద్ద జరుగుతున్న ఏర్పాట్లతో పాటు భద్రత చర్యలను పర్యవేక్షించిన సజ్జనార్ ఆలయంలో నిర్మాణ పనుల నేపథ్యంలో భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.ఎలివేటెడ్ కారిడార్ పనులు జరుగుతున్న నేపథ్యంలో శోభాయాత్ర రూట్ మ్యాప్ ను బాంటియా గార్డెన్ మీదుగా తరలించేందుకు చర్యలు చేపడుతున్నామని అన్నారు.3000 మంది పోలీసు సిబ్బందితో పాటు సీసీ కెమెరాలుతో శోభయాత్రను అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా విజయవంతం చేసేందుకు సన్నహాలు చేస్తున్నట్లు తెలిపారు.

# కొత్తగూడ శ్మశాన వాటిక వద్ద ఉద్రిక్తత

**శ్మశాన వాటిక తొలగింపును అడ్డుకుంటున్న స్థానికులు**
**హైడ్రా, పోలీసులతో వాగ్వాదం**

**కొండాపూర్, మార్చి 31 :** పూర్వికుల జ్ఞాపకాలను ఎలా చెరిపేస్తారంటూ కొత్తగూడ గ్రామస్థులు హిందూ శ్మశాన వాటికి వద్ద ఆందోళనకు దిగారు. రోడ్డు విస్తరణలో భాగంగా కొత్తగూడ శ్మశాన వాటిక తొలగింపు కోసం జీహెచ్ఎంసీ, హైడ్రా బృందాలు పోలీస్ బందోబస్తు తో కూల్చివేతకు రంగం సిద్ధం చేసుకుంది. సమాచారం అందుకున్న గ్రామస్థులు శ్మశాన వాటిక వద్దకు చేసుకుని పూర్వికుల జ్ఞాపకాలను ఎలా తొలగిస్తారంటూ ఆందోళనకు దిగారు. శ్మశాన వాటికను తలగించవద్దంటూ వేడుకుంటున్నారు. కుటుంబీకులకు శ్మశానం దేవాలయంతో సమానమేనని, పూర్వికుల సమాధులను ఎలా కులుస్తారంటూ అడ్డుకుంటున్నారు.

# మాతా శీతలా ఆలయంలో తొక్కిసలట

**8 మంది మృతి**

**పాట్నా, మార్చి 31:**మాతా శీతలా ఆలయంలో తొక్కిసలాట జరిగింది..ఈ ఘటనలో 8 మంది మృతిచెందారు..అందరూ మహిళలే. 12 మందికిపైగా భక్తులు గాయపడ్డారు. బీహార్ షరీప్ నుంచి సుమార్ 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న మాగ్రా గ్రామంలో ఉంది ఆలయం. శీతలాష్టమి కారణంగా భారీగా భక్తులు తరలిరావడంతో తొక్కిసలాట చోటుచేసుకుంది. పూజా కార్యక్రమాల సమయంలో ఈ దుర్ఘటన జరిగింది. మాతా శీతలా ఆలయం చరిత్రస్కంద పురాణం ప్రకారం సతీదేవి శరీరాన్ని మోస్తూ తన కర్తవ్యాన్ని మరిచాడు శివుడు.. ఆ సమయంలో సతీదేవి శరీరాన్ని తన సుదర్శన చక్రంతో ఖండించాడు శ్రీ మహావిష్ణువు. ఈ సమయంలో సతీదేవి శరీర భాగాలు పడిన ప్రదేశాలో శక్తిపీఠాలు. అవశేషాలను శివుడు బీహార్ షరీఫ్ సమీపం పంచానే నది దగ్గర ఖననం చేశాడట. ఆ తర్వాత అక్కడ మహారాజు వృక్షకేతు కలలో కనిపించిన శీతలా మాత ఆ స్థలంలో తవ్వమని ఆదేశించింది. చైత్రమాసం కృష్ణపక్షం సప్తమి రోజు తవ్వగా విగ్రహం బయటపడింది. గుప్తుల కాలంలో చైనా యాత్రికుడు ఫా హియన్ ఈ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తన రచనల్లో ఈ ఆలయం గురించి ప్రస్తావించారు. శీతలామాత జన్మస్థలంగా ఈ ఆలయాన్ని సందర్శిస్తారు భక్తులు. ఈ ఆలయానికి సుమారు 2వేల సంవత్సరాల చరిత్ర ఉందంటారునలంద జిల్లా మాగ్రా గ్రామంలో ఉన్న మా శీతలా ఆలయం బీహార్ లో ప్రముఖ సిద్ధపీఠాల్లో ఒకటి. పార్వతిదేవికి అంకితం చేసిన ఆలయం ఇది. వేడి కారణంగా వచ్చే అనారోగ్యాల నుంచి అమ్మవారు ఉపశమనం కలిగిస్తారని భక్తుల విశ్వాసం. ముఖ్యంగా చికెన్ పాక్స్ వంటి రోగాలు నయం అవుతాయని నమ్ముతారు. మగధ ప్రాంత నుంచి లక్షలాది భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారు. కేవలం రోగాల నివారణే కాదు.. పిల్లల ఆరోగ్యం, సంతానానికి సంబంధించిన సమస్యలు కూడా తొలగిపోతాయని నమ్ముతారు. ఆలయం ప్రాంగణంలో ఉన్న కొలనులో స్నానం ఆచరించ పూజచేయాలనే నియమాన్ని అనుసరిస్తారు. పగటి వేళ దీప ధూపాలు, హోమాలు నిర్వహించరు... సాయంత్రం తర్వాత మాత్రమే దీపధూపాలు, హారతులు ఉంటాయి. ఇక్కడ కొలువైన శీతలామాతా విగ్రహం 12 అడుగుల నల్లరాయితో చెక్కినది..నాలుగు చేతుల్లో సూర్య చంద్రులు, కలశం, శీతలాష్టక గ్రంథం, నీము కొమ్మ ఉంటాయి. అమ్మవారికి నైవేద్యంగా పెరుగు పెడతారు. ఇక్కడ జంతుబలి నిషేధం ఏటా చైత్రమాసంలో నిర్వహంచే శీతలాష్టమి రోజు భారీగా భక్తులు తరలివస్తారు.

# గులాబీకి భారం అవుతున్న కౌశిక్...



**కరీంనగర్ మార్చి 31:**కౌశిక్ రెడ్డి రాజకీయ ప్రవర్తన మొదటి నుంచి వివాదాస్పదంగానే ఉంటోంది. ఓ సారి అరికెపూడి గాంధీ ఇంటి మీదకు వెళ్లారు. ఇప్పుడు కడియంపై అదే తరహా అగౌరవం ప్రవర్తనకు పాల్పడ్డారు. నిజానికి ఈ ఇద్దరు నేతలకు.. కౌశిక్ రెడ్డికి సంబంధంలేదు. కనీసం ఆయన జిల్లా వారు కూడా కాదు. కానీ కేటీఆర్ మెప్పు పొందేందుకు కౌశిక్ రెడ్డి ఇలా చేస్తున్నారు. కేటీఆర్ కూడా కౌశిక్ రెడ్డిని ప్రోత్సహిస్తున్నారు. ఆయన రెచ్చిపోతున్నారు.రాజకీయాల్లో సిద్ధాంతపరమైన విభేదాలు, విమర్శలు సహజం. కానీ, కౌశిక్ రెడ్డి అనుసరిస్తున్న తీరు ఇందుకు భిన్నంగా ఉంది. తన జిల్లాకు సంబంధం లేని నేతలైన కడియం శ్రీహరి లేదా అరికెపూడి గాంధీ వంటి వారిని లక్ష్యంగా చేసుకుని, వారి వ్యక్తిగత గౌరవానికి భంగం కలిగేలా ప్రవర్తించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఒక ప్రజాప్రతినిధిగా సభలో వాడకూడని భాషను వాడటం, సీనియారిటీకి కనీస మర్యాద ఇవ్వకపోవడం వల్ల ఆయన ఇమేజ్ పక్కన పెడితే, సభా గౌరవం దెబ్బతింటోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నట్లుగా, ఈ సంస్కృతిని ఇప్పుడే అదుపు చేయకపోతే భవిష్యత్తులో అసెంబ్లీ కుస్తీ పోటీలకు, భౌతిక దాడులకు వేదికగా మారే ప్రమాదం ఉందన్న ఆందోళనలో వాస్తవం లేకపోలేదు.కౌశిక్ రెడ్డి ఈ తరహా దూకుడు ప్రదర్శించడం వెనుక బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మెప్పు పొందాలనే తాపత్రయం ఉంది. పార్టీలో తన ఉనికిని చాటుకోవడానికి, అధినాయకత్వం దృష్టిలో ఫైర్ బ్రాండ్ అనిపించుకోవడానికి ఆయన ఉద్దేశపూర్వకంగానే వివాదాలను కొనితెచ్చుకుంటున్నట్లు కనిపిస్తోంది. అయితే, ఇలాంటి ప్రవర్తనను కేటీఆర్ గట్టిగా వారించాల్సింది పోయి, సమర్థించడం , ప్రోత్సహించడం వల్ల కౌశిక్ రెడ్డికి తన తప్పు తెలియడం లేదు. రాజకీయాల్లో దూకుడు అవసరమే కానీ, అది ప్రత్యర్థులపై పైచేయి సాధించడానికి ఉండాలి తప్ప, అసహ్యం కలిగించేలా ఉండకూడదు.ఏ పార్టీకైనా ఇలాంటి వివాదాస్పద నేతలు కొంతకాలం మైలేజీని ఇవ్వవచ్చు కానీ, దీర్ఘకాలంలో అది పార్టీ నైతికతను దెబ్బతీస్తుంది. నిశ్శబ్దంగా ఉండే తటస్థ ఓటర్లు, విద్యావంతులు ఇలాంటి భాషను, ప్రవర్తనను అసహ్యించుకుంటారు. కౌశిక్ రెడ్డి తీరు వల్ల బీఆర్ఎస్ ఒక క్రమశిక్షణ లేని పార్టీగా ప్రజల్లో ముద్ర పడే అవకాశం ఉంది. గత ఎన్నికల్లో ఓటమి తర్వాత పార్టీని మళ్లీ ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన సమయంలో, ఇలాంటి వివాదాలు అసలు చర్చను పక్కదారి పట్టించి పార్టీకి కోలుకోలేని నష్టాన్ని చేకూర్చే ప్రమాదం ఉంది.రాజకీయ నాయకుడికి ఉండాల్సిన ప్రాథమిక లక్షణం సమయం-సందర్భం తెలియడం. కౌశిక్ రెడ్డి విషయంలో ఆ పరిణతి లోపించిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. తన దూకుడును పార్టీ ప్రయోజనాల కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం వాడుకుంటే అది ఆయన రాజకీయ భవిష్యత్తుకు ప్లస్ అవుతుంది. కానీ, ఇలాగే వ్యక్తిగత దాడులకు దిగుతూ, సభా మర్యాదలను కాలరాస్తే.. అది ఆయన పతనానికే కాకుండా పార్టీ ప్రతిష్టకు కూడా గొడ్డలి పెట్టుగా మారుతుంది. ఈ విషయాన్ని గుర్తుంచాల్సింది వారే.

# రాఘవ చుట్టూ రాజకీయం...

**హైదరాబాద్ మార్చి 31:**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కుటుంబానికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ వివాదం రోజురోజుకు ముదురుతోంది. రాఘవ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ.. అక్రమ మైనింగ్ వ్యవహారం రాజకీయంగా పెను దుమారం రేపుతోంది. దీనిపై బీఆర్ఎస్ భారీ పోరాటం చేస్తోంది. రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అక్రమాలపై.. హౌస్ కమిటీ లేదా హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కారు పార్టీ డిమాండ్ చేస్తోంది. మంత్రి పొంగులేటిని తక్షణమే మంత్రివర్గం నుంచి తొలగించాలని.. అక్రమంగా నడుస్తున్న క్రషర్ యూనిట్లను సీజ్ చేయాలని పట్టుబట్టింది బీఆర్ఎస్.రాజేంద్రనగర్ మండలం కొత్వాల్‌గూడ మానస హిల్స్ ప్రాంతంలో.. ఎలాంటి అనుమతులు లేకుండా రాఘవ కన్‌స్ట్రక్షన్స్ క్రషర్ యూనిట్లను నడుపుతోందన్నది బీఆర్ఎస్ ఆరోపణ. దీనికి పర్యావరణ అనుమతులు లేవని.. జీవో నంబర్ 111 పరిధిలోకి వచ్చే ప్రాంతాల్లో అక్రమంగా క్వారీయింగ్ చేస్తున్నారని గులాబీ పార్టీ చాలా కాలంగా ఆరోపిస్తూ వస్తోంది. క్రషర్ వ్యవహారంలో ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తదితరులతో ఓ నిజ నిర్ధారణ కమిటీ వేసింది బీఆర్ఎస్. మానసా హిల్స్‌లోని క్రషర్ ప్రాంతాన్ని ఈ కమిటీ రెండుసార్లు సందర్శించింది కూడా ఐతే తాము ఏర్పాటు చేసిన నిజ నిర్ధారణ కమిటీ పర్యటనకు ముందే.. అక్కడున్న కంటైనర్లపై రాఘవ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ పేర్లను చెరిపేసి.. సాక్ష్యాలను తారుమారు చేసే ప్రయత్నం చేశారన్నది బీఆర్ఎస్ నేతల ఆరోపణ. ఇదే అంశాన్ని ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనూ లేవనెత్తింది. ఈ అంశంపై గులాబీ పార్టీ నేతలు రెండు రోజులపాటు నిరసన తెలిపారు. రాఘవ కన్‌స్ట్రక్షన్స్ క్రషర్ అక్రమ మైనింగ్‌పై చర్చకు సీరియస్‌గా పట్టుబట్టారు. నినాదాలు చేస్తూ స్పీకర్ పోడియంను చుట్టుముట్టడంతో.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను రెండు రోజులు సస్పెండ్ చేశారు.అంతకుముందు కేటీఆర్, హరీశ్ నేతృత్వంలో.. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గన్‌పార్క్ దగ్గర ప్లకార్డులతో నిరసన తెలిపారు. దీంతో రాఘవ కన్‌స్ట్రక్షన్స్ మైనింగ్ వ్యవహారం.. రాజకీయ రచ్చకు కారణం అవుతోంది. ఐతే బీఆర్ఎస్ ఆరోపణలను.. సీఎం రేవంత్ తిప్పికొడుతున్నారు. గత 12ఏళ్లుగా జరిగిన మైనింగ్ అక్రమాలపై సీబీసీఐడీ విచారణకు ఆదేశించామని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన మైనింగ్ లీజుల అక్రమాలను కూడా బయటపెడతామని సవాల్ విసిరారు. అటు రాఘవ కన్‌స్ట్రక్షన్స్ ప్రతినిధులు కూడా.. ఆరోపణలను తోసి పుచ్చారు. తాము కేవలం ప్రభుత్వ ప్రాజెక్టుల కోసం నిబంధనల ప్రకారమే పని చేస్తున్నామని.. రాజకీయ కక్షతోనే తమపై బురద జల్లుతున్నారని అంటున్నారు.పొంగులేటి టార్గెట్‌గా బీఆర్ఎస్ చూపిస్తున్న దూకుడు.. ఇప్పుడు రాజకీయవర్గాల్లో ఆసక్తికర చర్చకు దారి తీస్తోంది. అసలు పొంగులేటి మీద ఈ రేంజ్‌లో ఎందుకు ఫోకస్ చేస్తుందనే డిస్కషన్ నడుస్తోంది. ఐతే పొంగులేటి ఇష్యూను.. బీఆర్ఎస్ సీరియస్‌గా తీసుకోవడం వెనక బలమైన కారణం ఉందనే గుసగుసలు వినిపిస్తున్నాయ్. రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో అనేక అవకతవకలు జరిగాయని.. వివిధ శాఖల్లో సుమారు 19 స్కామ్‌లు జరిగాయని ఆరోపిస్తున్న కారు పార్టీ.. వాటిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తోంది. ఐతే వీటిలో ఒక్కదానికి కూడా ఆధారాలు లేవు. ఇలాంటి సమయంలో మంత్రి పొంగులేటి కుటుంబానికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్ క్రషర్ వ్యవహారం.. కారు పార్టీకి ఆయుధంగా మారింది. ఆ క్రషర్‌కు అనుమతులు లేవని చెప్పడానికి.. పలుమార్లు నోటీసులు జారీ చేయడం, జరిమానా విధించడానికి సంబంధించి పూర్తి ఆధారాలు దొరికాయ్. దీంతో ఈ వ్యవహారాన్ని అంత ఈజీగా వదలొద్దని బీఆర్ఎస్ డిసైడ్ అయిందని టాక్.మంత్రి పొంగులేటి కుటుంబసభ్యులు కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలు ఉన్న వట్టినాగులపల్లి భూములను.. పార్టీ ఎమ్మెల్యేలతో కలిసి కేటీఆర్, హరీశ్‌రావు స్వయంగా సందర్శించారు. ఆ తర్వాత లోక్‌భవన్ వెళ్లి.. గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. మంత్రి పొంగులేటి అక్రమ క్రషర్లు నడుపుతున్నారని.. హైదరాబాద్‌లో భూకబ్జాలకు పాల్పడుతున్నారని.. ఆయనను మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని కోరుతూ.. గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. అటు అసెంబ్లీలో.. ఇటు బయటా.. ఇలా వదిలేదే లే అనే రేంజ్‌లో పొంగులేటిని టార్గెట్ చేస్తోంది బీఆర్ఎస్. ఈ అంశాన్ని ప్రభుత్వంపై ప్రధాన అస్త్రంగా బీఆర్ఎస్ వాడుతుంటే.. పాత ప్రభుత్వ అక్రమాలతో ముడిపెట్టి కాంగ్రెస్ ఎదురుదాడి చేస్తోంది. దీంతో రాజకీయ రచ్చ రోజురోజుకు ముదురుతోంది.

# 30 వేల ఎకరాల ల్యాండ్ ఎక్విజేషన్.. అనుకున్నంత ఈజీ కాదా



**హైదరాబాద్ మార్చి 31:**ముచ్చర్ల కేంద్రంగా సుమారు 30,000 ఎకరాల్లో విస్తరించనున్న భారత్ ఫ్యూచర్ సిటీ ప్రకటనతో స్థానిక రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో ఒక రకమైన స్తబ్దత, అదే సమయంలో తీవ్రమైన ఉత్కంఠ నెలకొంది. ముఖ్యంగా ఏఐ సిటీ, హెల్త్ సిటీ , నెట్ జీరో సిటీ వంటి భారీ జోన్ల ఏర్పాటు ఖరారు కావడంతో, ముచ్చర్ల చుట్టుపక్కల 20 కిలోమీటర్ల పరిధిలో ఉన్న వ్యవసాయ భూముల అమ్మకాలు దాదాపుగా నిలిచిపోయాయి. అటు రైతులు తమ భూములకు భవిష్యత్తులో మరింత ధర వస్తుందని ఆగుతుండగా, ఇటు ఇన్వెస్టర్లు ప్రభుత్వ ల్యాండ్ పూలింగ్ నిబంధనలు ఎలా ఉంటాయోనని వేచి చూస్తున్నారు.ప్రభుత్వం ఇక్కడ అమరావతి తరహాలో ల్యాండ్ పూలింగ్ విధానాన్ని పరిశీలిస్తుండటం ఇప్పుడు ప్రధాన చర్చనీయాంశమైంది. ఈ విధానంలో రైతులు లేదా యజమానుల నుంచి భూమిని తీసుకుని, దానిని అభివృద్ధి చేసిన తర్వాత కొంత భాగాన్ని తిరిగి వారికే కేటాయిస్తారు. అయితే, ఇప్పటికే అక్కడ ప్లాట్లు కొన్న ఇన్వెస్టర్లు తమ భూమి ఏ జోన్‌లోకి వెళ్తుంది? ప్రభుత్వం ఇచ్చే లేఅవుట్ ఎక్కడ ఉంటుంది? అనే గందరగోళంలో ఉన్నారు. ఈ స్పష్టత వచ్చే వరకు కొత్త రిజిస్ట్రేషన్లు చేయడం కంటే, ఉన్న భూమిని కాపాడుకోవడం మిన్న అని రియల్టర్లు భావిస్తున్నారు.ఫ్యూచర్ సిటీ ప్రభావం కేవలం ముచ్చర్లకే పరిమితం కాకుండా, కందుకూర్, యాచారం, మహేశ్వరం , ఆమనగల్ వరకు పాకింది. 20 కిలోమీటర్ల రేడియస్‌లో ఎక్కడ చూసినా ఫ్యూచర్ సిటీ కి చేరువలో ఉన్న వెంచర్ల గురించే చర్చ జరుగుతోంది. శ్రీశైలం హైవే , నాగార్జున సాగర్ హైవేలను కలిపేలా ప్రతిపాదించిన 41 కిలోమీటర్ల గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే ఈ ప్రాంతపు రూపురేఖలను మార్చబోతోంది. దీంతో ఎకరం ధర కొన్ని చోట్ల కోట్లకు చేరుకోగా, చిన్న ఇన్వెస్టర్లు మాత్రం ఇప్పుడు అడుగు పెట్టాలా వద్దా అనే సందిగ్ధంలో పడ్డారు.తెలంగాణ ప్రభుత్వం దీనిని కేవలం ఒక సిటీగా కాకుండా, భారతదేశపు మొదటి నెట్ జీరో గ్రీన్‌ఫీల్డ్ స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకుంది. గ్లోబల్ ఏఐ సమ్మిట్ తర్వాత అంతర్జాతీయ సంస్థలు ఇక్కడ డేటా సెంటర్లు ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపుతుండటంతో భూములు ఉన్న వాళ్లు చాలా జాగ్రత్తగా నిర్ణయాలు తీసుకుంటున్నారు.

# అస్తి పన్ను బకాయిలు జయలలిత ఇల్లు సీజ్..



**హైదరాబాద్:**తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి దివంగత జయలలత కు చెందిన హైదరాబాద్లోని ఇల్లు జీహెచ్ఎంసి అధికారులు సీజ్ చేశారు.నగరంలోని శ్రీనగర్ కాలనీలో ఉన్న ఈ భవనంపై అస్తి పన్ను బకాయిలు ఉండటంతో ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. సుమారు రూ.1.60 కోట్ల మేర ఆస్తి పన్ను బకాయి ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ విషయంపై పలుమార్లు జయలలిత కుటుంబ సభ్యులకు నోటీసులు ఇచ్చినా స్పందన లేకపోవడంతో చివరికి భవనాన్ని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. గతంలో ఈ భవనాన్ని వ్యాపారవేత్త విజయ్ మాల్యా లీజ్కు తీసుకున్నట్లు సమాచారం. అప్పటి నుంచి ఆస్తి పన్ను బకాయిలన్నాయని తెలిసింది.

# వేములవాడ గోశాలో నాలుగు కోడెలు మృతి

**వేములవాడ:**వేములవాడ గోశాలలో అనారోగ్యంతో నాలుగు కోడెలు మృతి చెందాయి. వేములవాడ రాజన్న ఆలయానికి అనుబంధంగా ఉన్న తిప్పాపురం గోశాలలో అనారోగ్యంతో నాలుగు కోడెలు చనిపోయాయి. ఎండ తీవ్రత వల్ల చనిపోయాయని సిబ్బంది చెప్తున్నా, సరైన నిర్వహణ, వసతులు లేకనే కోడెలు చనిపోతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

# నేలకొండపల్లిలో రోడ్డు భద్రత అవగాహన సదస్సు..

**ఖమ్మం:**నేలకొండపల్లి పోలీసుల ఆధ్వర్యంలో ప్రజాపాలన,ప్రగతి ప్రణాలిక లో భాగంగా రోడ్డు భద్రత అవగాహన సదస్సు ఏర్పాటు చేసారు.ఈకార్యక్రమానికి కమీషనర్ సునీల్ దత్ హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పనిమీద వెళ్లే కుటుంబ సభ్యులు జాగ్రత్తగా రమ్మని ప్రతి ఒక్కరూ సూచించాలన్నారు.లైసెన్స్, హెల్మెట్ లేకుండా నే యువకులు డ్రైవింగ్ చేస్తున్నారన్నారు,ఎక్కువ ప్రమాదాలు జరగడానికి కారణం నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడమే కారణమని ఆయన తెలిపారు.ప్రమాదం జరిగినప్పుడు తోటి వారు వెంటనే స్పందించాలని ఆయన అన్నారు.పోలీసులు ఫైన్ వేసేది ప్రజల జీవిత భద్రత గురించే అని ఆయన తెలిపారు.ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణీకులను ఎక్కించుకోవద్దని ఆయన అన్నారు.

# అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలు

**నిర్మల్:**నిర్మల్ జిల్లా ముధోల్, నిర్మల్ రూరల్ మండలం, భైంసా పరిధిలోని పలు గ్రామాలో రాత్రి కురిసిన అకాల వర్షాలకు మొక్కజొన్న, నువ్వులు, మామిడితో పాటు ఇతర పంటలు దెబ్బతిన్నాయి. చేతికొచ్చిన పంట నేలరాలిందని, ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించి తమను ఆదుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యంతో చదువుకోవాలి....

## ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో అదనపు గదుల ను ప్రారంభోత్సవానికి హాజరైన ఎమ్మెల్యే

**జోగులాంబ గద్వాల, మార్చి 31(స్కై న్యూస్):** గద్వాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల నందు 27 లక్షల వ్యయంతో నిర్మాణం అయిన అదనపు గదులను ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి హాజరయ్యారు.పాఠశాల ప్రిన్సిపల్ ఎమ్మెల్యే గారికి ఘనంగా స్వాగతం పలికారు.ఎమ్మెల్యే చేతుల మీదుగా అదనపు గదులను, నూతన ప్రధాన గేటును రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించడం జరిగింది.ఎమ్మెల్యే మాట్లాడుతూ గద్వాల ప్రాంతంలో బాలికల ఉన్నంత పాఠశాల 40 సంవత్సరాలు పైగా కావడం జరిగింది . ఈ పాఠశాలలోని ఎంతోమంది విద్యార్థులు చదువుకోవడం జరిగింది ప్రస్తుతం వారు వివిధ ప్రభుత్వ రంగాలలో ప్రవేట్ రంగాలలో అత్యంత స్థాయిలో ఉన్నారు. రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా గద్వాలలోని ఏకైక ప్రభుత్వ బాలికల ఉన్నంత పాఠశాల అన్నది కాబట్టి ప్రతి ఒక్క విద్యార్థిని మంచిగా చదువుకొని భవిష్యత్తులో అత్యంత స్థాయికి ఎదగాలి అదేవిధంగా గ్రామీణ ప్రాంతంలోని విద్యార్థులు దూరం ప్రాంతాలకు వెళ్లి చదువుకునే అవసరం లేకుండా గద్వాల లోనే అన్ని రకాల విద్య అవకాశాలను కల్పించడం జరుగుతుందని తెలిపారు. గతంలో ఈ ప్రాంతంలో సరైన విద్య లేక వెనుకబడిన ప్రాంతంగా పిలవబడేది కానీ నేడు నేను ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి విద్యాపై ప్రత్యేక పెట్టడం జరిగింది ఇటీవలే మెడికల్ లో ఎంబిబిఎస్ సీట్లను ఎనిమిది మంది విద్యార్థులు సాధించడం జరిగింది గద్వాల ప్రాంతం నుండి అదేవిధంగా వివిధ రకాల పోలీస్ టీచర్స్ గవర్నమెంట్ ఎంప్లాయిలలో కూడా విద్యార్థులు ఉద్యోగాలను సాధించడం జరుగుతుంది. గతంలో పోల్చుకుంటే గతం కన్నా ఎప్పుడు





విద్యారంగంలో కూడా శాతం పెరగడం జరిగిందని. అదేవిధంగా విద్యార్థిని విద్యార్థులకు నర్సింగ్ కాలేజీ మెడికల్ కాలేజ్ పారామెడికల్ కాలేజీ కూడా గద్వాల ప్రాంతానికి రావడం జరిగింది ఇప్పటికే ఈ ప్రాంతంలో నర్సింగ్ కాలేజీ మూడు సంవత్సరాలు పూర్తి చేసుకోవడం జరుగుతుంది. పీజీ డిగ్రీ మహిళా డిగ్రీ కాలేజీ గురుకుల కాలేజీ కూడా రావడం జరిగింది అని తెలిపారు.త్వరలోనే గద్వాల నియోజకవర్గంలోని కే.టి దొడ్డి మండలంలో సైనిక్ గురుకుల పాఠశాలను మంజూరు కావడం జరిగింది త్వరలోనే భూమి పూజ చేసి పాఠశాలను పనులను ప్రారంభించే విధంగా ప్రభుత్వం కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా కాకులారంలో కూడా ప్రభుత్వ పాఠశాలను త్వరలో భూమి పూజ చేసుకోవడం జరుగుతుంది నవోదయ కూడా మంజూరు కావడం జరిగింది భవిష్యత్తులో ఈ ప్రాంతంలోని విద్యార్థులు ఇతర ప్రాంతాలకు వెళ్లే అవసరం లేకుండా విద్యకు సంబంధించిన అన్ని రకాల కోర్సులు విద్యాపరమైన వాటిని ఏర్పాటు చేయడం జరుగుతుంది కాబట్టి ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకొని మంచిగా చదువుకోవాలని తెలిపారు.విద్యార్థులు మంచిగా పరీక్షలు రాసి మంచి ఉత్తీర్ణత సాధించిన మీ తల్లిదండ్రులకు మీ పాఠశాలకు గద్వాల ప్రాంతానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని కోరారు...

**ప్రతి ఒక్క విద్యార్థికి అడ్వాన్స్ ఆల్ ది బెస్ట్...**

పాఠశాల అభివృద్ధికి నా వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు... ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ తుమ్మల జయలక్ష్మి యాదవ్, వైస్ చైర్మన్ శంకర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్, కౌన్సిలర్స్ బాబర్ నాగులు యాదవ్ రామలింగేశ్వర కాంబ్లే చంద్రశేఖర్, సులోచనమ్మ, జిల్లా విద్యాధికారి, నాయకులు సాయి శ్యాం రెడ్డి, బంగి సుదర్శన్, వెంకటేశ్వర్ రెడ్డి, ఇలియాస్, ముత్యాల రవి, గోవిందు, రంగారెడ్డి, కిరణ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉపాధ్యాయులు , కాంట్రాక్టర్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తాటి చెట్ల నరికివేతపై వివాదం షాద్‌నగర్‌లో చర్చనీయాంశం

**ఓ అధికారి రాజీ చేసేందుకు ప్రయత్నిస్తున్నారా?**

**పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్న ఓ సామాజిక వర్గం నాయకులు**

**ఫిర్యాదు లు చేయించడం రాజీలు చేయడమేనా?**




**రంగారెడ్డి జిల్లా (స్కై న్యూస్) మార్చి 31:** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పరిధిలో తాటి చెట్లు నరికివేశారనే ఫిర్యాదు నేపథ్యంలో వివాదం నెలకొంది సంబంధిత వ్యక్తులు మాత్రం ప్రభుత్వ అనుమతితో కొన్ని చెట్లు మాత్రమే తొలగించామని చెబుతున్నారు కొందరు కులం పేరు చెప్పుకొని బ్లాక్‌మెయిల్‌కు దిగుతున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఈ విషయంపై అధికారులు ఫిర్యాదు చేసినవారు చెట్లు తొలగించినవారిని కలిసి రాజీ చేసేందుకు ప్రయత్నిస్తున్నారని పట్టణంలో గుసగుసలు వినిపిస్తున్నాయి చెట్లు నరికివేతపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు రాజీ ప్రయత్నాలు చేయడం సరైనదా అనే ప్రశ్నలు స్థానికంగా చర్చకు దారి తీస్తున్నాయి గత రెండు సంవత్సరాలుగా ఓ అధికారి పనితీరుపై కూడా విమర్శలు వినిపిస్తున్నాయి చెట్లు నరికితే



చట్టపరమైన చర్యలు తీసుకోవడం అధికారుల బాధ్యత, ఫిర్యాదు చేయడం పౌరుల హక్కు అయితే ఇటువంటి అంశాల్లో రాజీ ప్రయత్నాలు బ్లాక్‌మెయిల్ ఆరోపణలు పెరగడం స్థానిక ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు దృష్టి సారించి నిజానిజాలు వెలికితీసి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు ఓ వర్గానికి రాజీ కుదిరిస్తే మళ్లీ ఇంకో వర్గం ఫిర్యాదు చేస్తారు ఎంతమందిని రాజీలు కుదిరిస్తారు అధికారులు చేయవలసిన పని రాజీలు కుదిరించడం కాదు చట్టపరంగా చర్యలు తీసుకోవాలి అంటున్న పట్టణ ప్రజలు కుల సంఘాల నాయకులు

## సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి

**రంగారెడ్డి జిల్లా (స్కై న్యూస్) మార్చ్ 31:** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం జిల్లేడు చౌదరి గూడ మండలానికి ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి సిఫారసు మేరకు మంజూరైన చెక్కులను స్థానిక నాయకుల చేతుల మీదుగా అందింపచేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి చౌదరిగూడెం మండలంలోని ఎదిర గ్రామానికి చెందిన ఉరడి లక్ష్మమ్మ, చౌదరిగూడెం గ్రామానికి చెందిన వడ్డే అమృత, పద్మారం గ్రామానికి చెందిన బొమ్మగల నరసింహులు, పిర్జాపూర్ గ్రామానికి చెందిన ఈద ఆశన్న, తుమ్మలపల్లి గ్రామానికి చెందిన పిట్ట బుచ్చయ్య, చలివేంద్రం పల్లి గ్రామానికి చెందిన పి.హాసిని, పెద్ద ఎలికిచర్ల గ్రామానికి చెందిన బొట్ల సాయిచరణ్, లచ్చంపేట గ్రామానికి చెందిన చుక్క కుమార్ లకు మంజూరైన చెక్కులను స్థానిక నాయకులు లబ్దిదారులకు అందజేశారు ఈ కార్యక్రమంలో జిల్లెడ్ చౌదరిగూడ మండల మాజీ జడ్పిటిసి సభ్యులు స్వరూప రాములు, కొందుర్గు మండల మాజీ జెడ్పిటిసి తనయుడు రామకృష్ణ, బీఆర్ఎస్ సినియర్ నాయకులు మహాదేవ్ పూర్ సర్పంచ్ అనూషరవీందర్ రెడ్డి, జిల్లెడ్ చౌదరి గూడ మండల మాజీ సర్పంచ్ల సంఘం అధ్యక్షులు బాబురావు, సీనియర్ నాయకులు, సింగపూర్ రాంరెడ్డి, రమేష్ నాయక్, మండల సర్పంచ్ల సంఘం అధ్యక్షులు మోహనా చారి, వివిధ గ్రామల సర్పంచులు రవి నాయక్, అక్రమ్ భాయ్, విజయ దామోదర్ రెడ్డి, వెంకటయ్య, సోనీ శేఖర్, కన్న జంగయ్య, రామ్ చరణ్, వెంకట్ రాములు, ఉప సర్పంచ్లు కన్న మల్లేష్,దిమా గణేష్, గొడవనపల్లి భాస్కర్, గుడిసె బాలరాజ్, ఇంద్రానగర్ శేఖర్, మాజీ జూఖఎం డైరెక్టర్ అబ్దుల్ జబ్బర్, మాజీ సర్పంచ్ లు హనుమంత్ రెడ్డి, నర్సింగరావు, గౌస్, హరి నాయక్,అగ్రహారం శ్రీశైలం, మాజీ ఎంపీటీసీ రమేష్, బి ఆర్ ఎస్ నాయకులు ఎండీ అజ్మీరి, ఇస్మాయిల్, శ్రీనివాస్ రెడ్డి,పాలమూరు జగదీష్, అన్వర్ బాయ్, గోడుగొని నర్సింలు, కొండి రమేష్, వడ్డే నవీన్ పొట్టి రఘు బాసు, నరసింహులు, రాం రెడ్డి భూపాల్ రెడ్డి, పంది శ్రీనివాస్, చెన్నారెడ్డి గూడ బాలరాజ్, శ్రీరామ్, మాసుల నరేష్, శేఖర్, వినోద్ నాయక్ మన్యా నాయక్, మల్లేష్, కార్తీక్, లక్ష్మీదేవి పల్లి రాజశేఖర్, లాలు, లచ్చంపేట బాలరాజ్, గండె వెంకటేష్, లచ్చంపేట వెంకటరెడ్డి, రామ్ రెడ్డి, గోపాల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, అలీం పాషా, వెంకట్ రెడ్డి, హరీశ్వర్ రెడ్డి, వీరయ్య, నర్సింహా,హనుమంత్,బాలరాజ్, నవీన్, యాదయ్య, చందు, మల్లేష్, మాజీ మండల యువత అధ్యక్షులు నవీన్ పటేల్, సోషల్ మీడియా అధ్యక్షులు సత్యం ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



## ఆమనగల్లులో భార్య, కుమారుడిని కత్తితో పొడిచి చంపిన భర్త






**రంగారెడ్డి జిల్లా (స్కై న్యూస్) మార్చ్ 31:** రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మండలంలోని సీతారాం నగర్ గ్రామపంచాయతీ పరిధిలోని పులిగోనిపల్లి తండా లో భార్య, కుమారుడిని భర్త కత్తితో పొడిచి చంపిన సంఘటన చోటుచేసుకుంది పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సీతారాం నగర్ తాండ గ్రామపంచాయతీ పరిధిలోని పులిగోనిపల్లి తండాలో బాణావత్ రాందాస్ నాయక్, కవిత అనే దంపతులు నివసిస్తున్నారు ఈ దంపతులకు కూతురు పవిత్ర, కమారుడు హర్షలు ఉన్నారు ఆమనగల్లు పట్టణ సమీపంలోని సూర్యలక్ష్మి కాటన్ మిల్ లో రాందాస్ కూలీ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు కవిత మేస్త్రి పని కూలికి వెళ్తూ కుటుంబానికి చేదోడువాదోడుగా ఉంది దంపతుల మధ్య గత కొన్ని రోజుల నుంచి గొడవలు జరుగుతున్నాయి మంగళవారం తెల్లవారుజామున భార్య, కుమారుడు, కూతురును కత్తితో పొడిచాడు భార్య, కుమారుడు ఘటనాస్థలంలోనే మృతి చెందగా కూతురు కోన ఊపిరితో కొట్టుమిట్టాడుతోంది ఆమె ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మీరు కష్టపడి శ్రమిస్తే నే జీవితంలో పైకి ఎదుగుతారు....

**మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి**

**దేవరకద్ర, ఆత్మకూర్ మార్చి 31 (స్కై న్యూస్);** ఆత్మకూరు పట్టణంలో స్థానిక ఎంవీ రామన్ స్కూల్ లో మంగళవారం ఏర్పాటుచేసిన విజ్ఞాన వైభవం -2026 ను రాష్ట్ర క్రీడా, పాడి పరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధక శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి, పాఠశాల చైర్మన్ డాక్టర్ శ్రీధర్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి స్కూల్ లో విద్యార్థులనుద్యేశించి మాట్లాడుతూఅన్ని దానాల్లో కెల్ల విద్యా దానం గొప్పది అన్నారు. విద్య ఎవ్వరి సొత్తు కాదు. విద్యాబుద్ధులు నేరిస్తే ఎవరూ మీకన్నా గొప్ప వారు కాదు అన్నారు.తరగతి గదిలో గురువులు చెప్పిన పాఠాలు శ్రద్ధగా వింటే చదువుల్లో రాణిస్తారు అన్నారు. విద్యార్థులకు సంకల్పం గొప్పగా ఉండాలి అన్నారు.జీవితంలో ఒక లక్ష్యాన్ని ఎంచుకొని దాని ఆశయ సాధన కు కృషి చేయాలి అన్నారు.కన్న తల్లిదండ్రులు, చదువు నేర్పిన గురువులు మీకు నిజమైన హీరోలు అన్నారు. మీరు కస్టపడి శ్రమిస్తే నే జీవితంలో పైకి ఎదుగుతారు అన్నారు. 51 స్టాల్స్ ఏర్పాటు చేసి దాదాపు 720 ప్రదర్శనలు చేసిన స్కూలు యాజమాన్యానికి విద్యార్థులకు నా అభినందనలు అని తెలిపారు.ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ సునీత రెడ్డి, పాఠశాల చైర్మన్ డాక్టర్ శ్రీధర్ గౌడ్, మున్సిపల్ చైర్ పర్సన్ నాగమణి, వైస్ చైర్ పర్సన్ శ్రీనివాసులు, మార్కెట్ కమిటి చైర్మన్ రహమతుల్లా విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



## వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి

**రంగారెడ్డి జిల్లా (స్కై న్యూస్) మార్చ్ 31:** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలో ఫరూఖ్ నగర్ లోని శ్రీ గోదా సమేత లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవములు భాగంగా శివపార్వతుల కళ్యాణ మహోత్సవానికి కార్యక్రమానికి హాజరైన ప్రత్యేక పూజలు నిర్వహించిన రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి అనంతరం మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు ఆలయ అర్చకులు అదనపు కలెక్టర్ చంద్రారెడ్డిని సన్మానించారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, పెంటయ్య, దామోదర్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి,ఒగ్గు కిషోర్, పెద్ది రాం మోహన్, కానుగు రాం భూపాల్ తదితరులు పాల్గొన్నారు.



## కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

**ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి**

**దేవరకద్ర, భూత్పూర్ మార్చి 31 (స్కై న్యూస్);** భూత్పూర్ మండలంలో మంగళవారం పలు గ్రామాలకు చెందిన కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు స్థానిక నాయకులు, అధికారులతో కలసి లబ్దిదారులకు చెక్ ల పంపిణీ చేసి ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదలకు కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. పేదలు అప్పుల కు బిలో కుర్కపోకుండా ఇది ఒక ఆధారమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు ఉప సర్పంచులు వార్డు సభ్యులతో పాటు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో భారీగా డ్రగ్స్ పట్టివేత

**రంగారెడ్డి జిల్లా (స్కై న్యూస్) మార్చ్ 31:** రంగారెడ్డి జిల్లా శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో భారీగా డ్రగ్స్ పట్టివేతరూ.25 కోట్ల విలువైన డ్రగ్స్ స్వాధీనంబ్యాంకాక్ నుంచి వచ్చిన ఇద్దరిని అదుపులోకి తీసుకున్న అధికారులు.




## అరైవ్ అలైవ్-సురక్షిత ప్రయాణానికి పోలీసుల ప్రత్యేక అవగాహన కార్యక్రమం

**జోగులాంబ గద్వాల, మార్చి 31(స్కై న్యూస్):**తెలంగాణ రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యతనిస్తూ అమలు చేస్తున్న "బాతీతీఅజవ బాశ్రీఅజవ" కార్యక్రమంలో భాగంగా మంగళవారం జోగులాంబ గద్వాల్ జిల్లాలోని పదవ బెటాలియన్ కన్వెన్షన్ హాల్‌లో విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఇటిక్యాల ఎస్సై రవి ఆధ్వర్యంలో సమర్థవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఇటీవల జరిగిన ఒక విషాద ఘటనను ఉదాహరణగా పేర్కొంటూ, నిర్లక్ష్యం వల్ల అమూల్యమైన ప్రాణాలు కోల్పోవాల్సి వస్తోందని అన్నారు. ఒక్క చిన్న తప్పిదం కుటుంబాలను తీవ్ర విషాదంలోకి నెడుతున్నదని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని, హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ వినియోగించడం, మద్యం సేవించి వాహనం నడపకపోవడం వంటి ప్రాథమిక నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. రోడ్డు భద్రత కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాకుండా, ప్రతి పౌరుడి కర్తవ్యమని స్పష్టం చేశారు. హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ వినియోగించడం, మద్యం సేవించి వాహనం నడపకపోవడం, వేగ పరిమితులను పాటించడం వంటి ప్రాథమిక ట్రాఫిక్ నియమాలను ప్రతి ఒక్కరూ కచ్చితంగా అనుసరించాలని సూచించారు. అలాగే కుటుంబ సభ్యులు, స్నేహితులు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే వారిని అడ్డుకోవడం ద్వారా బాధ్యతాయుతమైన సమాజ నిర్మాణానికి సహకరించాలని పిలుపునిచ్చారు. సురక్షితంగా ప్రయాణించి క్షేమంగా గమ్యానికి చేరుకోవడమే నిజమైన విజయం అని ఆయన స్పష్టం చేశారు. పదవ బెటాలియన్ హెచ్.ఎఫ్.ఏ.సి కమాండెంట్ జయరాజు మాట్లాడుతూ, ప్రాణ భద్రత ప్రతి ఒక్కరికీ అత్యంత ముఖ్యమని తెలిపారు. వాహనాల సాంకేతిక స్థితి సక్రమంగా ఉండేలా చూసుకోవడం, డ్రైవింగ్ సమయంలో అప్రమత్తంగా ఉండడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని చెప్పారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ఇది ప్రాణాలను కాపాడే ప్రధాన రక్షణ సాధనమని వివరించారు. అదనపు ఎస్పీ శంకర్ మాట్లాడుతూ, "బాతీతీఅజవ బాశ్రీఅజవ" కార్యక్రమం ప్రధాన లక్ష్యం ప్రజల్లో రోడ్డు భద్రతపై చైతన్యం కల్పించడం అని తెలిపారు. గమ్యస్థానానికి చేరుకోవడం కంటే ముందుగా సురక్షితంగా ఉండటం ముఖ్యమని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని వివరించారు. అనంతరం హాజరైన వారందరితో రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ కే. శంకర్ , పదవ బెటాలియన్ కమాండెంట్ శ్రీ జయరాజు, డీఎస్పీ నరేందర్ రెడ్డి , ఆర్.ఐలు, సీఐలు, ఎస్సైలు మరియు పోలీస్ సిబ్బంది, స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమం ద్వారా రోడ్డు భద్రతపై మరింత అవగాహన పెంపొందించడంతో పాటు బాధ్యతాయుత డ్రైవింగ్ పై స్పష్టమైన సందేశం అందించారు.



వార్తాతరంగాలు
బుధవారం 01 ఏప్రిల్ 2026

# నిబద్ధత క్రమశిక్షణతో పని చేయాలి భవిష్యత్ తరానికి ఆదర్శంగా నిలవాలి

**: ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి**



**దేవరకద్ర, భూత్పూర్ మార్చి 31 (స్కై న్యూస్);** భూత్పూర్ మున్సిపల్ కార్యాలయం లో మంగళవారం నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో స్థానిక మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లతో ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి.ఈ సందర్భంగా డ్రైనేజీ, స్ట్రీట్ లైట్స్, ట్రాఫిక్, పారిశుద్ధ్య నిర్వహణ పనులు, సీసీ రోడ్లు, త్రాగునీరు, విద్యుత్, మౌలిక వసతులు తదితర అంశాలపై చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూమున్సిపల్ ఎన్నికల తరువాత ఈ మొదటి జనరల్ బాడీ మీటింగ్ లో పాల్గొనడం సంతోషంగా ఉంది అన్నారు. ఇటీవల జరిగినమున్సిపాలిటీ ఎన్నికల్లో నూతనంగా ప్రజా ప్రతినిధులుగా ఎన్నికైన ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల ఆశీర్వాదం, దీవెనలతో గెలిచినా మీరు మంచి పనులు, ప్రజలకు సేవ చెస్తే మీ పేరు చిరస్థాయిలో నిలిచిపోతుంది అన్నారు. నిబద్దత, క్రమశిక్షణ తో పని చేయాలి. భవిష్యత్తు తరానికి ఆదర్శంగా నిలువాలి అన్నారు. ఎన్నికల సమయంలో మీరు ప్రజలకు ఇచ్చిన హామీలు, ప్రజల ఇబ్బందులు తీర్చడానికి నిరంతరం కృషి చేయండి, నా వంతు పూర్తి సహకారం అందజేస్తా, అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలి అన్నారు.భూత్పూర్ మున్సిపాలిటీ అభివృద్ధికి సంబంధించి ఇటీవలే 15 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసుకున్నాం అన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని, నీటి సమస్యలు తలెత్తకుండా, అధికారులు, ప్రజాప్రతినిధులు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి అన్నారు.నీటి సమస్యలను తీర్చడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. దాని కోసం ఎన్ని నిధులైన ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది అన్నారు.భూత్పూర్ మున్సిపాలిటీని మున్సిపాలిటీ అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# అక్రమ ఫీజులను అరికట్టాలి

**ముందస్తుగా ఫీజుల వసూళ్లు దారుణం**

**ఏబీవీపీ నగర సంయుక్త కార్యదర్శి శివ**



**నాగర్ కర్నూల్ మార్చ్ 31 (స్కై న్యూస్):** జిల్లాలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులతో పాఠ్యపుస్తకాలు పేరుతో ముందస్తుగా అక్రమ ఫీజులు చేయడం దారుణమని నగర సంయుక్త కార్యదర్శి శివ ఆవేదన వ్యక్తులు మంగళవారం మండల విద్యాశాఖ అధికారి కుర్మయ్యకు వినతిపత్రం సమర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఉన్న ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలలు అక్రమంగా విద్యార్థులకు మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఉద్దేశించిన ఫీజుల కన్నా అధికంగా వసూలు చేస్తున్నారు వెంటనే ఫీజుల దోపిడిని అడ్డుకోవాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో నాయకులు మహేష్ శివ బాబు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

# నందు నామాజీ నీ సన్మా నించిన బిజెపి నాయకులు



**నారాయణపేట మార్చి 31: (స్కైన్యూస్)** నారాయణపేట బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గా ఎన్నికైన నందు నామాజీ నీ మంగళవారం ఆయన నివాసంలో బిజెపి నాయకులు శాలువాలతో సన్మానించి మిఠాయిలు తినిపించి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు మిర్చి వెంకటయ్య,సైదప్ప,డి.మల్లేష్,సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# రంగారెడ్డి జిల్లాలో గ్యాస్ సిలిండర్ల అక్రమ దందా

**కొరత పేరు చెప్పి నిలువు దోపిడీ**

**డొమెస్టిక్ రూ.2 వేలు**

**కమర్షియల్ రూ.3 వేలు**

**సరఫరా లోపాలు అధికారుల నిర్లక్ష్యంతో సమస్యలు**

**రంగారెడ్డి జిల్లా (స్కై న్యూస్) మార్చ్ 31:** రంగారెడ్డి జిల్లాలో అక్రమ రవాణా నల్లబజారు పెరుగుదలతో వినియోగదారులపై తీవ్ర ప్రభావం చూపుతోంది జిల్లాలో గ్యాస్ సిలిండర్ల అక్రమ రవాణా నల్లబజారు విక్రయాలు రోజురోజుకు పెరుగుతున్నాయి గ్యాస్ సరఫరాలో లోపాలు అధికారుల నిర్లక్ష్యం కలిసి ఈ సమస్యను మరింత తీవ్రంగా మారుస్తున్నాయి సాధారణంగా మార్కెట్‌లో వాణిజ్య సిలిండర్ ధర రూ.2,166, గృహ వినియోగ సిలిండర్ ధర రూ.997గా ఉండగా అక్రమంగా వీటిని అధిక ధరలకు విక్రయిస్తున్నారు వాణిజ్య సిలిండర్‌ను రూ.3,000 వరకు, గృహ సిలిండర్‌ను రూ.2,000 వరకు అమ్ముతూ కొందరు దందా సాగిస్తున్నారు ఈ పరిస్థితి సామాన్య వినియోగదారులకు తీవ్రమైన ఆర్థిక భారం అవుతోంది

**సరఫరా లోపాలు వినియోగదారుల ఇబ్బందులు**

గ్యాస్ బుకింగ్ చేసిన తర్వాత సకాలంలో డెలివరీ జరగకపోవడం వినియోగదారులకు పెద్ద సమస్యగా మారింది బుకింగ్ చేసిన 10 నుంచి 15 రోజులు గడిచినా సిలిండర్ ఇంటికి రాని పరిస్థితులు నెలకొన్నాయి అత్యవసర సమయంలో కూడా గ్యాస్ అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు ఈ పరిస్థితిని అక్రమ వ్యాపారులు తమకు అనుకూలంగా మార్చుకుని, అధిక ధరలకు సిలిండర్లను విక్రయిస్తున్నారు వినియోగదారుల వేదనను తెలియజేస్తున్న వివరాల ప్రకారం షాద్ నగర్ నగరంలోని గాంధీనగర్? కు



చెందిన ఓ వినియోగదారుడు ఈ నెల 17న హెచ్‌పీ యాప్ ద్వారా గ్యాస్ బుక్ చేసుకున్నప్పటికీ 12 రోజులు గడిచినా ఇప్పటికీ సిలిండర్ అందలేదు సంబంధిత ఏజెన్సీకి ఫిర్యాదు చేసినా స్పందన లేదు పౌర సరఫరాల శాఖ అధికారులకు తెలియజేసినా ఎలాంటి చర్యలు కనిపించలేదు అలాగే ఆనంద్? కాలనీకి చెందిన మరో వినియోగదారుడు మార్చి 5న ఇండెన్? గ్యాస్ బుక్ చేసుకున్నారు మార్చి 18న డెలివరీ అయినట్లు సందేశం వచ్చినప్పటికీ వాస్తవంగా సిలిండర్ అందలేదు ఆ సిలిండర్‌ను మరొకరికి అధిక ధరకు విక్రయించినట్లు తెలుస్తోంది ఏజెన్సీకి కాల్ సెంటర్‌కు ఫోన్ చేసినా స్పందన లేకపోవడం వినియోగదారుల అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు

**ఏజెన్సీల నిర్లక్ష్యం అధికారుల అలసత్వం**

జిల్లాలోని కొన్ని గ్యాస్ ఏజెన్సీలకు పరిమితికి మించి కనెక్షన్లు ఉన్నాయని, వాటి నిర్వహణలో లోపాలు ఉన్నాయని స్వయంగా పౌర సరఫరా శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అంగీకరిస్తున్నారని సమాచారం వినియోగదారుల నుంచి ఫిర్యాదులు అధికంగా వస్తున్నప్పటికీ ఆయా ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవడంలో అధికారులు వెనుకడుగు వేస్తున్నారు అప్పుడప్పుడు తనిఖీలు చేస్తున్నామని చెప్పినా వాటి ప్రభావం మాత్రం కనిపించడం లేదు

**నల్లబజారు దందాకు కారణాలు**

గ్యాస్ కొరత పేరుతో కొందరు అక్రమంగా సిలిండర్లను దాచిపెట్టి, అవసరమైనప్పుడు అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి సరఫరా వ్యవస్థలో పారదర్శకత లేకపోవడం, డెలివరీ వ్యవస్థలో అవినీతి, ఏజెన్సీలపై సరైన పర్యవేక్షణ లేకపోవడం ఈ సమస్యకు ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి సాంకేతికంగా బుకింగ్ వ్యవస్థ ఉన్నప్పటికీ, దాని అమలు సక్రమంగా జరగకపోవడం సమస్యను మరింత పెంచుతోంది ఈ సమస్యను నియంత్రించాలంటే అధికారులు కఠిన చర్యలు తీసుకోవడం అత్యవసరం అక్రమంగా సిలిండర్లను విక్రయిస్తున్న వారిపై కఠినంగా వ్యవహరించాలి గ్యాస్ డెలివరీ వ్యవస్థను పారదర్శకంగా మార్చి ప్రతి బుకింగ్‌కు సంబంధించిన వివరాలను వినియోగదారులకు స్పష్టంగా తెలియజేయాలి ఫిర్యాదులపై తక్షణ స్పందన ఇవ్వడం బాధ్యులపై చర్యలు తీసుకోవడం ద్వారా ప్రజల్లో విశ్వాసం పెంపొందించాలని వినియోగదారులు కోరుకుంటున్నారు జిల్లాలో గ్యాస్ సిలిండర్ల అక్రమ దందా సామాన్య ప్రజల జీవన విధానంపై తీవ్ర ప్రభావం చూపుతోంది సరఫరా లోపాలు, అధికారుల నిర్లక్ష్యం కలిసి సమస్యను మరింత క్లిష్టంగా మారుస్తున్నాయి వినియోగదారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తక్షణ చర్యలు తీసుకొని ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చేయాలనీ ప్రజలు కోరుకుంటున్నారు

# సామాజిక న్యాయానికై ముమ్మర పోరాటాలు...

**డిహెచ్ పి ఎస్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక**

**నాగర్ కర్నూల్ మార్చ్ 31 (స్కైన్యూస్)** దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో రాబోయే రోజులలో కుల వివక్ష అంటరానితనం నిర్మూలన కోసం సామాజిక న్యాయం ఆత్మగౌరవం కాపాడేందుకు ముమ్మరంగా పోరాటాలు నిర్వహిస్తామని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ అన్నారు జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న దళిత హక్కుల పోరాట సమితి జిల్లా మహాసభల సందర్భంగా మంగళవారం జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దళితులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నాయని నేటికీ సమాజంలో కుల వివక్ష కొనసాగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ ఎం డి ఫయాజ్ మాట్లాడుతూ నూతన జిల్లా కమిటీ సమరశీల పోరాటాలతో జిల్లాలో సాగుతున్న అరాచకాలను అంటరానితనాన్ని ఎదిరిస్తూ పోరాటాలు నిర్వహించి దళితులను చైతన్యం చేయాలని కోరారు ఈ సందర్భంగా జిల్లా నూతన అధ్యక్షునిగా తప్పిట కిరణ్ కుమార్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా బండి లక్ష్మీపతి ఉపాధ్యక్షులుగా లక్ష్మీనారాయణ లంకేశ్వరం శ్రీనివాసులు సహాయ కార్యదర్శిలుగా బిజ్జా శివకుమార్ చిన్నపాగా శ్రీను కోశాధికా కొత్త రామస్వామి తో పాటు 28 మందిని కౌన్సిల్ సభ్యులుగా ఎన్నుకున్నారు ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష





కార్యదర్శులు మాట్లాడుతూ దళితల హక్కులను సాధించేందుకు పోరాడు ప్రభుత్వ వైఫల్యాలను వెంటపడుతూ క్షేత్రస్థాయిలో పోరాట నిర్వహించి దళితులను చైతన్యం చేస్తామన్నారు. ఎస్టీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను మంజూరు చేయాలని బ్యాక్లాగ్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు

# పోలీస్ శాఖలో అందించిన సేవలు అభినందనీయం: ఎస్పీ వినీత్

**నారాయణపేట మార్చి 31: (స్కై న్యూస్)** నారాయణపేట జిల్లా దామరగిద్ద పోలీస్ స్టేషన్‌లో ఎచ్ సి గా విధులు నిర్వహిస్తున్న కే.బాలప్ప మంగళవారం పదవి విరమణ చేసిన సందర్భంగా జిల్లా ఎస్పీ ప్రధాన కార్యా లయంలో ఎస్పీ డాక్టర్ వినీత్ శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించి శు భాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడు తూ పోలీస్ శాఖకు చేసిన విశిష్ట సేవలను కొనియా డారు.ఉద్యోగ నిర్వహణలో ప్రతి ఒక్కరికీ పదవి విరమణ తప్పనిసరి ప్రక్రియ అని పేర్కొంటూ, పీసీ స్థాయి నుంచి హెడ్ కానిస్టేబుల్ వరకు 35 సంవత్సరాల పాటు అంకితభావంతో పోలీస్ శాఖకు సేవలందిం చిన బాలప్ప సేవలు అభినం దనీయమని అన్నారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిర క్షణలో ఆయన పోషించిన పాత్రను ప్రత్యేకంగా ప్రశంసి స్తూ అభినందనలు తెలిపా రు.పదవి విరమణ అనంత రం కుటుంబ సభ్యులతో



కలిసి సుఖసంతోషాలతో జీవించాలని, ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. అలాగే పోలీస్ శాఖ నుండి రావాల్సిన అన్ని రకాల బెనిఫిట్స్‌ను వెంటనే అందేలా చర్యలు తీసుకో వాలని కార్యాలయ స్టాఫ్ కు ఆదేశించారు. పదవి విర మణ అనంతరం ఏవైనా ఇబ్బందులు ఎదురైతే పోలీస్ శాఖ పూర్తి అండగా ఉంటుం దని, అవసరమైతే నేరుగా తనను సంప్రదించవచ్చని ఎస్పీ భరోసా ఇచ్చారు. బాలప్ప 1992 బ్యాచ్‌లో కానిస్టేబుల్‌గా పోలీస్ శాఖ లో చేరి, అంచలంచలుగా పీసీ, హెడ్ కానిస్టేబుల్ హోదాల్లో పదోన్నతీ పొంది, మొత్తం 10 పోలీస్ స్టేషన్లలో 35 సంవత్సరాల పాటు ప్రజ లకు సేవలందించి, దామ రగిద్ద పోలీస్ స్టేషన్ నుండి పదవి విరమణ పొందారు. ఆయనకు భార్య మణెమ్మ 4 గురు కూతుర్లు, ఒక కుమా రుడు ఉన్నారని తెలిపారు.ఈ సన్మాన కార్యక్రమంలో డీఎస్పీ లు నల్లపు లింగ య్య, మహేష్, ఆర్ ఐ. విజయ్ భాస్కర్, ఎస్ఐలు రాజు, నరేష్,డి పి ఓ సీనియర్ అసిస్టెంట్ అశోక్, అల్లుడు శివ, తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం పని చేస్తుంది

**ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి**



**దేవరకద్ర, కౌకుంట్ల మార్చి 31 (స్కై న్యూస్);** దేవరకద్ర తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో, దేవరకద్ర కౌకుంట్ల మండలాలకు చెందిన లబ్ధిదారులకు మంగళవారం కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆడబిడ్డలకు భరోసాగా పెళ్లిళ్లు చేసుకున్న పేద కుటుంబాలకు ఆర్థిక వెసులుబాటు కల్పించేందుకు ప్రభుత్వం అందిస్తున్న కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు ఎంతో ఆసరాగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఆరోగ్యశ్రీకి అదనంగా సీఎంఆర్ఎఫ్ అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆస్పత్రులలో చికిత్స పొందిన నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక వరమని ఆయన కొనియాడారు.అలాగే రాజకీయాలకు అతీతంగా, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారులకే చెక్కులు అందజేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తామని ఎమ్మెల్యే అన్నారు ఈ కార్యక్రమంలో అధికారులు ప్రజాప్రతినిధులు సర్పంచులు ఉపసర్పంచులు వార్డు సభ్యులు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# దళిత సర్పంచ్ ను అవమానించిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలి

**ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి డిమాండ్**

**నారాయణపేట మార్చి 31: (స్కైన్యూస్)** నారాయణపేట జిల్లా మండలంలోని అమిరెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ లక్ష్మీ ను సీతారాముల కళ్యాణం నుంచి బలవంతంగా లేపి అవమానించిన అగ్రకులానికి చెందిన మాజీ సర్పంచ్ స్వప్న,వెంకట్రామిరెడ్డి లను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి జాతీయ ఉపాధ్యక్షుడుడి.దేవేంద్రప్ప,కార్యదర్శినర్సింహ,అంబేడ్కర్ సంఘం సభ్యుడు టి.ఆశ ప్పడిమాండ్ చేశా రు.మంగళవారం సర్పంచ్ లక్ష్మీ నీ పరామర్శించిన అనంతరం అంబేడ్కర్ భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లా డుతూ ఊరి కట్టు బాటు ప్రకారం ప్రతి సీతారాముల కళ్యాణం లో సర్పంచ్ పూజలో కూర్చోవాలని నిర్ణయాన్ని కాదని వెంకట్రా మిరెడ్డి దంపతులు పూజలో కూర్చున్న సర్పంచ్ లక్ష్మీ నీ అగ్రకుల అహంకారంతో బలవంతంగా లేపి పంపి




అవమానించారని అన్నా రు.దాంతో సర్పంచ్ పోలీసు లకి ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు వాటిని అరెస్ట్ చేయక పోవడం విడ్డూరం అని అన్నారు.మరొకరికి అవ మానం జరగరాదంటి వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.లేకపోతే ఆందోళన ఉదృతం చేస్తామని హెచ్చరించారు.కాగా కుల మార్పిడిపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని అన్నారు.ఈ తీర్పును ప్రభుత్వాలు వెంటనే అమలు చేసి మత మార్పిడులు అరికట్టాలని కోరారు.ఈ సమావేశంలో బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకుడు ఎస్.విజయ్ కుమార్,ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి నాయకులులక్ష్మణ్,కనకయ్య,హన్మంతు,ఎం.కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గా కే.రతంగ్ పాండురెడ్డి

**ప్రత్యేక ఆహ్వానితులుగా కొండా శ్వేత**





**నారాయణపేట మార్చి 31: (స్కైన్యూస్)** బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గా సీనియర్ నాయకులు కే.రతంగ్ పాండురెడ్డి,ప్రత్యేక ఆహ్వానితులుగా నారాయణపేట మున్సిపల్ చైర్ పర్సన్ కొండా శ్వేత సత్యయాదవ్ ను బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు నియమించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమను నియమించినందుకు రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు కు కృతజ్ఞతలు తెలిపారు.కాగా పార్టీ నాయకులు వారికి అభినందనలు తెలిపారు.

## వార్త తరంగాలు కథనానికి స్పందించిన
# అధికారులు హోర్డింగ్ తొలగింపు

**అనుమతి లేని అక్రమ ఫ్లెక్సీల తొలగించిన అధికారులు**

**59వ డివిజన్ కార్పొరేటర్ రాంబాబుకి కమిషనర్ కి కృతజ్ఞతలు తెలియజేస్తున్న ప్రజలు**

**అక్రమ ఫ్లెక్సీలు హోర్డింగ్ లపై? కార్పొరేషన్ అధికారుల కొరడా**





వార్తాతరంగాలు
28 Feb 2026 - Page 6
అనుమతి లేని అక్రమ ఫ్లెక్సీల హాల్‌చల్
59వ డివిజన్ కార్పొరేటర్ స్పందించి అనుమతి లేని ఫ్లెక్సీలను తొలగించాలి
కార్పొరేషన్ అధికారుల అనుమతి లేకుండా పట్టణమంతటా వెలుస్తున్న ఫ్లెక్సీలు




**కొత్తగూడెం మార్చ్ 31 (స్కై న్యూస్):** కొత్తగూడెం ఎంజీ రోడ్డు గణేష్ టెంపుల్ వద్ద ప్రమాదకరంగా మారిన ఫ్లెక్సీలు 59వ డివిజన్లో హాస్పటల్ యాజమాన్యం అధికారుల మాటలు లెక్కచేయకుండా ఎటువంటి అనుమతులు లేకుండానే దారికి అడ్డుగా ఎంట్రన్సీ ఆర్చి ఏర్పాటు చేసి డివిజన్ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. డివిజన్లో ఎటువంటి ప్రమాదాలు జరిగిన వెంటనే అంబులెన్స్ ఫైర్ ఇంజన్ రావడానికి అవకాశాలు లేకుండా ఉండడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తు కార్పొరేషన్ లో ఫిర్యాదులు అందజేసినారు. విషయం తెలుసుకున్న వార్త తరంగాలు దినపత్రిక వెంటనే స్పందించి ఫిబ్రవరి 27వ తారీకు అనుమతులు లేని అక్రమ ఫ్లెక్సీల హాల్ చల్ అనే హెడ్డింగ్ తో ప్రచురించడం జరిగింది. వెంటనే స్పందించిన 59 వ డివిజన్ కార్పొరేటర్ రావి రాంబాబు కొత్తగూడెం కార్పొరేషన్ కమిషనర్ సుజాత స్పందించి అడ్డంకులన్నీ తొలగించుకొని నేడు ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలవకుండా హోర్డింగ్స్ ను తొలగించడంతో డివిజన్ ప్రజలు ఆనందం వ్యక్తం చేసినారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ కమిషనర్ సుజాత 59 వ డివిజన్ కార్పోరేటర్ రావి రాంబాబు కృతజ్ఞతలు తెలియజేసిన డివిజన్ ప్రజలు. గత నెల రోజులుగా రెండు హోల్డింగ్స్ లో ఒక హోర్డింగ్ తీయడము పైరవీకారుల ద్వారా పైరవీలు జరగడం కొన్ని రోజులుపెట్టడం జరిగినప్పటికీ నెల రోజులలో మొత్తానికి రెండు ఎంట్రన్స్ హోర్డింగులను తీసివేసి ప్రజలకు మేమున్నాము అంటూ భరోసానిస్తూ కథ సుఖాంతం చేయడం తో ప్రజలు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

## యుద్ధంతో సమిదలవుతున్న
# అమాయకులు...

**పెను ప్రమాదంగా మారిన అమెరికా సామ్రాజ్యవాద పోకడలు**

**నరమేదం జరుగుతన్నా మోడి నోరు మెదపరెందుకో**

**సహజ వనరులు దోచుకునేందుకు మావోయిస్టులపై దాడులు**

**కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలు నిలుపుకోవాలి**

**ప్రజా పోరాటాలే కమ్యూనిస్టు పార్టీకి అజెండా కావాలి**

**సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ సాబీర్ పాషా**



**లక్ష్మీదేవిపల్లి మార్చ్ 31( స్కై న్యూస్)** :అమెరికా సామ్రాజ్యవాద యుద్ధ పోకడలు ప్రపంచ శాంతికి పెనుప్రమాదంగా మారుతోందని, ఈ యుద్ధం భారీ ప్రాణ నష్టానికి, ప్రాంతీయ అస్థిరత్వానికి, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ విచ్చిన్నానికి దారితీసిందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ సాబీర్ పాషా అన్నారు. లక్ష్మీ దేవిపల్లి మండలం లోతువాగు ఎస్ఆర్ గార్డెన్స్ లో మంగళవారం జరిగిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. అమెరికా, ఇజ్రాయేల్ దేశాలు ఇరాన్ పై ఏక పక్ష యుద్ధం చేస్తున్నాయని, దీని వల్ల అమయాకులు సమిదలవుతున్నారని, సుమారు 3300 మందిని పొట్టన పెట్టుకున్నారని, పసి పిల్లలను కూడా వదల్లేదని మండిపడ్డారు. ఈ నరమేదానికి వ్యతిరేకంగా పోరాటాలు చేయాల్సిన అవసం ఉందన్నారు. భారతదేశ నౌకాదళం పై దాడి జరిగినప్పటికీ, దేశంలో యుద్ధం వల్ల అనేక సమస్యలు తలెత్తుతున్నప్పటికీ దేశ ప్రధాని నరేంద్రమోడి కనీసం నోరుమెదపక పోవడం విడ్డూరంగా ఉందన్నారు. విదేశాంగ విధానానికి కట్టుబడ్డ మోడి మానవీయ కోణాన్ని మరిచారని చెప్పారు. అమెరికా ప్రక్కనే ఉన్న క్యూబాపై కూడా కత్తికట్టేందుకు ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ యుద్ధ కారణంగా దేశంలో పరిస్థితులు క్రమంగా మారిపోతున్నాయని, ధరలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గ్యాస్ ధరలతో పాటు ఇతర నిత్యవసరాల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆపరేషన్ అగార్ పేరుతో 3 వేల మంది మావోయిస్టులను ప్రభుత్వం హతమార్చిందని, కేంద్ర పోకడల కారణంగా అనేక మంది లొంగి పోతున్నారని చెప్పారు. చర్చలకు రానివ్వకుండా మారణహోమం సృష్టిస్తూ భయానక వాతావరణాన్ని కల్పించారని చెప్పారు. మావోయిస్టు రహిత భారతాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పిన కేంద్రం ఆ దిశగా సత్ఫలితాలు సాధించామంటూ చెప్పుకుంటుందని అన్నారు. అడవుల్లో నిక్షిప్తమైన ఉన్న సహజ వనరులను దోచుకునేందుకు కేంద్రం మావోయిస్టులను అడవుల నుండి బయటకు పంపుతోందని, అదానీ, అంబానీలకు అక్కడి సంపదను కారు చౌకగా కట్టబెట్టేందుకు బిజిపి చూస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వల పనితీరుపై ప్రశించే వారిని అర్బన్ నక్సలైట్లు అంటూ ముద్రవేసి వేదింపులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. బాబా సాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని మార్చే పెను ప్రమాదం ముంచుకొస్తోందని, దీనిపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నిలుపుకోవాలన్నారు. రాష్ట్రంలోని సబ్బండ వర్గాల ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు, రైతు రుణ మాఫీ తూతూ మంత్రంగా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి సంస్థను ప్రభుత్వం నిర్లక్షం చేస్తోందని, కార్మికుల హక్కులను కాలరాస్తూ ఇష్టాను సారంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. సేవ్ సింగరేణి పేరుతో సోమవారం సింగరేణి ప్రధాన కార్యాలయం ముట్టడి కార్యక్రమం విజయ వంతమైందని, దీంతో ప్రభుత్వానికి తమ సత్తా ఎంటోచాటామని తెలిపారు. సింగరేణి కార్మికుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం గత పాలకుల విధానాన్ని అవలంభిస్తోందని తెలిపారు. రాజకీయ సయోధ్యకు తాము కట్టుబడే ఉన్నామని, కానీ ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటాలు చేసేందుకు వెనుకంజ వేసేదే లేదని స్పష్టం చేశారు. కార్మికులు, రైతులు, మహిళలు, విద్యార్థులు, జర్నలిస్టుల సమస్యలపై శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు తన గళాన్ని అసెంబ్లీలో వినిపిస్తున్నారని, చట్ట సభల్లో మన ప్రాతినిధ్యం పెంచుకునేందుకు కృషి చేయాలన్నారు. గడిచిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఒంటిరిగా బరిలోకి దిగి తమ సత్త ఎంటో చాటామని, కమ్యూనిస్టులను తక్కువ చేసి చూసిన, మాట్లాడిన వాళ్ల నోళ్లు ఎల్లబెట్టుకునే ఫలితాలు సమిష్టిగా రాబట్టడ గలిగామన్నారు. రానున్న జెడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికల్లో ఇదే స్ఫూర్తిని కొనసాగిద్దామని తెలిపారు. జి వీరస్వామి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్రకార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాధం, కల్లూరి వెంకటేశ్వర రావు, మిరియాల రంగయ్య, కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్'తో పాటు జిల్లా కార్యవర్గ సభ్యులు కే సారయ్య, సరెడ్డి పుల్లారెడ్డి, మున్నా లక్ష్మీ కుమారి, ఎస్టి సలీం, సలిగంటి శ్రీనివాస్, చంద్రగిరి శ్రీనివాసరావు, వాసిరెడ్డి మురళీ, మువ్వా వెంకటేశ్వరరావు, కంచర్ల జమలయ్య, కందుల భాస్కర్, రేసు ఎల్లయ్య, వీసంశెట్టి పూర్ణచంద్రరావు, అడుసుమిల్లి సాయిబాబా,ఎస్ కే ఫహీం, డి శంకర్, బంధం నాగయ్య, మండల కార్యదర్శులు, జిల్లా సమితి సభ్యులు పాల్గొన్నారు.

# న్యాయవాదుల పరిరక్షణ చట్టం పట్ల హర్షం




**నారాయణపేట మార్చి 31: (స్కైన్యూస్)** న్యాయవాదుల పరిరక్షణ చట్టం తీసుకురావడం పట్ల నారాయణపేట సీనియర్ న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.మంగళవారం స్థానిక సి వి ఆర్ భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతు ఇచ్చిన మాటకు కట్టుబడి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కర్ణాటక,గుజరాత్ రాష్ట్రాల్లో అమలవుతున్న అడ్వకేట్ ప్రొటెక్షన్ ఆక్ట్ మన రాష్ట్రంలో కూడా అమలు చేయాలని ఒక మంచి సంకల్పంతో నిన్న ఆదివారం దుద్దిల్ల శ్రీధర్ బాబు మంత్రివర్యులు ద్వారా అసెంబ్లీలో ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు.ఈ బిల్లును చట్టముగా అసెంబ్లీలో ఏకగ్రీవంగా ఆమోదించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.ఈబిల్లు వలన కేవలం అడ్వకేట్ మాత్రమే కాకుండా వారి కుటుంబ సభ్యులు రక్షణ ఆస్తుల పరిరక్షణ కూడా కల్పిస్తూ చట్టం రూపకల్పన చేయడం యావత్ తెలంగాణ రాష్ట్ర అడ్వకేట్స్ ప్రయోజనం పొందినారన్నారు. ఈ చట్టాన్ని అమలు అమలు తీసుకురావాలని గతంలో రాష్ట్రంలోని న్యాయవాదులు ఎన్నో నిరసన చేపట్టిన ఉమ్మ డి మహబూబ్నగర్ జిల్లా ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రు లు ఎంతో చొరవ చూపి చట్టాన్ని సాధించడం జరిగిందన్నారు. వారందరికీ నారాయణపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ తరఫున రాష్ట్రంలోని న్యాయవాదులు అందరి తరఫున రాష్ట్ర ముఖ్యమంత్రికి, మంత్రి శ్రీహరి దేవరకద్ర శాసనస భ్యులు జి మధుసూదన్ రెడ్డి నారాయణపేట శాసనస భ్యులు చిట్టెం పర్ణికా రెడ్డికి, మహబూబ్నగర్ శాసనస భ్యులు శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా లీగల్ సెల్ ప్రెసిడెంట్ రాజేశ్వర్ గౌడ్ అడ్వకేట్, జిల్లా లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి డి .శివ రాజ్ అడ్వకేట్, వైస్ ప్రెసిడెం ట్ మునావర్ అడ్వకేట్ , జాయింట్ సెక్రెటరీ దినేష్ వర్మ అడ్వకేట్, నారాయణ పేట మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు రాజేష్ ఘాట్, నాయకులు వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# సొంత ఇంటి కల సాకారం....

**26వ వార్డులో నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీ**

**రంగారెడ్డి జిల్లా (స్కై న్యూస్) మార్చి 31:** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలో పేద ప్రజలు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న సొంత ఇంటి కల ఈరోజుతో తీరిపోయిందని తన వార్డులో 3 ముగ్గురికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పంపిణీ చేసినట్లు కౌన్సిలర్ ఎస్పీ శివ తెలిపారు నిరుపేదలకు ఇళ్లను పంపిణీ చేసినట్లు ఎస్పి శివ పేర్కొన్నారు ఈరోజు 3 ముగ్గురికి ఇళ్లకు సంబంధించిన పట్టాలను అందజేసినట్లు తెలిపారు లబ్ధిదారుల వివరాలను ఎస్పీ శివ మీడియాకు విడుదల చేశారు ఎనుముల మల్లిక, గంగిశెట్టి పార్వతమ్మ, మినుగుల అభిలాష్, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అందజేసినట్లు తెలిపారు.

## ఎస్ఎన్‌పీసీ జూనియర్ ఇన్స్పెక్టర్ గౌస్ పదవీ విరమణ



**సింగరేణి మార్చ్ 31 ( స్కై న్యూస్):**ఎస్ఎన్‌పీసీ డిపార్ట్మెంట్‌లో జూనియర్ ఇన్స్పెక్టర్‌గా పదవి విరమణ పొందిన గౌస్ కి ఘనంగా, భావోద్వేగపూర్వకంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ అభిలాష చేతుల మీదుగా, మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ఫంక్షన్ కమిటీ టెంపుల్ కమిటీ సంయుక్తంగా ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గౌస్ సేవలను కొనియాడారు. ఆయన నిజాయితీ, క్రమశిక్షణ, అందరితో కలిసిమెలిసి పనిచేసిన తీరు అందరికీ ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ కార్యక్రమం ఎంతో భావోద్వేగంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ఏఐటీయూసీ ఫిట్ సెక్రటరీ జే. రాంబాబు, జూనియర్ ఇన్స్పెక్టర్ కామరాజు , జమేదార్లు కమల్ సింగ్ , జయరాజు, వై. శ్రీనివాస్ , సీనియర్ గార్డ్స్‌గా ఆర్. హనోక్ రాజ్, జనార్దన్ రావు, మల్లికార్జున్, సుధాకర్, గౌస్, వి. సురేష్, ప్రైవేట్ సెక్యూరిటీ సూపర్వైజర్ సుంకరి శ్రీనివాస్, ఈశ్వర్, నూకరాజు తదితరులు, అలాగే తోటి గార్డ్స్, డ్రైవర్లు బంధుమిత్రులు పాల్గొన్నారు.చివరిగా అందరూ కలిసి గౌస్ భవిష్యత్తు జీవితం ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలని హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

## అట్టహాసంగా జరిగిన చేవెళ్ల బార్ అసోసియేషన్ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం



**రంగారెడ్డి జిల్లా (స్కై న్యూస్) మార్చి 31:** రంగారెడ్డి జిల్లా చేవెళ్ల కోర్టు బార్ అసోసియేషన్ నూతన పాలక వర్గం ప్రమాణ స్వీకారోత్సవం సోమవారం మధ్యాహ్నం నూతన అధ్యక్షులు పాటి మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది ఈ సందర్భంగా జిల్లా అదనపు న్యాయమూర్తి బృంగి శ్రీనివాసులు, సీనియర్ సివిల్ న్యాయమూర్తి దశరథ రామయ్య, జూనియర్ సివిల్ న్యాయమూర్తి విజయకుమార్ ఉపాధ్యాయ మాట్లాడుతూ కక్షిదారులకు సత్వర మరియు ఖచ్చితమైన న్యాయ సేవలు అందించడానికి చక్కటి బార్ బెంచ్ రిలేషన్ కొనసాగించవలసిన అవసరం పాలకవర్గంతో పాటు బార్ సభ్యులపై ఉందని న్యాయవ్యవస్థ పట్ల ప్రజలకు నమ్మకం కలిగేలా వ్యవహరించాలని వారు అన్నారు సీనియర్ న్యాయవాది రాంరెడ్డి మాట్లాడుతూ చేవెళ్ల కోర్టుకు రంగారెడ్డి జిల్లాలో ప్రత్యేక స్థానం ఉందని సుమారు 40 సంవత్సరాల క్రితం మున్సిఫ్ కోర్టుగా నలుగురు న్యాయవాదులతో ఏర్పడిన కోర్టు ఈరోజు జిల్లా కోర్టుగా 151 మంది సభ్యులతో నడవడం చేవెళ్ల ప్రాంత అభివృద్ధికి సూచికగా పేర్కొన్నారు న్యాయవాదులు నూతన పాలకవర్గం, గత పాలకవర్గానికి పూలమాలలు శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమం లో చేవెళ్ల బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ లు ఎన్ చంద్ర శేఖర్, ఎన్ మాధురి, జనరల్ సెక్రెటరీ పి. మల్లేష్ యాదవ్ , జాయింట్ సెక్రెటరీ ఈ.రవీందర్ రెడ్డి, ట్రెజరర్ ఈ. జనార్ధన్, స్పోర్ట్స్ అండ్ కల్చరర్ సెక్రెటరీ ఏ. ప్రభాకర్ రెడ్డి, లైబ్రేరియన్ టి. మహేష్, లేడీ రిప్రెసెంటేటివ్ ఈ. కవిత, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబెర్స్ ఎమ్.మహేష్, కె.సుదర్శన్, బి.ఆనంద్, సి.ప్రవీణ్ రెడ్డి, కె.ప్రవీణ, బి.మనీషా రెడ్డి తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

## షాద్ నగర్ చౌరస్తా
# విస్తరణకు రంగం సిద్ధం

**షాద్ నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్**

**చౌరస్తా ప్రాంగణాన్ని పరిశీలించిన హెచ్ఎండిఏ ఏఈ విశ్వతేజ**




**రంగారెడ్డి జిల్లా (స్కై న్యూస్) మార్చ్ 31:** ఎంతోకాలంగా షాద్ నగర్ పట్టణ ప్రజలు ఎదురుచూస్తున్న చౌరస్తా విస్తరణ కార్యక్రమం త్వరలోనే అధికారులు చేపట్టే అవకాశాలు ఉన్నాయని షాద్ నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ స్పష్టం చేశారు పట్టణ చౌరస్తాలో హెచ్ఎండిఏ శాఖకు చెందిన ఏఈ విశ్వతేజ సందర్శించి ప్రాంగణాన్ని పరిశీలించారు చౌరస్తా విస్తరణలో భాగంగా సదర్ ప్రాంతాన్ని తిలకించారు ఈ సందర్భంగా చౌరస్తా విశేషాలను స్థానిక మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, కౌన్సిలర్లు మురళీమోహన్ అప్పి, పెంటయ్య, కళ్యాణ్ కార్ దిలీప్, నాయకులు ముబారక్ అలీ ఖాన్, సాదిక్, వీర్లపల్లి మహబూబ్ తదితరులు వారి వెంట ఉన్నారు ఎంతోకాలంగా చౌరస్తా విస్తరణ పనులు చేపట్టేందుకు రంగం సిద్ధం అయ్యిందని అయితే అన్ని అవసరాలకు అనుగుణంగా ప్రజల సౌకర్యార్థం చేపట్టబోయే పనులు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిలబడతాయని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కృషితో పట్టణ అభివృద్ధికి పూర్తి సహకారం ప్రజలు వ్యాపారస్తులు అందిస్తున్నారని చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## ముగిసిన జిల్లా స్థాయి క్రీడా పాఠశాలలకు ఎంపికలు



**నారాయణపేట మార్చి 31: (స్కైన్యూస్)** నారాయణపేట జిల్లా కేంద్రంమినీ స్టేడియంలో మంగళవారం జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలో గల క్రీడా పాఠశాలలో 4వ తరగతి నందు ప్రవేషం కొరకై జిల్లా స్థాయి ఎంపికలు నిర్వహిం చారు. ఈ ఎంపికలకు నారా యణపేట జిల్లాలోని వివిధ మండలాలకు సంబందించిన 74 మంది బాల బాలికలు పాల్గోన్నారు. ఈ జిల్లా స్థాయి లోఎంపిక అయిన బాల బాలికలకు ఏప్రిల్ 30, మే 1న నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు హాకీంపేట్ స్పోర్ట్స్ స్కూల్, హైద్రాబాద్ నందు పంపబడునని ది వి ఎస్ ఓ వెంకటేష్ తెలిపారు.ఈ కార్యక్రమంలో పి.డిలు,పి.ఇ.టీ లు పాల్గోన్నారు.

# ఎమ్మెల్యే సన్మానించిన డిపిఆర్ఓ...



**మహబూబ్ నగర్, మార్చి** ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఇటీవల ప్రభుత్వ విప్‌గా ఎంపికైన సందర్భంగా మహబూబ్ నగర్ జిల్లా సమాచార ట ప్రజాసంబంధాల శాఖ (డిపిఆర్ఓ) అధికారి శ్రీనివాస్ ఎమ్మెల్యే ని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా డిపిఆర్ఓ ఎమ్మెల్యే కి శాలువా కప్పి ఘనంగా సన్మానించి, ప్రభుత్వ విప్‌గా బాధ్యతలు స్వీకరించినందుకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు సమర్థంగా చేరవేయడంలో సమాచార శాఖ పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ప్రజలకు సరైన సమాచారం అందేలా అధికారులు చురుకుగా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చారి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ కార్పొరేషన్ లోన్ల ఆన్లైన్ గడువు ఏప్రిల్ 8 వరకు పెంపు జిల్లా కలెక్టర్ అంకిత్, ఐ.ఏ.ఎస్




**కొత్తగూడెం మార్చి 31 (స్కై న్యూస్ ):**జిల్లా షెడ్యూల్డ్ కులముల సేవా సహకార అభివృద్ధి సంఘం లి., భద్రాద్రి కొత్తగూడెం ద్వార అమలు చేస్తున్న యస్సీ కార్యచరణ ప్రణాళిక 2025-26 పథకాల నమోదుకు దరఖాస్తు గడువును ఏప్రిల్ 8 వ తేది వరకు పొడగించినట్లు జిల్లా కలెక్టర్ అంకిత్, ఐ.ఏ.ఎస్. ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాంకు అనుసందానం తో రవాణా విభాగానికి సంబంధించి ఈ వి ద్విచక్ర వాహనాలు, త్రిచక్రాల గూడ్స్ పాసెంజర్ వాహనాలు, పశు సంవర్ధక రంగంలో పాడి పశువులు మరియు సోలార్ పంప్ సెట్ వంటి పథకాలకు అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. అర్హులైన ఆసక్తి కల అభ్యర్థులు ఆన్లైన్ పోర్టల్ **https://tgobmms.cgg.gov.in** ద్వారా దరఖాస్తు నమోదు చేసుకొని దరఖాస్తు ఫారమ్ ను డౌన్లోడ్ చేసుకొని హార్డ్ కాపీని మరియు అవసరమైన పత్రాలను జత పరచి గ్రామీణ ప్రాంతాల వారు ఎంపిడిఓ కార్యాలయం లో (లేదా) పట్టణ ప్రాంతాల వారు మున్సిపల్ కార్యాలయం లో సమర్పించాలని తెలియజేసారు. మరిన్ని వివరాల కొరకు 9849905990 ను సంప్రదించాలని తెలిపారు.

## షాద్ నగర్ డిగ్రీ కళాశాల లో జాబ్ మేళా....



రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్, డాక్టర్ కమల అధ్యక్షతన, వైస్ ప్రిన్సిపాల్ పాలాది శ్రీనివాసులు పర్యవేక్షణలో, ఎంఎస్ఎన్ ల్యాబ్స్ వారి ఆధ్వర్యము లో బి.ఎస్.సి, కెమిస్ట్రీ, బిఏ, బి కామ్, పాసైన పురుష విద్యార్థులకు జాబ్ మేళా నిర్వహించడం జరిగినది ఇందులో 41 మంది పాల్గొన్నారు 8 మంది అభ్యర్థులు ఎంపిక కావడము జరిగినది ఎంపికైన అభ్యర్థుల కు జీతము తో పాటు నైట్ షిఫ్ట్ అలోవెన్స్, ఉచిత బస్సు సౌకర్యం, సబ్సిడీతో కూడిన క్యాంటీన్ సౌకర్యము,ఈ ఎస్ ఐ, ఈ పి ఎఫ్, గ్రాట్యూటి సౌకర్యము కల్పించబడునని నిర్వాహకులు తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఎం ఎస్ ఎన్ కంపెనీ తరఫున ప్రశాంత్ భూషణ్ రెడ్డి హెచ్ ఆర్, మురళి ప్రొడక్షన్ మేనేజర్, భరత్ కుమార్ రెడ్డి ప్రొడక్షన్ డిపార్ట్మెంట్ ,పాల్గొన్నారు అనురాధ కామర్స్ సధ్యాపకులు, సందీప్ హిస్టరీ అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ను సన్మానించిన కొత్తూరు కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు జె. సుదర్శన్ గౌడ్




**రంగారెడ్డి జిల్లా (స్కై న్యూస్) మార్చి 31:** రంగారెడ్డి జిల్లా కొత్తూరు మున్సిపల్ లో బడ్జెట్ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ను మున్సిపాలిటీ కొత్తూరు అధ్యక్షుడు జండ గూడెం సుదర్శన్ గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు కొండారెడ్డి సుమన్ శాలువాతో ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ డోలి రవీందర్, కౌన్సిలర్స్ కోస్గి శ్రీనివాస్,కమ్మరి జయమ్మ జనార్దన్ చారి, మాజీ సర్పంచ్ జగన్, షాద్ నగర్ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కర్రోళ్ల సురేందర్, మండల యూత్ అధ్యక్షుడు వన్నాడ శివశంకర్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు రవికుమార్ గుప్తా, చిల్కమర్రి నరసింహ, పెంటయ్య యాదవ్, చింత సాయి తేజశ్వర్, నరసింహ గౌడ్, విక్రమ్, తదితరులు పాల్గొన్నారు.

# యాసంగి ధాన్యం ప్రతి గింజ కొనుగోలు చేయాలి

**: జిల్లా కలెక్టర్ అంకిత్**





**కొత్తగూడెం మార్చి 31 స్కై (న్యూస్ ):**యాసంగి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహిస్తూ రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడిఓసి సమావేశ మందిరంలో జిల్లా పౌర సరఫరాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ తో కలసి కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జ్లు, వ్యవసాయ, సహకార, డీఆర్‌డీఏ, తూనికలు–కొలతలు, రవాణా మార్కెటింగ్ శాఖ అధికారులు,సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 1,87,309 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అంచనా ఉన్నదని, అందులో సన్న రకం 1,35,365 మెట్రిక్ టన్నులు, దొడ్డు రకం 51,944 మెట్రిక్ టన్నులు ఉన్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో 168 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, అవసరాన్ని బట్టి అదనపు కేంద్రాలు కూడా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం ధాన్యాన్ని ఏ, బి గ్రేడ్‌లుగా విభజించి మద్దతు ధరలు నిర్ణయించినట్లు తెలిపారు. ఏ గ్రేడ్ ధాన్యానికి రూ. 2389, బి గ్రేడ్‌కు రూ. 2369 ధరలు నిర్ణయించగా, సన్న రకం వడ్లకు అదనంగా రూ. 500 బోనస్ ఇవ్వబడుతుందని వెల్లడించారు.ఈ సంవత్సరం ఉష్ణోగ్రతలు అధికంగా ఉండే అవకాశం ఉన్నందున కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు, హమాలీలు ఎండబారకుండా టెంట్లు, షెడ్ నెట్‌లు, చలువ పందిళ్లు ఏర్పాటు చేసి తగిన నీడ కల్పించాలని సూచించారు. తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.కొనుగోలు కేంద్రాల్లో రద్దీ నియంత్రణ కోసం క్రాప్ బుకింగ్ ఆధారంగా రైతులకు టోకెన్లు జారీ చేయాలని, అవసరమైన ఏర్పాట్లపై చెక్‌లిస్ట్ జారీ చేసి, దాని ప్రకారం చర్యలు తీసుకొని ధృవీకరణ నివేదికలు సమర్పించాలని సూచించారు.సరిహద్దు రాష్ట్రాల నుండి అక్రమంగా ధాన్యం రాకుండా జిల్లాలో చెక్‌పోస్టుల ద్వారా పటిష్ఠ నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని అదే రోజు ఆన్‌లైన్ నమోదు చేసి రైస్ మిల్లులకు తరలించాలని, రవాణాలో జాప్యం జరగకుండా మిల్లర్లు చర్యలు తీసుకోవాలని చెప్పారు.ధాన్యం విక్రయాలపై రైతులకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తే రైతులకు మెరుగైన ధర లభిస్తుందని, రైతులను సన్నద్ధం చేయాలని సూచించారు. తరుగు పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేస్తే సంబంధిత సెంటర్ ఇన్‌చార్జ్లు, మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.రైతులు ధాన్యం విక్రయానికి వచ్చినప్పుడు ఆధార్ కార్డు, బ్యాంక్ వివరాలు, పట్టాదారు పాస్‌బుక్ జిరాక్స్ వెంట తీసుకురావాలని సూచించారు. ఆధార్‌కు లింక్ అయిన మొబైల్ నెంబర్‌కు వచ్చే ఓటీపీ ద్వారా రిజిస్ట్రేషన్ జరుగుతుందని తెలిపారు. గన్నీ సంచులు సరిపడా నిల్వలో ఉంచి, ఆన్‌లైన్ నమోదు చేసిన రైతులకు మాత్రమే ఇవ్వాలని, వాటి వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు.కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు, మాయిశ్చర్ మీటర్లు సిద్ధంగా ఉంచాలని, బ్యానర్ల ద్వారా మద్దతు ధరలు, నాణ్యతా ప్రమాణాలు, అధికారుల సంప్రదింపు వివరాలు స్పష్టంగా ప్రదర్శించాలని ఆదేశించారు. సన్న వడ్లు, దొడ్డు వడ్లకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు.ధాన్యం కొనుగోలు సమయంలో ఐరిస్ స్కానర్ ద్వారా మాత్రమే ప్రక్రియ పూర్తి అవుతుందని, డేటా ఎంట్రీ సమయంలో రైతు తప్పనిసరిగా హాజరుగా ఉండాలని తెలిపారు. తూకపు పరికరాలను తనిఖీ చేసి సీల్స్ వేయాలని సూచించారు.అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ధాన్యం కొనుగోలు ప్రక్రియను విజయవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, కొత్తగూడెం ఆర్ డి ఓ మధు,పౌర సరఫరాల సంస్థ మేనేజర్ త్రినాధ్ బాబు , పౌర సరఫరాల అధికారి ప్రేమ్ కుమార్ , వ్యవసాయ అధికారి బాబురావు, తూనికలు–కొలతల అధికారి మనోహర్, మార్కెటింగ్ అధికారి నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

# నిజాయితీకి నిదర్శనం... ప్రజాసేవే ధ్యేయంగా, అభివృద్ధికి అంకితమైన మహానేత -పొంగులేటి శ్రీనన్న...

**రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల**



**పాల్వంచ మార్చి 31 (స్కై న్యూస్ ):**రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పై బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని, రాజకీయ ప్రేరేపితమైనవని రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు తీవ్రంగా ఖండించారు.మంత్రి పొంగులేటిపై బీఆర్ఎస్ నాయకుల ఆరోపణలు నేపథ్యంలో కొత్వాల మాట్లాడుతూ,పొంగులేటి శ్రీనన్న నిజాయితీకి నిదర్శనమని ప్రజాసేవే ధ్యేయంగా, అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తున్న మహానేత అని అన్నారు. రెవెన్యూ శాఖలో మంత్రి చేపట్టిన సంస్కరణలు, భూసంబంధిత సమస్యల పరిష్కారంలో చూపుతున్న చొరవ ప్రశంసనీయం అన్నారు. గ్రామ స్థాయిలో భూ వివాదాల పరిష్కారం నుంచి భూ రికార్డుల శుద్ధి వరకు ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం కలిగే విధంగా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఈ ప్రజాహిత కార్యక్రమాలే కొందరికి అసహనంగా మారి, తప్పుడు ఆరోపణలకు దారితీస్తున్నాయని ఆయన విమర్శించారు. ప్రజల్లో గందరగోళం సృష్టించడమే ఈ ఆరోపణల అసలు ఉద్దేశ్యమని స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు ఎప్పటిలాగే అభివృద్ధిని అడ్డుకోవడానికే ఇలాంటి దుష్ప్రచారాలకు పాల్పడుతున్నాయని, కానీ తెలంగాణ ప్రజలు చాలా అవగాహనతో ఉన్నారని, ఎవరు నిజం మాట్లాడుతున్నారు, ఎవరు అసత్య ప్రచారం చేస్తున్నారు అనేది వారికి బాగా తెలుసని అన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకంగా పనిచేస్తోందని, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రజల కోసం అంకితభావంతో సేవలందిస్తున్నారని కొత్వాల పేర్కొన్నారు.రాజకీయ మనుగడ కోసమే హరీష్ రావు మరియు బీఆర్ఎస్ నాయకులు ఇలాంటి దుష్ప్రచారాలకు దిగుతున్నారని ఆరోపించారు. అయినప్పటికీ, ఈ ఆరోపణలు మంత్రి పొంగులేటి అంకితభావాన్ని, ప్రజాసేవ పట్ల ఉన్న నిబద్ధతను ఏమాత్రం దెబ్బతీయలేవని కొత్వాల స్పష్టం చేశారు.

# 34 ఏళ్ల విశిష్ట సేవలకు ఘన వీడ్కోలు

**- ఇద్దరు హెడ్ కానిస్టేబుల్స్‌కు ఎస్పీ సన్మానం**






**జోగులాంబ గద్వాల, మార్చి 31(స్కై న్యూస్):**జోగుళాంబ గద్వాల్ జిల్లా పోలీస్ శాఖలో సుదీర్ఘంగా 34 సంవత్సరాలపాటు క్రమశిక్షణతో, నిబద్ధతతో సేవలు అందించి మంగళవారం పదవీ విరమణ పొందుతున్న హెడ్ కానిస్టేబుల్స్ నందూరి విజయ భాస్కర్ రాజు మరియు ఈడుగ నరసింహ గౌడ్‌లకు జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు, ఐపీఎస్ ఘనంగా సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ఇద్దరూ 1992 సంవత్సరంలో సివిల్ కానిస్టేబుల్స్‌గా పోలీస్ శాఖలో చేరి తమ సేవా ప్రయాణాన్ని ప్రారంభించారని తెలిపారు. సేవా కాలమంతా నిజాయితీ, క్రమశిక్షణ, బాధ్యతతో విధులు నిర్వర్తిస్తూ శాఖకు గౌరవాన్ని తీసుకొచ్చారని కొనియాడారు. నరసింహ గౌడ్ 2018లో, భాస్కర్ రాజు గారు 2022లో హెడ్ కానిస్టేబుల్స్‌గా పదోన్నతి పొందారని చెప్పారు. భాస్కర్ రాజు ఈగలపెంట, ఉప్పునుంతల, కొత్తూరు, గద్వాల్ టౌన్, అయిజ పోలీస్ స్టేషన్లలో సమర్థవంతంగా విధులు నిర్వర్తించగా, నరసింహ గౌడ్ గారు తాండూరు, రాజోలి, నారాయణపేట, మానవపాడు, తలకొండపల్లి, గద్వాల్ రూరల్, అయిజ, గట్టు, గద్వాల్ సీసీఎస్, అలంపూర్ పోలీస్ స్టేషన్లలో విశేష సేవలందించారు. వీరిద్దరూ తమ విధుల్లో ఎప్పుడూ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ప్రజలకు సేవ చేయడంలో ముందుండి, ఉన్నతాధికారుల ప్రశంసలు అందుకున్నారు. పోలీస్ శాఖలో పనిచేసే సమయంలో సంపాదించిన అనుభవం, విలువలు జీవితాంతం వారికి దోహదపడతాయని ఎస్పీ పేర్కొన్నారు. పదవీ విరమణ సందర్భంగా పోలీస్ శాఖ తరఫున వారికి ఘనంగా వీడ్కోలు తెలియజేస్తూ, భవిష్యత్తులో ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. మిగిలిన జీవితాన్ని కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని, ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ప్రతి రోజూ యోగ, ధ్యానం వంటి అలవాట్లను అలవరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ కె. శంకర్, అలంపూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ వి. ప్రదీప్ కుమార్, శాంతినగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ టాటా బాబు, గద్వాల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ టి. శ్రీను, అలంపూర్ ఎస్సై రామకృష్ణ, అయిజ ఎస్సై పి. శ్రీనివాస్ రావు తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే భాస్కర్ రాజు మరియు నరసింహ గౌడ్ కుటుంబ సభ్యులు హాజరై అభినందనలు తెలిపారు.

# ప్రతి విద్యార్థి బాధ్యతాయుతమైన పౌరుడుగా ఎదగాలి..డిఎస్పి ఆదినారాయణ



**చుంచు పల్లి మార్చ్ 31( స్కై న్యూస్):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం విద్యానగర్ గ్రామపంచాయతీ రామ్ నగర్ లోని ఎస్ ఆర్ డీజీ పాఠశాలలో ఏర్పాటు చేసినటువంటి అవగాహన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన డి.ఎస్.పి ఆదినారాయణ . ఈ సంధ్భంగా వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సమాజంపై బాధ్యతాయుతమైన పౌరుడుగా ఎదగాలని ఆకాంక్షించారు. నేటి సమాజంలో పెరిగిపోతున్న అవినీతి, డ్రగ్స్ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కలిగించే కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. సమాజ ఎదుగుదలలో ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా నడుచుకోవాలని ట్రాఫిక్ రూల్స్ తప్పనిసరిగా పాటించాలని, మన చుట్టుపక్కల జరుగుతున్న అవినీతిపై జాగరుకులై ఉండాలని, మీరూ ఎంతోమందికి మార్గదర్శకూలుగా ఎదగాలని కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో సిఐ వెంకటేశ్వర్లు రోడ్డు వారోత్సవాల లో భాగంగా విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ ఆర్ కొత్తగూడెం జోనల్ ఇంచార్జ్ సతీష్, ఎస్సై రవికుమార్ ఎస్ ఆర్ డిజి ప్రిన్సిపల్ తిరుమల్ రెడ్డి ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.



# మంచిదని ఫుల్లుగా తాగుతున్నారా?

అతిగా నీరు తాగడం మూత్రపిండాలపై ఒత్తిడిని పెంచి, ఎలక్ట్రోలైట్ సమతుల్యతను దెబ్బతీస్తుంది. ఇది మూత్రపిండాల ఆరోగ్యానికి హానికరం. తరచుగా మూత్రవిసర్జన, వాపు, తలనొప్పి వంటి లక్షణాలు అధిక హైడ్రేషన్‌ను సూచిస్తాయి. మీ వయస్సు, బరువు, శారీరక శ్రమను బట్టి రోజుకు 2-3 లీటర్లు తాగడం సరిపోతుంది. ఆరోగ్యకరమైన మూత్రపిండాల కోసం సమతుల్య జీవనశైలి అవసరం. మీరు ఎంత ఎక్కువ నీరు తాగితే అది మీ శరీరానికి, పిండాలకు అంత మంచిదని చాలా మంది నమ్ముతారు.. ఇలానే రోజు మొత్తంలో ఎక్కువ నీరు తాగుతారు.. అయితే.. మూత్రపిండాల పని రక్తాన్ని శుభ్రపరచడం, శరీరం నుండి అవసరమైన, విషపూరిత పదార్థాలను వేరు చేయడం.. మూత్రం ద్వారా వాటిని విసర్జించడం. మనం తాగే నీరు ఈ ప్రక్రియలో సహాయపడుతుంది. కానీ నీటిని అధికంగా వినియోగించినప్పుడు, అది మూత్రపిండాలపై అధిక ఒత్తిడిని కలిగిస్తుంది.. శరీర సహజ సమతుల్యతను దెబ్బతీస్తుంది. ఎక్కువ నీరు త్రాగడం వల్ల తరచుగా మూత్ర విసర్జన, వాపు, తలనొప్పి , అలసట, వికారం, కొన్నిసార్లు తలతిరగడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. కొంతమందికి చేతులు, కాళ్ళు బరువుగా ఉండటం, నిద్ర పట్టడంలో ఇబ్బంది కలగవచ్చు. ఈ సంకేతాలు శరీరం అవసరమైన దానికంటే ఎక్కువ నీటిని తీసుకుంటున్నట్లు సూచిస్తాయి. ఢిల్లీ ఆర్ఎంఎల్ హాస్పిటల్‌లోని మెడిసిన్ విభాగం డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ సుభాష్ గిరి దీని గురించి సవివరంగా వివరించారు. ఒక వ్యక్తి నిరంతరం అవసరమైన దానికంటే ఎక్కువ నీరు తాగినప్పుడు, మూత్రపిండాలు దానిని పదే పదే ఫిల్టర్ చేయాల్సి వస్తుంది. ఇది మూత్రపిండాల సామర్థ్యంపై ఎక్కువ ఒత్తిడిని కలిగిస్తుంది. అధిక నీరు శరీరంలోని ఉప్పు, ఇతర ఎలక్ట్రోలైట్‌ల సమతుల్యతను దెబ్బతీస్తుంది.. దీని వలన సోడియం స్థాయిలు తగ్గుతాయి. ఈ స్థితిలో, కణాలలో నీరు పేరుకుపోవడం ప్రారంభమవుతుంది, ఇది మెదడు, కండరాలకు హానికరం కావచ్చు. మూత్రపిండాలు సరిగ్గా పనిచేయకపోతే, మూత్రం చాలా పాలిపోయినట్లు కనిపించడం లేదా తరచుగా మూత్రవిసర్జన చేయడం కూడా ఒక సంకేతం కావచ్చు. ఇది చాలా కాలం పాటు కొనసాగితే, ఇప్పటికే బలహీనమైన మూత్రపిండాలు ఉన్నవారిలో సమస్య మరింత తీవ్రమవుతుంది. అందువల్ల, ఎక్కువ నీరు త్రాగడం వల్ల మూత్రపిండాలకు కూడా ప్రమాదం ఏర్పడుతుంది.. అని వివరించారు. నీటి అవసరాలు ప్రతి వ్యక్తికి ఒకేలా ఉండవు. అవి వయస్సు, బరువు, వాతావరణం, శారీరక శ్రమ, ఆరోగ్యంపై ఆధారపడి ఉంటాయి. సాధారణంగా, రోజుకు 2 నుండి 3 లీటర్ల నీరు సరిపోతుందని భావిస్తారు. వేడి వాతావరణంలో లేదా మీరు అధికంగా చెమట పట్టినట్లయితే ఈ మొత్తాన్ని కొద్దిగా పెంచవచ్చు. దాహం వేసినప్పుడు నీరు త్రాగడం, మీ మూత్రం రంగును గమనించడం సులభమయిన మార్గం.. లేత పసుపు రంగు సాధారణమైనదిగా పరిగణించబడుతుంది. మీ మూత్రం స్పష్టంగా, తరచుగా వస్తూ ఉంటే, అది అధిక హైడ్రేషన్‌కు సంకేతం కావచ్చు. మీ వైద్యుడిని సంప్రదించకుండా మీరు ఎక్కువ నీరు తాగే అలవాటును పెంచుకోకూడదు. మీ మూత్రపిండాలను ఆరోగ్యంగా ఉంచుకోవడానికి నీరు మాత్రమే కాదు, సమతుల్య జీవనశైలి కూడా అవసరం. మీ ఉప్పు తీసుకోవడం పరిమితం చేయండి.. వేయించిన ఆహారాలను నివారించండి. క్రమం తప్పకుండా భోజనం చేయండి.. తగినంత నిద్ర పొందండి. మీ వైద్యుడిని సంప్రదించకుండా ఎక్కువ కాలం నొప్పి నివారణ మందులు తీసుకోవడం మానుకోండి.. ఎందుకంటే అవి మీ మూత్రపిండాలను దెబ్బతీస్తాయి. రక్తపోటు, చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుకోవడం కూడా మూత్రపిండాల ఆరోగ్యానికి చాలా ముఖ్యం. మితమైన వ్యాయామం, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు మూత్రపిండాల ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి సహాయపడతాయి.

# ఆరోగ్యానికి ఏది మంచిది?



ఆరోగ్యం పట్ల అవగాహన పెరగడంతో డైట్ చార్ట్‌లో సూపర్ ఫుడ్స్ హవా కొనసాగుతోంది. ముఖ్యంగా చియా సీడ్స్, గుమ్మడి గింజలు పోషకాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారాయి. అయితే బరువు తగ్గాలనుకునే వారు దేనిని ఎంచుకోవాలి? కండరాల పుష్టి కోసం ఏది మేలు చేస్తుంది? ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో ఆరోగ్యంపై శ్రద్ధ చూపే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. సరైన ఆహారం తీసుకోవడం ద్వారా వ్యాధులను దూరం చేసుకోవచ్చనే అవగాహన అందరిలోనూ వస్తోంది. ఈ క్రమంలోనే సూపర్ సీడ్స్‌గా పిలిచే చియా గింజలు, గుమ్మడి గింజలు నేడు ప్రతి ఒక్కరి కిచెన్ డైట్‌లో భాగమవుతున్నాయి. అయితే ఈ రెండింటిలో ఏది మీ శరీరానికి ఎక్కువ మేలు చేస్తుందనే విషయంలో చాలామందికి స్పష్టత ఉండదు. వాస్తవానికి ఈ రెండు గింజలు పోషకాల గనులే అయినప్పటికీ, వాటి పనితీరు, ప్రయోజనాలు వేర్వేరుగా ఉంటాయి. మీరు బరువు తగ్గాలని లేదా జీర్ణక్రియను మెరుగుపరుచుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంటే చియా సీడ్స్ అద్భుతమైన ఎంపిక. వీటిలో గుమ్మడి గింజల కంటే సుమారు ఐదు రెట్లు ఎక్కువ ఫైబర్ ఉంటుంది. ఈ పీచు పదార్థం వల్ల ఆహారం తిన్న తర్వాత కడుపు నిండుగా ఉన్న అనుభూతి కలుగుతుంది. తద్వారా అనవసరమైన ఆకలి తగ్గుతుంది. అంతేకాకుండా చియా గింజలు ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్, కాల్షియానికి ప్రధాన వనరులు. ఇవి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా ఎముకల దృఢత్వానికి కూడా తోడ్పడతాయి. ముఖ్యంగా మధుమేహం ఉన్నవారిలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచడానికి ఇవి ఎంతగానో సహకరిస్తాయి. మరోవైపు కండరాల బలం, మానసిక ప్రశాంతత కోరుకునే వారికి గుమ్మడి గింజలు సరైన తోడుగా నిలుస్తాయి. చియా గింజలతో పోలిస్తే వీటిలో ప్రోటీన్ శాతం చాలా ఎక్కువ. శరీర కణాల మరమ్మత్తుకు, కండరాల నిర్మాణానికి ఈ ప్రోటీన్ అత్యవసరం. అన్నింటికంటే ముఖ్యంగా గుమ్మడి గింజల్లో మెగ్నీషియం పుష్కలంగా ఉంటుంది. ఇది రక్తపోటును నియంత్రించడమే కాకుండా నరాలు, కండరాల పనితీరును మెరుగుపరుస్తుంది. రాత్రిపూట నిద్రలేమితో బాధపడేవారు ఈ గింజలను తీసుకోవడం వల్ల వీటిలోని ట్రిప్టోఫాన్ అనే అమైనో యాసిడ్ వల్ల ప్రశాంతమైన నిద్ర పడుతుంది. వీటిలో ఉండే జింక్ మరియు విటమిన్-ఇ రోగనిరోధక శక్తిని పెంచడంలో కీలకంగా మారుతాయి. చివరగా ఈ రెండింటిలో ఏదో ఒకదానికే పరిమితం కాకుండా రెండింటినీ మీ దైనందిన ఆహారంలో చేర్చుకోవడం ఉత్తమమని నిపుణులు సూచిస్తున్నారు. దీనివల్ల మీకు ఫైబర్, ప్రోటీన్, మెగ్నీషియం, ఒమేగా-3 వంటి అన్ని రకాల పోషకాలు సమతుల్యంగా అందుతాయి. అయితే తీసుకునే విధానంలో కొన్ని జాగ్రత్తలు పాటించాలి. చియా గింజలను ఎప్పుడూ నేరుగా పొడిగా తినకూడదు వాటిని నీటిలో లేదా స్మూతీస్ వంటి ద్రవ పదార్థాల్లో కనీసం 20 నిమిషాలు నానబెట్టిన తర్వాతే తీసుకోవాలి. గుమ్మడి గింజలను పచ్చిగా లేదా దోరగా వేయించి స్నాక్స్‌లా తీసుకోవచ్చు. మీ శరీర అవసరాలను బట్టి ఈ సూపర్ సీడ్స్‌ను మీ డైట్‌లో భాగం చేసుకుని సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందండి.

# ఈ చేప తింటే ఆ సమస్యలన్నీ మాయం



అధిక రక్తపోటు, మధుమేహం, కొవ్వు సమస్యలతో సతమతమవుతున్నారా? అయితే చేపల ప్రియుల కోసం ఒక శుభవార్త.. ఇటీవలి అధ్యయనాల ప్రకారం.. పండుగప్ప చేపను తినడం వల్ల దీర్ఘకాలిక సమస్యల నుండి ఉపశమనం పొందవచ్చని తేలింది. నాన్‌వెజ్ ప్రియుల బాగా ఇష్టంగా తినేది చేపలు. చేపల పులుసు, చేపల ఫ్రై అంటే చాలా మందికి పిచ్చి. అయితే మీరు మార్కెట్‌కు వెళ్లే ముందు ఈ విషయం తెలుసుకోండి. మీరు బరువు తగ్గాలని చూస్తున్నారా? లేదా కొలెస్ట్రాల్‌ను అదుపులో ఉంచుకోవాలనుకుంటున్నారా? అయితే పండుగప్ప చేప మీ ఆహారంలో ఉండాల్సిందేనని నిపుణులు చెబుతున్నారు. ఇటీవలి అధ్యయనాల ప్రకారం.. కొడువా చేప కేవలం రుచిలోనే కాదు ఆరోగ్య ప్రయోజనాల్లోనూ మేటి అని తేలింది. ముఖ్యంగా రక్తపోటును నియంత్రించడంలో, రోగనిరోధక శక్తిని పెంచడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. 2017-18లో పశ్చిమ బెంగాల్‌లోని ప్రముఖ విశ్వవిద్యాలయాల ప్రొఫెసర్లు నిర్వహించిన పరిశోధన ఫలితాలు గతేడాది విడుదలయ్యాయి. ఈ నివేదిక ప్రకారం.. పండుగప్ప చేప రక్తంలోని చక్కెర స్థాయిలను గణనీయంగా తగ్గిస్తుందని స్పష్టమైంది. పండుగప్ప చేపలో ఉండే ఒమేగా-3, ఒమేగా-6 ఫ్యాటీ యాసిడ్స్ శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడతాయి. దీనివల్ల గుండె జబ్బులు, గుండెపోటు వచ్చే ప్రమాదం తగ్గుతుంది. అంతేకాకుండా ఇందులోని ఒమేగా-3 ఆమ్లాలు మెదడు పనితీరును మెరుగుపరిచి, జ్ఞాపకశక్తిని పెంచుతాయి. ఇది పిల్లల నుండి వృద్ధుల వరకు అందరికీ ఎంతో మేలు చేస్తుంది. ఈ చేపలో విటమిన్-ఎ, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి కంటి చూపును మెరుగుపరచడమే కాకుండా వృద్ధులలో వచ్చే కంటిశుక్లం సమస్యను ఆలస్యం చేస్తాయి. అలాగే ఇతర చేపలతో పోలిస్తే ఇందులో విటమిన్-డి అత్యధికంగా ఉంటుంది. ఇది ఎముకలను దృఢంగా మార్చడానికి, రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేయడానికి తోడ్పడుతుంది. బరువు తగ్గాలని కఠినమైన డైట్ ఫాలో అయ్యేవారికి ఈవా చేప ఒక గొప్ప వరం. 100 గ్రాముల పండుగప్ప చేపలో సుమారు 22 గ్రాముల ప్రోటీన్ ఉంటుంది. ఇది కండరాల బలానికి అవసరం. సాల్మన్ చేపతో పోలిస్తే ఇందులో కేలరీలు సగం మాత్రమే ఉంటాయి. అధిక ప్రోటీన్, తక్కువ కేలరీలు ఉండటం వల్ల ఇది శరీరంలో అదనపు కొవ్వును కరిగించి, బరువు తగ్గడానికి దోహదపడుతుంది.

# వేసవిలో మజ్జిగ ఎక్కువగా తాగుతున్నారా?



వేసవికాలంలో చాలా మంది మజ్జిగ ఎక్కువగా తాగుతుంటారు. కొందరు సాధారణ మజ్జిగ తాగుతారు. మరికొందరు జీలకర్ర, ఇతర మసాలాలు, సుగంధ ద్రవ్యాలు కలిపి మసాలా మజ్జిగ తాగుతారు. కొందరు భోజనం తర్వాత, మరికొందరు రాత్రి భోజనం తర్వాత మజ్జిగ తాగుతారు. కానీ అందరూ మజ్జిగ తాగడం వల్ల ప్రయోజనం ఉండదు. ప్రతి ఒక్కరి శరీరంలో తలెత్తే సమస్యలు భిన్నంగా ఉంటాయి. కాబట్టి, సాధారణంగా మజ్జిగ తాగడానికి బదులుగా, మజ్జిగ తాగేటప్పుడు కొన్ని మార్పులు చేసుకోవడం అవసరం. ఆయుర్వేదంలో, మజ్జిగ తీసుకోవడం ప్రతి వ్యక్తి శరీర స్వభావాన్ని బట్టి భిన్నంగా ఉంటుంది. ఉదాహరణకు, వాత స్వభావం ఉన్నవారు మజ్జిగ తాగే ముందు కొన్ని మార్పులు చేసుకోవాలి. వాత స్వభావం ఉన్నవారు నేరుగా చల్లని మజ్జిగ తాగే బదులు 1 చిటికెడు ఉప్పు కలిపి మజ్జిగ తాగాలి. ఇలా చేయడం వల్ల కడుపు సంబంధిత సమస్యలు తగ్గుతాయి. జీర్ణక్రియ కూడా మెరుగుపడుతుంది. తరచుగా మజ్జిగ తాగిన వెంటనే టాయిలెట్‌కు వెళతారు. ఉప్పు లేదా నల్ల ఉప్పుతో మజ్జిగ తాగడం వల్ల తరచూ మూత్రానికి వెళ్లే వారికి సమస్య తగ్గుతుంది. ఇలా చేస్తే జీర్ణక్రియ బలంగా ఉంటుంది. సరిగ్గా తీసుకుంటే, వాత, పిత్త, కఫ అనే మూడు దోషాలను సమతుల్యం చేయడంలో మజ్జిగ ప్రయోజనకరంగా ఉంటుంది. పిత్త స్వభావం ఉన్నవారు మజ్జిగను ఎలా తాగాలి?: పిత్త స్వభావం ఉన్నవారు చిటికెడు గ్రాన్యులేటెడ్ చక్కెరతో కలిపి మజ్జిగ తాగాలి. పిత్తాశయ రాళ్ళు శరీరంలో వేడిని సృష్టిస్తాయి. వాపు, ఆమ్లత్వాన్ని కలిగిస్తాయి. మజ్జిగ, గ్రాన్యులేటెడ్ చక్కెర మిశ్రమం శరీరాన్ని చల్లగా ఉంచడంలో సహాయపడుతుంది. ఇది మంచి జీర్ణక్రియకు సహాయపడుతుంది. కఫ స్వభావం ఉన్నవారు మజ్జిగను ఎలా తాగాలి?: కఫ స్వభావం ఉన్నవారు మజ్జిగలో చిటికెడు సుంతను కలిపి తాగాలి. ఇది మజ్జిగ తాగిన వెంటనే కఫం బయటకు రాకుండా చేస్తుంది. గొంతు నొప్పి, ముక్కు మూసుకుపోవడం వంటి సమస్యలు తలెత్తవు, జీర్ణక్రియ మందగించదు. ఆయుర్వేదం ప్రకారం, ఏదైనా పానీయం లేదా ఆహార పదార్థం, ప్రభావం ఏ వ్యక్తిపైనా ఒకేలా ఉండదు. సరిగ్గా తీసుకుంటే, ఏదైనా ఆహార పదార్థం ఔషధంలా పనిచేస్తుంది. అందువల్ల, శరీర లోపాలు, ధోరణులను దృష్టిలో ఉంచుకుని ఆహార పదార్థాలను తీసుకోవాలి. తద్వారా ఇది జీర్ణక్రియను సమతుల్యంగా ఉంచడంలో సహాయపడుతుంది.

# బిజినెస్

## కరిగిపోతున్న విదేశీ మారకం నిల్వలు




దేశ ఆర్థిక వ్యవస్థకు, అంతర్జాతీయ వాణిజ్య చెల్లింపులకు అత్యంత కీలకమైన విదేశీ మారక నిల్వలు అమాంతం కరిగిపోతున్నాయి. ఆర్‌బిఐ గణాంకాల ప్రకారం.. ఈ ఏడాది మార్చి 20తో ముగిసిన వారం రోజుల్లోనే ఏకంగా 11.413 బిలియన్ డాలర్ల (రూ.1 లక్ష కోట్ల పైగా) నిల్వలు కరిగిపోయి 698.346 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. ఇంతక్రితం వారంలోనూ 7.052 బిలియన్లు హరించుకుపోయి 709.759 బిలియన్లుగా నమోదయ్యాయి. ఫిబ్రవరి 27 నాటికి 728.498 బిలియన్ డాలర్లతో ఆల్‌టైం గరిష్టానికి చేరిన నిల్వలు పశ్చిమాసియాలోని యుద్ధంతో అమాంతం పడిపోతున్నాయి. కేవలం రెండు వారాల వ్యవధిలోనే దాదాపు 18 బిలియన్ డాలర్లకు పైగా నిల్వలు తగ్గిపోవడంతో దేశ దిగుమతి సామర్థ్యంపై, అంతర్జాతీయ మార్కెట్లో రూపాయి విలువపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపనుంది. ఊహించని రీతిలో వరుసగా పతనం కావడం ఆర్థిక నిపుణుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. మారకం నిల్వల్లో ప్రధానమైన ఫారిన్ కరెన్సీ ఆస్తులు మార్చి 20తో ముగిసిన వారంలో 2.127 బిలియన్ డాలర్లు క్షీణించి 557.695 బిలియన్లుగా చోటు చేసుకున్నాయి. బంగారం నిల్వలు 13,495 బిలియన్ డాలర్లు తగ్గి 117.186 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) వద్ద ఉన్న స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ 65 మిలియన్ డాలర్లు తగ్గి 18.632 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. ఐఎంఎఫ్ వద్ద భారత రిజర్వ్ స్థాయిలు మాత్రం 19 మిలియన్ డాలర్లు పెరిగి 4.833 బిలియన్ డాలర్లకు చేరింది. ఈ భారీ పతనానికి ప్రధానంగా బంగారు నిల్వల విలువలో వచ్చిన 13.495 బిలియన్ డాలర్ల భారీ కోత కారణమని రిజర్వ్ బ్యాంక్ గణాంకాలు చెబుతున్నాయి. ఒకవైపు పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకోవడంతో చమురు ధరలు మండిపోతుంటే, మరోవైపు మన వద్ద ఉన్న నిల్వలు ఇలా వేగంగా తగ్గిపోవడం రూపాయి విలువను మరింత పాతాళానికి నెట్టే ప్రమాదం ఉంది. ఇప్పటికే డాలర్‌తో రూపాయి 95 చేరువలో ఆల్‌టైమ్ కనిష్టానికి పడిపోగా.. రూపాయిని కాపాడుకోవడానికి రిజర్వ్ బ్యాంక్ వద్ద ఉన్న అస్త్రాలు తగ్గిపోతున్నాయనే సంకేతాలు ఈ గణాంకాలు ఇస్తున్నాయి. విదేశీ మారకం నిల్వల క్షీణత పరిస్థితి కొనసాగితే దిగుమతుల వ్యయం పెరిగి, దేశంలో నిత్యావసరాల ధరలు సామాన్యుడికి అందనంత ఎత్తుకు చేరే అవకాశం ఉంది. విదేశీ నిల్వలలో వేగవంతమైన పతనం గనుక అదుపులోకి రాకపోతే రాబోయే రోజుల్లో భారత ఆర్థిక వ్యవస్థ తీవ్ర సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.

### 2026-27 ప్రథమార్ధంలో రూ.8.20 లక్షల కోట్ల ప్రభుత్వ రుణాలు



ఆదాయ లోటును భర్తీ చేసేందుకు 2026-27 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-సెప్టెంబరులో డేటెడ్ సెక్యూరిటీల ద్వారా రూ.8 లక్షల కోట్లు సమీకరించాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తున్నట్లు ఆర్థిక శాఖ శుక్రవారం తెలిపింది. 2026-27 బడ్జెట్ అంచనాల ప్రకారం స్థూల మార్కెట్ రుణాలు రూ.17.20 లక్షల కోట్లుగా ఉండాలి. బడ్జెట్ సమర్పణ తర్వాత జీ-సెక్‌ల మార్పుల కారణంగా, స్థూల మార్కెట్ రుణాలు రూ.16.09 లక్షల కోట్లకు తగ్గాయి. ఈ రూ.16.09 లక్షల కోట్లలో రూ.8.20 లక్షల కోట్లను (51%) ప్రథమార్ధంలో డేటెడ్ సెక్యూరిటీల జారీ ద్వారా సమీకరించనున్నారు. ఇందులో రూ.15,000 కోట్ల విలువైన సార్వభౌమ హరిత బాండ్లు కూడా ఉంటాయి. ద్రవ్యలోటును జీడీపీలో 4.3 శాతంగా ఉంచేందుకు, రూ.17.2 లక్షల కోట్ల రుణాలు తీసుకోనున్నట్లు బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. వాస్తవ గణాంకాల ప్రకారం.. 2026-27లో ద్రవ్యలోటు రూ.16.9 లక్షల కోట్లుగా ఉండొచ్చని అంచనా వేశారు. డేటెడ్ సెక్యూరిటీల ద్వారా, నికర మార్కెట్ రుణాలు రూ.11.7 లక్షల కోట్లుగా ఉండొచ్చని భావించారు. మిగిలిన నిధులు చిన్న మొత్తాల పొదుపు పథకాలు, ఇతర వనరుల నుంచి వస్తాయని అంచనా.

### భారత్‌లో నోకియా లేఆఫ్‌లు!




అంతర్జాతీయ పునర్నిర్మాణ పథకంలో భాగంగా, మనదేశంలోనూ కొందరు ఉద్యోగులకు లేఆఫ్ చేపట్టడానికి నోకియా సిద్ధమవుతోందని సమాచారం. 2026లో పునర్నిర్మాణ ప్రక్రియ చేపడతామని కంపెనీ గతేడాది నవంబరులో ప్రకటించింది. ఇందులో భాగంగా కంపెనీని నెట్‌వర్క్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, మొబైల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అనే రెండు విభాగాలుగా సరళీకరిస్తారు. మిగతా వ్యాపారాలన్నిటినీ పెట్టుబడుల ఉపసంహరణ లేదా సమీక్ష నిమిత్తం విడదీస్తారు. ప్రపంచవ్యాప్తంగా సంస్థకు 74,100 మంది ఉద్యోగులుండగా.. అందులో 20% వరకు కోతలుండొచ్చన్న అంచనాలున్నాయి. భారత్‌లోనూ అదే స్థాయిలో లేఆఫ్ చేయొచ్చని విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ ఆంగ్ల వార్తా సంస్థ ఒకటి పేర్కొంది. నోకియా ఇండియా కంట్రీ హెడ్‌గా ఉన్న తరుణ్ చాబ్రా నిష్క్రమణ నేపథ్యంలో, ఏప్రిల్ 1 నుంచి ఇండియా కంట్రీ బిజినెస్ లీడర్‌గా సమర్ మిత్తల్, ఇండియా కంట్రీ మేనేజర్‌గా విభా మెహ్రా నియమితులు కానున్నారని నోకియా సీఈఓ జస్టిన్ హోటర్డ్ ప్రకటించారు. మనదేశంలో నోకియా శాశ్వత ఉద్యోగుల సంఖ్య 2024లో 17,270 కాగా, గతేడాది 17,708కు పెరిగింది. ఈ ఏడాది మాత్రం ఉద్యోగ కోతలకు అవకాశం ఉందని అంచనా.

### రికార్డు స్థాయిలో రూపాయి పతనం



భారతీయ కరెన్సీ రూపాయి విలువ అంతకంతకూ పడిపోతూ ఆందోళన కలిగిస్తోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో అమెరికన్ డాలర్ బలోపేతం కావడం, పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల ప్రభావంతో రూపాయి విలువ చారిత్రక కనిష్టానికి పడిపోయింది. శుక్రవారం ట్రేడింగ్‌లో ఒక్కరోజే భారీగా క్షీణించి, ప్రస్తుతం డాలర్‌తో పోలిస్తే రూ.94.82 వద్దకు చేరుకుంది. గతకొన్ని రోజులుగా డాలర్‌తో పోలిస్తే 93-94 మధ్య ఊగిసలాడుతున్న రూపాయి, నేడు ఒక్కసారిగా 86 పైసల మేర పతనమై 94.82 స్థాయిని తాకింది. ఈ ఏడాది (2026) ప్రారంభం నుండి రూపాయి సుమారు 5 శాతం మేర క్షీణించడం గమనార్హం.ఇరాన్, అమెరికా మధ్య నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా చమురు సరఫరాకు ఆటంకం కలుగుతుందనే భయం మార్కెట్లను వెంటాడుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 110 డాలర్ల మార్కును దాటడం భారత్ లాంటి దిగుమతి దేశాల కరెన్సీపై ఒత్తిడి పెంచుతోంది. చమురు ధరలు పెరగడంతో మన దేశ దిగుమతి వ్యయం భారీగా పెరిగి, కరెన్సీ నిల్వలపై ప్రభావం చూపుతోంది. భారత స్టాక్ మార్కెట్ల నుండి విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు (ఈఎఫ్ఐ) తమ నిధులను వెనక్కి తీసుకోవడం కూడా రూపాయి బలహీనపడటానికి కారణమైంది. రూపాయి విలువ పడిపోవడం వల్ల విదేశాల నుండి దిగుమతి చేసుకునే వస్తువుల ధరలు పెరగనున్నాయి. ముఖ్యంగా ఎలక్ట్రానిక్స్, ముడిచమురు, వంట నూనెల ధరలు పెరిగే అవకాశం ఉండటంతో ద్రవ్యోల్బణం పెరిగి సామాన్యుడిపై భారం పడే ప్రమాదం ఉంది.

### వాట్సప్‌లో డ్యూయల్ అకౌంట్ సదుపాయం

మెటాకు చెందిన మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ వాట్సప్, పలు కొత్త ఫీచర్లను శుక్రవారం ప్రకటించింది. ఇకపై ఐఫోన్ వినియోగదారులు ఒక ఫోన్‌లో, ఒకేసారి రెండు వాట్సప్ ఖాతాలు నిర్వహించుకోవచ్చు. దీంతో పాటు ఫోటో ఎడిటింగ్, మెసేజ్ డ్రాఫ్టింగ్ కోసం కొత్త కృత్రిమ మేధ (ఏఐ) టూల్స్‌నూ సంస్థ తీసుకొచ్చింది. ఇప్పటివరకు ఆండ్రాయిడ్ మొబైల్ వినియోగదారులకే 'టూ అకౌంట్స్, వన్ ఫోన్' ఫీచర్ అందుబాటులో ఉండగా.. ఇప్పుడు ఐఓఎస్ ప్లాట్‌ఫాం పైనా అందుబాటులోకి రానుంది. వ్యక్తిగత, వృత్తిపర సంభాషణలను నిర్వహించడానికి వినియోగదారులు రెండు వేర్వేరు ఫోన్లు వినియోగించాల్సిన అవసరం ఇకపై ఉండదని వాట్సప్ తమ బ్లాగ్‌లో పేర్కొంది. యాప్ కింద భాగంలో కనిపించే ప్రొఫైల్ పిక్చర్ ద్వారా ప్రస్తుతం ఏ ఖాతా యాక్టివ్‌గా ఉందో వినియోగదారులు గుర్తించొచ్చు. జనరేటివ్ ఏఐ ట్రెండ్‌కు అనుగుణంగా, వాట్సప్ నేరుగా చాట్‌లలో 'మెటా ఏఐ'ను అనుసంధానిస్తోంది. వినియోగదారులు ఇకపై మెటా ఏఐ ఉపయోగించి ఫోటోలను టచ్-అప్ చేయడం, అనవసరమైన అంశాలను తొలగించడం, బ్యాక్‌గ్రౌండ్ మార్చడం లేదా ఫోటో పంపే ముందు వివిధ స్టైల్స్ వాడటం వంటివి చేయొచ్చు. సంభాషణ సందర్భాన్ని బట్టి సమాధానాలను 'ఏఐ రైటింగ్ హెల్ప్' ఫీచర్ సూచిస్తుంది. ఏఐ టూల్స్ వల్ల భద్రతాపరమైన ఆందోళనలు తలెత్తవని, వినియోగదారుల చాట్‌లు పూర్తి 'ప్రైవేట్'గా ఉంటాయని వాట్సప్ స్పష్టం చేసింది. మెటా ఏఐ కొత్త ఫీచర్లు వినియోగదారులందరికీ వెంటనే అందుబాటులోకి రాకపోవచ్చని కంపెనీ తెలిపింది.

# స్పోర్ట్స్

## పడిక్కల్ ఊచకోత.. ఆరంభ పోరులో సన్‌రైజర్స్ ఓటమి!




ఐపీఎల్ ఆరంభ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ఓటమి తప్పలేదు. భారీ స్కోర్ల మ్యాచ్‌లో దేవ్‌దత్ పడిక్కల్(61), విరాట్ కోహ్లీ(69 నాటౌట్)ల మెరుపులతో ఆర్సీబీ జయకేతనం ఎగురవేసింది. హైదరాబాద్ నిర్దేశించిన 202పరుగుల ఛేదనలో ఆరంభంలో ఫిలిప్ సాల్ట్(8) ఔటైనా.. ఇంప్యాక్ట్ ప్లేయర్ పడిక్కల్ సునామీలా విరుచుకుపడ్డాడు. రజత్ పాటిదార్(31) ధనాధన్ ఆటకు కోహ్లీ క్లాస్ ఇన్నింగ్స్ తోడవ్వగా ఆర్సీబీ అలవోకగా 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. పంతొమ్మిదో సీజన్ ఆరంభ మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ పంజా విసిరింది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన ఆర్సీబీ భారీ లక్ష్యాన్ని ఉఫ్‌మనిపించింది. కొండంత ఛేదనలో దేవ్‌దత్ పడిక్కల్(61) ఊచకోతకు విరాట్ కోహ్లీ(69 నాటౌట్) క్లాస్ బ్యాటింగ్ తోడవ్వగా సన్‌రైజర్స్ బౌలర్లు బేజారయ్యారు. చిన్నస్వామి స్టేడియంలో పడిక్కల్, కోహ్లీ మెరుపులతో లక్ష్యం కరుగుతూ పోయింది. మూడో వికెట్‌కు పడిక్కల్‌తో 28 బంతుల్లోనే యాభై రన్స్ పిండుకున్న విఆరాట్ ఆ తర్వాత రజత్ పాటిదార్(31)తో కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. మలింగ ఓవర్లో దూబే క్యాచ్‌తో పటిదార్ ఔటవ్వగా.. ఆ తర్వాతి బంతికే జితేశ్ శర్మ(0) సైతం వెనుదిరిగాడు. అయినా కోహ్లీ ఉండడంతో ఆర్సీబీ జట్టు కూల్‌గా ఉంది. హర్షల్ పటేల్ ఓవర్లో సిక్సర్, ఫోర్, ఫోర్ బాదిన కోహ్లీ జట్టును గెలిపించాడు. 15.4 ఓవర్లలోనే లక్ష్యాన్ని అందుకున్న బెంగళూరు అదిరే బోణీ కొట్టింది. బౌలర్ల వైఫల్యంతో కెప్టెన్‌గా తొలి మ్యాచ్‌లోనే ఇషాన్ ఓటమిని ఎదుర్కొన్నాడు.

**ఇషాన్, అనికేత్ దంచేయగా**

పంతొమ్మిదో సీజన్ ఆరంభ పోరులో టాస్ ఓడిన సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆదిలో తడబడినా కోలుకుంది. టాపార్డర్ విఫలమైన చోట ఇషాన్ కిషన్(80 :38 బంతుల్లో 8 ఫోర్లు, 5 సిక్సర్లు) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో చెలరేగాడు. హెన్రిచ్ క్లాసెన్(31) జతగా 97 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పిన ఇషాన్ భారీ స్కోర్‌కు బాటలు వేశాడు. అనంతరం అనికేత్ వర్మ(43: 18 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లు) నేనున్నాగా అంటూ తనమార్క్ విధ్వంసంతో ఆర్సీబీ బౌలర్లకు చుక్కలు చూపించాడు. ఇషాన్, అనికేత్ మెరుపులతో ఆరెంజ్ ఆర్మీ ప్రత్యర్థికి 202 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది.

### ఐపీఎల్ మ్యాచ్‌లపై నిషేధం ఎత్తేసిన బంగ్లాదేశ్.. తీపి కబురుకు కారణమిదే..!



ఇండియన్ ప్రీమియర్ లీగ్ సందడికి తెరలేవనున్న వేళ బంగ్లాదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తమదేశంలోని క్రికెట్ అభిమానులకు తీపి కబురు చెబుతూ.. ఐపీఎల్ మ్యాచ్‌లపై నిషేధాన్ని ఎత్తేసింది. భారతదేశంతో దౌత్య సంబంధాలు పునరుద్ధరణలో భాగంగా బంగ్లాదేశ్ కొత్త సర్కార్ ఐపీఎల్ మ్యాచ్‌ల ప్రసారాలకు ఆమోద ముద్ర వేసింది. ఈ విషయాన్ని శనివారం సమాచార, బ్రాడ్‌కాస్టింగ్ మంత్రి జహీర్ ఉద్దీన్ స్వప్నన్ వెల్లడించారు. భారత్‌తో క్రికెట్ సంబంధాల పునరుద్ధరణకు నిరీక్షిస్తున్న బంగ్లాదేశ్ ప్రభుత్వం ఆ దిశగా తొలి అడుగు వేసింది. రెహమాన్ తారీఖ్ సారథ్యంలోని కొత్త సర్కార్ ఐపీఎల్ ప్రసారాలపై విధించిన నిషేధాన్ని ఎత్తివేసింది. ఆ దేశ సమాచార శాఖ మంత్రి జహీర్ ఉద్దీన్ స్వప్నన్ ఈ విషయాన్ని అధికారంగా ప్రకటించారు. 'ఐపీఎల్ మ్యాచ్‌లను ప్రసారం చేయాలని ఏ ఒక్క టీవీ ఛానెల్ యాజమాన్యం మాకు దరఖాస్తు ఇవ్వలేదు. రాజకీయాలతో క్రికెట్‌ను ముడిపెట్టడం మాకు నచ్చదు. ఐపీఎల్ మ్యాచ్‌ల ప్రసారం అంశాన్ని మేము వాణిజ్య కోణంలో చూస్తున్నాం. ఏ ఛానెల్ వారైనా ఐపీఎల్ మ్యాచ్‌ల ప్రసారాల అనుమతి కోరితే.. మేము అంగీకరిస్తాం. మేము ఎవరినీ ఐపీఎల్ ప్రసారం చేయకుండా అడ్డుకోం. స్టార్ స్పోర్ట్స్ సంస్థ ప్రసారం చేయాలనుకుంటే వారికి అభ్యంతరం చెప్పం. అలాగనీ కచ్చితంగా ఐపీఎల్ మ్యాచ్‌లను టెలికాస్ట్ చేయాలని మేము ఎవరినీ బలవంతం చేయం' అని మీడియా సమావేశంలో జహీర్ ఉద్దీన్ వెల్లడించారు.

### ఇంగ్లండ్ క్రికెట్‌కు భారీ దెబ్బ



ఇంగ్లండ్ క్రికెట్‌కు భారీ దెబ్బ తగిలింది. ఆ దేశ టెస్ట్ జట్టు కెప్టెన్ బెన్ స్టోక్స్ కొంతకాలం? ప్రొఫెషనల్ క్రికెట్‌కు దూరంగా ఉండనున్నాడు. త్వరలో ప్రారంభం కానున్న కౌంటీ సీజన్‌కు ముందు ఈ వార్త వెలువడింది. స్టోక్స్ కౌంటీ జట్టు (డర్హమ్) కోచ్ ర్యాన్ క్యాంప్‌బెల్ ఈ విషయాన్ని వెల్లడించాడు. అతని మాటల్లో.. స్టోక్స్ త్వరలో ప్రారంభం కానున్న కౌంటీ సీజన్‌కు అందుబాటులో ఉండాల్సింది. కానీ వైద్యులు అతనికి అనుమతి ఇవ్వలేదు. జూన్‌లో న్యూజిలాండ్‌తో జరిగే టెస్ట్ సిరీస్‌కు కూడా అతను అందుబాటులో ఉండవపోవచ్చు. క్యాంప్‌బెల్ ఇచ్చిన ఈ సమాచారం మేరకు స్టోక్స్ సమీప భవిష్యత్తులో క్రికెట్ ఆడటం కష్టమేనని స్పష్టమవుతుంది. స్టోక్స్ ఇటీవల నెట్స్‌లో ప్రాక్టీస్ చేస్తున్నప్పుడు బంతి ముఖానికి తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. దీని వల్ల అతని ముఖానికి శస్త్రచికిత్స కూడా జరిగింది. గాయమైన ముఖంతో స్టోక్స్ పెట్టిన పోస్ట్ సోషల్‌మీడియాలో వైరలైంది. స్టోక్స్ చివరిగా జనవరి 8న సిడ్నీలో జరిగిన యాషెస్ టెస్ట్‌లో ఆడాడు. ఆ మ్యాచ్‌కు ముందు కూడా అతను గాయపడ్డాడు. వరుస గాయాలు అతని కెరీర్‌ను సందిగ్ధంలో పడేశాయి. స్టోక్స్ వ్యక్తిగతంగా, నాయకుడిగా విఫలం కావడంతో ఇంగ్లండ్ ఇటీవలి యాషెస్ సిరీస్‌ను 1-4తో కోల్పోయింది. ఈ దారుణ పరాభవం తర్వాత కూడా ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు స్టోక్స్‌ను టెస్ట్ కెప్టెన్‌గా కొనసాగించాలని నిర్ణయించుకుంది. అయితే, తాజా గాయం స్టోక్స్ కెరీర్‌ను ప్రశ్నార్థకంగా మర్చేసింది. ఆటకు దూరంగా ఉన్నా, స్టోక్స్ ఇంగ్లండ్ క్రికెట్‌కు తన వంతు సహకారం అందిస్తూనే ఉన్నాడు. ఇంగ్లండ్ లయన్స్ జట్టుకు అతను కోచ్‌గా సేవలందిస్తున్నాడు.



# పెళ్లి తర్వాత కూడా తగ్గని జోరు... పాన్ ఇండియా రాణిగా రష్మిక హవా!

నేషనల్ క్రష్ రష్మిక మంధాన ప్రస్తుతం తన కెరీర్‌లో అగ్రస్థానంలో కొనసాగుతోంది. వ్యక్తిగత జీవితంపై ఎన్ని ఊహాగానాలు వచ్చినా, సినిమాల విషయంలో మాత్రం ఆమె ఎక్కడా తగ్గే ప్రసక్తే లేదని తన వరుస ప్రాజెక్టులతో క్లారిటీ ఇస్తుంది. సాధారణంగా హీరోయిన్లు పెళ్లి తర్వాత కెరీర్ వేగం తగ్గించుకుంటారు. కానీ రష్మిక మాత్రం అందుకు పూర్తి భిన్నంగా ముందుకు దూసుకెళ్తోంది. ప్రస్తుతం రష్మిక చేతిలో ఉన్న ప్రాజెక్టులు చూస్తే, రాబోయే రెండేళ్లు బాక్సాఫీస్ వద్ద ఆమె ఆధిపత్యం కొనసాగడం ఖాయంగా కనిపిస్తోంది. ముఖ్యంగా పాన్ ఇండియా స్థాయిలో ఆమె క్రేజ్ గణనీయంగా పెరిగింది. ఇప్పటికే పుష్ప3లో శ్రీవల్లి పాత్రతో మళ్లీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. సుకుమార్ దర్శకత్వంలో, అల్లు అర్జున్ హీరోగా తెరకెక్కుతున్న ఈ సినిమా మీద భారీ అంచనాలు నెలకొన్నాయి. అంతేకాదు, అల్లు అర్జున్– అట్లీ కాంబినేషన్‌లో రూపొందనున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో కూడా రష్మిక పేరు వినిపిస్తోంది. ఈ ప్రాజెక్ట్ కన్ఫర్మ్ అయితే ఐకాన్ స్టార్‌తో ఆమెకు హ్యాట్రిక్ మూవీ అవుతుంది. టాలీవుడ్‌తో పాటు బాలీవుడ్‌లో కూడా రష్మిక జోరు తగ్గడం లేదు. యానిమల్ సినిమాతో సంచలన విజయాన్ని అందుకున్న ఆమె, దాని సీక్వెల్ యానిమల్ పార్క్‌లో మరోసారి గీతాంజలి పాత్రలో కనిపించనుంది. ఇందులో రణ్‌బీర్ కపూర్‌తో కలిసి ఆమె నటనపై అభిమానులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. ఇక 'కాక్టెయిల్ 2' వంటి ప్రాజెక్టులతో హిందీ ప్రేక్షకులను మరోసారి అలరించేందుకు సిద్ధమవుతోంది. గ్లామర్ పాత్రలకు మాత్రమే పరిమితం కాకుండా, రష్మిక ఇప్పుడు విభిన్న కథలతో ముందుకు వస్తోంది. 'మైసా', 'రణబాలి' వంటి చిత్రాల్లో కొత్త తరహా పాత్రలతో తన నటనలోని మరో కోణాన్ని చూపించనుంది. ప్రత్యేకంగా 'రణబాలి'లో విజయ్ దేవరకొండతో కలిసి నటించబోతుండటం అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. ఈ జోడీ మళ్లీ తెరపై కనిపించబోతుండటంతో ఈ ప్రాజెక్ట్‌కు ప్రత్యేక క్రేజ్ ఏర్పడింది. పెళ్లి తర్వాత కెరీర్ స్లో అవుతుందని అనుకునే ట్రెండ్‌ను రష్మిక పూర్తిగా మార్చేస్తోంది. భారీ సినిమాలు, పాన్ ఇండియా ప్రాజెక్టులు, విభిన్న పాత్రలు కలిసి ఆమెను ఇండియన్ సినిమా టాప్ హీరోయిన్‌గా నిలబెడుతున్నాయి. ఏది ఏమైన , స్టార్‌డమ్ తగ్గకుండా, మరింత ఎత్తుకు తీసుకెళ్లే దిశగా రష్మిక ముందుకు సాగుతోంది. రాబోయే కాలంలో బాక్సాఫీస్‌ను షేక్ చేసే సినిమాలతో ఆమె పేరు మరింత మోగడం ఖాయంగా కనిపిస్తోంది



# బెల్లంకొండ సాయి శ్రీనివాస్ పెళ్లి తేదీ ఖరారు

టాలీవుడ్‌లో ఇప్పుడు పెళ్లిళ్ల సీజన్ నడుస్తోంది. యంగ్ హీరోలు వరుసగా బ్యాచిలర్ లైఫ్‌కు గుడ్ బై చెప్పేస్తూ ప్రేమించిన వారితో ఏడడుగులు వేస్తున్నారు. ఇటీవల విజయ్, దేవరకొండ, రష్మిక ప్రేమ పెళ్లి చేసుకున్న విషయం తెలిసిందే. అలాగే అల్లు శిరీష్ కూడా తన ప్రియురాలు నయనిక పెద్దల సమక్షంలో ఒక్కటయ్యారు. ఇక ఇప్పుడు బెల్లంకొండ సాయి శ్రీనివాస్ తన ప్రియురాలు కావ్యను త్వరలోనే పెళ్లాడబోతున్నట్లు వార్తలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఇటీవల ఆయన కావ్యను సోషల్ మీడియాలో పరిచయం చేయడంతో అది నిశ్చితార్థం అని అందరూ భావించారు. కానీ, అది కేవలం పరిచయం మాత్రమేనని, అసలైన వేడుకలు ఇప్పుడే మొదలవ్వబోతున్నాయని క్లారిటీ ఇచ్చారు. తాజా సమాచారం ప్రకారం, బెల్లంకొండ సాయి శ్రీనివాస్ – కావ్యల నిశ్చితార్థం ఏప్రిల్ 5న ఘనంగా జరగనుంది. ఆ వెంటనే ఏప్రిల్ 29న వీరిద్దరూ వివాహ బంధంతో ఒక్కటి కాబోతున్నారని టాక్. అయితే, టాలీవుడ్ సెలబ్రిటీలందరూ విదేశాల్లో డెస్టినేషన్ వెడ్డింగ్స్ అంటూ హంగామా చేస్తుంటే, సాయి శ్రీనివాస్ మాత్రం అందుకు భిన్నంగా తిరుపతిలో చాలా సింపుల్‌గా పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకోవడం విశేషం. కేవలం కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో ఈ వేడుక జరగనున్నట్లు తెలుస్తోంది. ఇక తిరుపతిలో పెళ్లి ముగిసిన తర్వాత, మే 1న హైదరాబాద్‌లో టాలీవుడ్ సినీ ప్రముఖుల కోసం ఒక భారీ రిసెప్షన్‌ను ఏర్పాటు చేయనున్నారు. సినీ ఇండస్ట్రీలోని పెద్దలందరినీ ఈ వేడుకకు ఆహ్వానించనున్నారట. నిన్న మొన్నటి వరకు విజయ్ దేవరకొండ, అల్లు శిరీష్ పెళ్లిళ్ల ముచ్చట్లతో బిజీగా ఉన్న నెటిజన్లు, ఇప్పుడు సాయి శ్రీనివాస్ పెళ్లి వార్త విని "ఇదేం సడెన్ ట్విస్ట్ సామీ!" అంటూ కామెంట్స్ చేస్తున్నారు. ఏదేమైనా బెల్లంకొండ వారసుడు కూడా ఒక ఇంటివాడు కాబోతుండటంతో బెల్లంకొండ అభిమానులు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.




# ఓటీటీలోకి రాబోతున్న సుహాస్ 'హే బల్వంత్'

కలర్ ఫొటో, రైటర్ పద్మభూషణ్ వంటి చిత్రాలతో తన నటనకు మంచి మార్కులు కొట్టేసిన సుహాస్, ఇటీవల 'హే బలవంత్' చిత్రంతో థియేటర్లలో సందడి చేశారు. ఫిబ్రవరి 20న విడుదలైన ఈ సినిమా ప్రేక్షకులను కడుపుబ్బ నవ్వించడమే కాకుండా, విమర్శకుల ప్రశంసలు కూడా అందుకుంది. ఇప్పుడు ఈ మూవీ డిజిటల్ ప్రియులను అలరించేందుకు సిద్ధమైంది. ప్రముఖ ఓటీటీ సంస్థ జీ5 ఈ సినిమా డిజిటల్ హక్కులను దక్కించుకుంది. థియేటర్లలో మిస్ అయిన వారందరి కోసం జీ5 ఒక క్రేజీ అప్‌డేట్ ఇచ్చింది. మార్చి 31 నుండి 'హే బలవంత్' సినిమాను స్ట్రీమింగ్ చేయబోతున్నట్లు అధికారికంగా ప్రకటించింది. కేవలం తెలుగులోనే కాకుండా తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో కూడా ఈ చిత్రం అందుబాటులో ఉండనుంది. సుహాస్ నటనకు తోడు శివాని నాగరం అందం, అభినయం ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ఈ సినిమాలో సీనియర్ నటుడు నరేష్, కమెడియన్ సుదర్శన్ కీలక పాత్రలు పోషించారు. కథ అంతా చాలా సహజంగా, కామెడీ ప్రధానంగా సాగడంతో ఫ్యామిలీ ఆడియన్స్ ఈ సినిమాపై ఆసక్తి చూపిస్తున్నారు. సమ్మర్ హాలిడేస్ మొదలవుతున్న క్రమంలో, ఇంటిల్లి పాదీ కలిసి నవ్వుకోవడానికి ఇదొక మంచి ఆప్షన్ అని చెప్పొచ్చు. థియేటర్లలో కంటే ఓటీటీలో సుహాస్ సినిమాలకు మంచి ఆదరణ లభిస్తుంది, కాబట్టి 'హే బలవంత్' కూడా డిజిటల్ ప్లాట్‌ఫామ్ పై రికార్డులు క్రియేట్ చేసే అవకాశం ఉంది.

# నక్సలిజం దాదాపు అంతమైంది

ఆయుధాలను చేపట్టే వారిని కేంద్ర ప్రభుత్వం వదిలిపెట్టబోదని కేంద్రహోంశాఖమంత్రి అమిత్ షా హెచ్చరించారు. నక్సల్స్ అందరూ ఆయుధాలు వీడి జనజీవనంలో కలవాల్సిందేనని తేల్చిచెప్పారు. నక్సలిజం నిర్మూలనపై లోక్‌సభలో ప్రసంగించిన కేంద్ర హోం మంత్రి బస్తర్‌లో నక్సలిజం దాదాపు అంతమైందని తెలిపారు. బస్తర్‌లో ప్రతి గ్రామంలో పాఠశాల ఏర్పాటు చేశామన్న అమిత్ షా, తెలంగాణలో అనేకమంది నక్సల్స్ నేతలు లొంగిపోయారని గుర్తు చేశారు. నక్సల్స్ రహిత దేశంగా భారత్‌ను మార్చామని అమిత్ షా వెల్లడించారు. కాంగ్రెస్ 60 ఏళ్లు అధికారంలో ఉన్నా ఆదివాసీల జీవితాల్లో మార్పు రాలేదని విమర్శించారు. ఎన్?డీఏ వచ్చాకే ఆదివాసీ, గిరిజన గ్రామాల్లో రోడ్లు, తాగునీ రు, విద్యుత్ సౌకర్యాలు వంటి మౌలిక వసతులు కల్పించినట్లు తెలిపారు. గిరిజన యువకులకు ఉపాధి కల్పించామని చెప్పారు. నక్సలిజంపై పోరులో ప్రజలు కూడా తమకు అండగా నిలిచారని వివరించారు. ఎందరో భద్రతా సిబ్బందిని నక్సలైట్లు పొట్టనపెట్టుకున్నారన్న అమిత్ షా దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన సైనికులకు శ్రద్ధాంజలి ఘటిస్తున్నామని తెలిపారు.

### ప్రాణాలు తీసే హక్కు నక్సల్స్‌కు ఎక్కడిది?

మనం ప్రజాస్వామ్య దేశంలో ఉన్నాం, రాజ్యాంగాన్ని స్వీకరించాం. ఆయుధాలు చేపట్టి ప్రజల ప్రాణాలు తీయాలని ఏ సిద్ధాంతాలు చెప్పాయి? ప్రజల ప్రాణాలు తీసే హక్కు ఎవరికీ లేదని నక్సల్స్ గ్రహించాలి. స్కూళ్లు, బ్యాంకులు, ఆస్పత్రులు తగులబెట్టేవారి వల్ల అభివృద్ధి ఎలా సాధ్యం? ఆయుధాలు చేతుల్లోకి తీసుకోవడం ఏ సమస్యకూ పరిష్కారం కాదు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల నుంచే నక్సలిజం అభివృద్ధి చెందింది. ఇందిరాగాంధీ వల్లే మావోయిస్టు పార్టీ అన్ని ప్రాంతాలకూ విస్తరించింది. సైనిక బలగాలు, పోలీసులు, స్టేషన్లపై దాడి చేసి వాళ్లు ఆయుధాలు దోచుకెళ్లారు. నక్సల్స్ వద్ద ఉన్న వాటిలో 52 శాతం ఆయుధాలు పోలీసుల నుంచి దోచుకెళ్లినవేనని అమిత్ షా పేర్కొన్నారు. ఇప్పుడు ప్రతి ఒక్కరూ అభివృద్ధి గురించే ఆలోచిస్తున్నారని, అయితే మావోయిస్టుల ఎజెండాలో అభివృద్ధి అన్నది లేదని, వారు ఉనికి కోసమే పోరాడుతున్నారని అమిత్ షా పేర్కొన్నారు. నక్సలైట్లను భగత్‌సింగ్, బిర్సాముండా వంటివారితో పోల్చకూడదన్న ఆయన, ప్రజలను చంపేవారు దేశభక్తులు ఎలా అవుతారని ప్రశ్నించారు. నక్సలైట్లు తమ సిద్ధాంతాలను విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారని, వారికి ఆదర్శం భారతీయులెవరూ కాదని, వారికి మావో ఆదర్శమని అమిత్ షా అన్నారు. ఆయుధాలు చేతుల్లోకి తీసుకోవడం ఏ సమస్యకూ పరిష్కారం కాదని అమిత్ షా స్పష్టం చేశారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల నుంచే నక్సలిజం అభివృద్ధి చెందిందని ఆరోపించారు. ఆయుధాలు చేపట్టి ప్రజల ప్రాణాలు తీయాలని ఏ సిద్ధాంతాలు చెప్పాయని అమిత్ షా నిలదీశారు. అన్యాయానికి వ్యతిరేకంగా పోరా డుతున్నామంటూనే సాయుధ ఉద్యమాలను సమర్థిస్తున్న వారిని నేనొక్కటే అడుగుతున్నాను. మీరు రాజ్యాంగాన్ని గౌర విస్తారా? లేదా? ఎవరికైనా అన్యాయం జరిగితే దానికి పరిష్కా రం మన రాజ్యాంగంలో ఉంది. న్యాయస్థానాలు, శాసనస భలు, జిల్లా పరిషత్తులు, తహసీల్దార్ కార్యాలయాలు ఏర్పాటు చేశారు. ఈ వ్యవస్థను పూర్తిగా తిరస్కరించి ఆయుధాలను చేతుల్లోకి తీసుకుంటారా? ఎవరైతే వామపక్ష భావాజలాన్ని సమర్థిస్తున్నారో వాళ్లకు ఓ విషయం చెప్పాలనుకుంటున్నాను. సాయుధ పోరాటాలు చేసే రోజులు పోయాయి. ఇది నరేంద్ర మోదీ ప్రభుత్వం. ఎవరైనా ఆయుధాలు పట్టుకుంటే వాళ్లని వదిలిపెట్టం. ఇటువంటి ప్రవర్తనను ఎంతమాత్రం సహించేది లేదు.

### చిన్న పిల్లలకు తుపాకులు

నక్సల్స్ చిన్నపిల్లలకు తుపాకులు, ఆయుధ సామగ్రి ఇచ్చారని, ఏజెన్సీ ప్రాంతాల యువతీయువకుల జీవితాలను వారు నాశనం అమిత్ షా ఆరోపించారు. నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో నిరక్షరాస్యత ఎక్కువగా ఉందని, అందుకు కారణం విద్య, వైద్య, మౌలిక వసతులను నక్సల్స్ ధ్వంసం చేయడమే కారణమని పేర్కొన్నారు. రోడ్లు, విద్యుత్ లేకుండా గిరిజన ప్రాంతాలు ఎలా అభివృద్ధి చెందుతాయని ఆయన ప్రశ్నించారు.

### చర్చల ద్వారానే పరిష్కారం

దేనికైనా చర్చల ద్వారానే పరిష్కారం లభిస్తుందని, తుపాకులతో కాదని అమిత్? షా హితవుపలికారు. మాట్లాడితే ప్రజాస్వామ్యం అంటారు. మరి హింసను ఎలా సమర్థిస్తారు? కాంబోడియా, పెరూ, కొలంబియాలో భయంకర రక్తపాతం జరిగింది. దేశాభివృద్ధికి మావోయిస్టు సిద్ధాంతాలు, విధానాలు తీవ్ర ఆటంకం కలిగిస్తున్నాయి. మావోయిస్టుల రక్తపాత సిద్ధాంతాన్ని ప్రజలంతా వ్యతిరేకిస్తున్నారు. బస్తర్‌లో నక్సల్స్ అనేక ఏళ్లపాటు సమాంతర ప్రభుత్వం నడిపారు. ఆయుధాలు వీడాలని బస్తర్ వెళ్లి పలుమార్లు కోరాం. లొంగిపోయిన నక్సల్స్‌కు పునరావాసం, ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నాం. కానీ నక్సల్స్? పలుచోట్ల రైలు బోగీలు తగలబెట్టారు. ప్రజల నుంచి డబ్బు వసూలు చేశారు. అంతేకాదు ప్రభుత్వ పథకాల అమలును కూడా నక్సలైట్లు అడ్డుకున్నారు. నక్సలిజం అభివృద్ధి కోసం రాలేదు. వామపక్ష భావజాల వ్యాప్తి కోసం వచ్చింది. నక్సలిజాన్ని రూపుమాపిన ఘనత కేంద్ర, రాష్ట్ర పోలీసు బలగాలదే. మావోయిస్టు పార్టీ చైనా నుంచి వచ్చింది. చైనా నుంచి వచ్చిన పార్టీకి ఇక్కడి ప్రజల సమస్యలు ఎలా తెలుస్తాయి? మావోయిస్టు పార్టీ సిద్ధాంతం దేశాభివృద్ధి కాదు. ప్రజల చేత ఎన్నికైన ప్రభుత్వాలపై తిరుగుబాటు చేయడమే వారి సిద్ధాంతం. మావోయిస్టు పార్టీ మూల సిద్ధాంతాలు దారుణంగా ఉంటాయి.

### ఎందుకు ఇన్ని వామపక్ష పార్టీలు?

'మేం వచ్చిన 12 ఏళ్లలో నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించాం. రష్యాలో కమ్యూనిస్టులు అధికారంలోకి వచ్చాక ఇండియాలో సీపీఐ ఏర్పడింది. సీపీఐ ఏర్పాటు వెనుక రష్యా కమ్యూనిస్టుల హస్తం ఉందన్న వాదన ఉంది. కమ్యూనిస్టులు ఆంగ్లేయులను కూడా సమర్థించారు. సీపీఐ ఉన్నాక మళ్లీ సీపీఐ (ఎం) ఎందుకు ఏర్పడింది? సీపీఐ, సీపీఎం తర్వాత మళ్లీ మావోయిస్టు పార్టీ ఎందుకు ఏర్పాటైంది? 2004లో కొన్ని కమ్యూనిస్టు గ్రూపులు ఏకమై మావోయిస్టు పార్టీ ఏర్పడింది. అయితే నక్సల్స్‌ను సమర్థించేవారికి మానవత్వమే లేదు. నక్సల్స్ లక్షలమంది తల్లులకు గర్భశోకం కలిగించారు' అని అమిత్? షా అన్నారు.

### అంతా కాంగ్రెస్ వల్లే!

'పేదలకు, పిల్లలకు ఆయుధాలు ఇచ్చినవారు మనుషులే కాదు. సల్వాజుడుం పేరుతో కాంగ్రెస్ పార్టీ అనేక దారుణాలు చేసింది. న్యాయమూర్తిగా పనిచేసిన సుదర్శనరెడ్డి తీర్పును ఖండిస్తున్నాం. జడ్జిలు తమ వ్యక్తిగత సిద్ధాంతాలను వృత్తిలో జోడించకూడదు. మేం వచ్చాక ఏజెన్సీ ప్రాంతాల్లో మొబైల్ టవర్లు నిర్మించాం. గిరిజన ప్రాంతాల్లో బ్యాంకులు, పోస్టాఫీసులు ఏర్పాటు చేశాం. ఏజెన్సీ ప్రాంతాల్లో ఏకలవ్య పాఠశాలలు, ఐటీఐలు, విద్యాలయాలు, ఆస్పత్రులు నిర్మించాం. ఏజెన్సీ ప్రాంతాల్లోని మౌలిక వసతుల కల్పనకు రూ.4 వేల కోట్లు ఖర్చు చేశాం' అని అమిత్? షా పేర్కొన్నారు.

# అసోంలో ఒకప్పుడు అస్థిరత, అశాంతి

అసోంలో ఒకప్పుడు దీర్ఘకాలం అస్థిరత, అశాంతి నెలకొన్నప్పటికీ, గత దశాబ్దంలో పరిస్థితులు పూర్తిగా మారిపోయాని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. రాష్ట్రంలో శాంతిని నెలకొల్పేందుకు బీజేపీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రయత్నించిందని తెలిపారు. ఎన్నికల సమరానికి సిద్ధమవుతున్న అసోంలో 'మేరా బూత్ సబ్సే మజ్‌బూత్ సంవాద్' కార్యక్రమంలో భాగంగా బీజేపీ బూత్ స్థాయి కార్యకర్తలతో మాట్లాడుతూ మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. గతంలో హింసతో అల్లకల్లోలమైన అసోం ఇప్పుడు నూతన ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతోందని మోదీ అన్నారు. బీజేపీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వం శాంతి స్థాపన కోసం కృషి చేయడంతో పరిస్థితులు మారాయని పేర్కొన్నారు. ఈశాన్య ప్రాంతంలో వివిధ సంస్థలతో 12 శాంతి ఒప్పందాలు కుదుర్చుకున్నామని తెలిపారు. ఒక రాష్ట్ర అభివృద్ధికి శాంతి అత్యవసరమని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. గత పదేళ్లలో నిజాయితీగా అమలు చేసిన శాంతి ఒప్పందాల వల్ల అసోంలో స్థిరత్వం నెలకొన్నట్లు చెప్పారు. యువత భవిష్యత్తు భద్రత కోసం బీజేపీ ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు.

### కాంగ్రెస్‌పై విమర్శలు

మునుపటి కాంగ్రెస్ ప్రభుత్వాలు కేవలం వార్తల్లో నిలిచేందుకు ఒప్పందాలు చేసేవని మోదీ విమర్శించారు. ఆ ఒప్పందాలు కాగితాలకే పరిమితమయ్యాయని, యువతను నిరాశలోకి నెట్టాయని అన్నారు. బోడో సమస్య సహా అనేక అంశాల్లో ప్రజలను కాంగ్రెస్ మోసం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్? పాలనలో తిరుగుబాటుదారులు, విద్యార్థి సంఘాలతో చేసుకున్న ఏ ఒప్పందమూ ఫలించలేదని



విమర్శించారు.

### మొదటిసారి ఓటర్లకు పిలుపు

మొదటిసారి ఓటు వేయనున్న యువతకు గత కాంగ్రెస్ ప్రభుత్వాల దుష్పరిపాలన గురించి గుర్తు చేయాలని పార్టీ కార్యకర్తలకు ప్రధాని మోదీ సూచించారు. చిన్న తప్పిదం కూడా రాష్ట్రాన్ని మళ్లీ వెనక్కి నెడుతుందని హెచ్చరించారు. ఎన్నికల సమయంలో సోషల్ మీడియాలో ప్రచారం అవుతున్న ఏఐ రూపొందించిన వీడియోలపై ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. అలాగే అసోంలో ఈసారి కూడా హ్యాట్రిక్ విజయం లక్ష్యంగా పనిచేస్తున్నట్లు మోదీ తెలిపారు.

### బంగ్లాదేశ్ చొరబాటుదారులను అనుమతించింది కాంగ్రెస్ : నితిన్ నబీన్

కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు బంగ్లాదేశీయులను అసోంలోకి అక్రమంగా ప్రవేశించేందుకు సహకరించిందని బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబీన్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న సమయంలో అక్రమ వలసలను నియంత్రించలేదని, దీంతో బంగ్లాదేశీ చొరబాటుదారులు అసోంలోకి పెద్ద ఎత్తున ప్రవేశించారని అన్నారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పరిస్థితిని మార్చి అక్రమ వలసదారులకు నిష్క్రమణ చూపిస్తున్నామని తెలిపారు. మొరిగావ్ జిల్లాలో ఎన్నికల ప్రచారంలో ప్రసంగిస్తూ ఈ మేరకు మాట్లాడారు.

### రాహుల్ గాంధీపై నబీన్ విమర్శలు

లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీపై కూడా నితిన్ నబీన్ విమర్శలు గుప్పించారు. ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో అసోం సంప్రదాయ కండువా గమోచాను ధరించలేదని, ఇది రాష్ట్ర ప్రజల భావాలను దెబ్బతీసిందని అన్నారు. అదే సమయంలో మసీదులకు వెళ్లినప్పుడు టోపీ ధరిస్తారని ఆరోపించారు.

### 'బీజేపీ పాలనలో అభివృద్ధి'

గత పది సంవత్సరాల్లో బీజేపీ పాలనలో అసోంలో భారీ అభివృద్ధి జరిగిందని నబీన్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో తీవ్రవాదం, హింస, పెట్టుబడిదారుల వెనుదిగడం, యువత నిరాశ వంటి సమస్యలు ఉండేవని గుర్తు చేశారు. అలాంటి పరిస్థితులు మళ్లీ రాకుండా ప్రజలు జాగ్రత్తగా నిర్ణయం తీసుకోవాలని పిలుపునిచ్చారు.

### ఏప్రిల్ 9న అసోం అసెంబ్లీ ఎన్నికలు

అసోంలో 126 అసెంబ్లీ స్థానాలకు ఒకే దశలో ఏప్రిల్ 9న ఎన్నికలు జరగనున్నాయి. మే 4న ఓట్ల లెక్కింపు ఉంటుంది. 2016 నుంచి బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం అక్కడ అధికారంలో ఉంది. హ్యాట్రిక్ కోసం బీజేపీ ప్రయత్నిస్తుండగా, ఈసారి అసోంలో అధికారాన్ని చేపట్టాలని కాంగ్రెస్ విశ్వప్రయత్నాలు చేస్తోంది.

# బీజేపీ, ఎల్‌డీఎఫ్ కుమ్మక్కు వల్లే శబరిమలపై మోదీ మౌనం

ఎక్కడికి వెళ్లినా ఆలయాలు, మతం గురించే మాట్లాడే ప్రధాని మోదీ, పాలక్కడ్ ఎన్నికల ప్రసంగంలో శబరిమల అంశంపై మౌనం వహించడం సరికాదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. ఈ ఎన్నికల్లో బీజేపీ, వామపక్ష ఎల్‌డీఎఫ్ కూటమి కలిసి పనిచేస్తున్నందు వల్లే ఇలా జరిగిందని ఆయన ఆరోపించారు. మతం కంటే రాజకీయాలకు ప్రాధాన్యతను ఇచ్చినందు వల్లే, శబరిమల అంశాన్ని ప్రసంగంలో మోదీ ప్రస్తావించలేదన్నారు. శబరిమలలో ఏం జరిగిందో మర్చిపోయినట్లుగా మోదీ వ్యవహరించారని రాహుల్ విమర్శించారు. అధికార వామపక్ష కూటమి నేతలు అయ్యప్ప ఆలయం బంగారాన్ని స్వాహా చేసి దాని స్థానంలో ఇత్తడిని పెట్టారనే విషయాన్ని ప్రధాని మర్చిపోయారని ఆయన వ్యాఖ్యానించారు. అయ్యప్ప ఆలయానికి నెలవైన పాలక్కడ్ జిల్లాకు వచ్చినప్పుడు శబరిమల గురించి మాట్లాడకపోవడం సరికాదన్నారు. యూడీఎఫ్ కూటమి అధికారంలోకి వస్తే అయ్యప్ప ఆలయంలో జరిగిన అక్రమాలతో సంబంధమున్న వారిపై చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. సోమవారం కేరళలోని పథనంతిట్ట జిల్లా అడూర్‌లో జరిగిన కాంగ్రెస్ ఎన్నికల ప్రచార ర్యాలీలో రాహుల్ గాంధీ ఈ వ్యాఖ్యలు చేశారు.

### ఎల్‌డీఎఫ్ కూటమిలో బీజేపీ రహస్య హస్తం

"ఈసారి కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ - సీపీఎంలతో కూడిన ద్వయాన్ని కాంగ్రెస్ పార్టీ ఎదుర్కొంటోంది. ఈదఫా బీజేపీ పూర్తి మద్దతును కలిగిన వామపక్ష ఎల్‌డీఎఫ్ కూటమితో మేం పోరాడుతున్నాం. ఒక వైపు కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ కూటమి ఉంది. మరోవైపు సీపీఎం - బీజేపీల ద్వయం ఉంది. ఎల్‌డీఎఫ్ కూటమిలో బీజేపీ రహస్య హస్తం దాగి ఉంది.



సాధారణంగా రహస్య హస్తం లాంటి కాన్సెప్ట్‌లను మార్కెట్లతో ముడిపడిన ఆర్థికవేత్తలు వినియోగిస్తుంటారు. కేరళలో కాంగ్రెస్ అధికారంలోకి రాకూడదని బీజేపీ కోరుకుంటోంది. ఎందుకంటే జాతీయ స్థాయిలో బీజేపీకి సవాల్ విసురుతున్న ఏకైక రాజకీయ శక్తి కాంగ్రెస్ మాత్రమే. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లతో మేం సైద్ధాంతికంగా పోరాడుతున్నాం. ఎల్‌డీఎఫ్ లాంటి కూటమి కేరళలో అధికారంలో ఉన్నా, తమ నియంత్రణలోనే పని చేస్తుందని బీజేపీ భావిస్తోంది. బీజేపీ నియంత్రణలో ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం ఉన్నందు వల్లే సీఎం పినరయి విజయన్‌పై ఒక్క కేసూ నమోదు కాలేదు. బీజేపీపై సీఎం పినరయి విజయన్ పల్లెత్తు మాట కూడా అనలేదు. బీజేపీ- ఎల్‌డీఎఫ్ కుమ్మక్కుకు ఇవే నిదర్శనాలు" అని రాహుల్ గాంధీ తెలిపారు.

### కేరళ సీఎంను ఎందుకు టార్గెట్ చేయడం లేదు?

"కేంద్ర దర్యాప్తు సంస్థలన్నీ దేశంలోని విపక్ష నేతలను లక్ష్యంగా చేసుకుంటున్నాయి. బీజేపీకి వ్యతిరేకంగా ఎవరు పోరాడినా దర్యాప్తు సంస్థల ఒత్తిడిని ఎదుర్కోవాల్సి వస్తోంది. అందుకే నాపైనా 36 కేసులను నమోదు చేశారు. నన్ను కంటిన్యూగా 55 గంటల పాటు ప్రశ్నించారు. కానీ కేరళలోని వామపక్ష ఎల్‌డీఎఫ్ కూటమి అధి నాయకత్వంపై అలాంటి దర్యాప్తుల ఒత్తిడేం లేదు. కేరళ సీఎంను కానీ, అధికార ఎల్‌డీఎఫ్ కూటమి నేతలను కానీ కేంద్ర దర్యాప్తు సంస్థలు ఎందుకో టార్గెట్ చేయడం లేదు" అని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు.

### దేశాన్ని అదానీ, అంబానీల చేతుల్లో పెడుతున్నారు!

"నేను ఈ ప్రసంగాన్ని మొదలుపెట్టేటప్పుడే మైక్ వైపు చూశాను. ఇదిగో దానిపై మేడ్ ఇన్ చైనా అని రాసి ఉంది. ఇండియాలో తయారైంది, కేరళలో తయారైంది అని దీనిపై ఎందుకు రాసిలేదు? మేడ్ ఇన్ ఇండియా వస్తువుల తయారీ అనేది లేకుండా మనం కేరళ యువత కోసం ఉద్యోగ అవకాశాలను ఎలా క్రియేట్ చేయగలం? కేరళ భవిష్యత్తును కేవలం 1 లేదా 2 కంపెనీలే కంట్రోల్ చేస్తే, మేడిన్ ఇండియా లక్ష్యాన్ని మనం ఎలా సాకారం చేసుకోగలం? మీ ముఖ్యమంత్రి, ప్రధానమంత్రే ఈ దేశాన్ని అదానీ, అంబానీల చేతుల్లో పెడుతున్నారు. కేరళలోని వామపక్ష ప్రభుత్వమే కమ్యూనిస్టు భావజాలాన్ని అణచివేస్తోంది. దీంతో అది కార్పొరేట్ ఫండెడ్ ప్రభుత్వంగా మారిపోయింది.

## సైనికులకు న్యాయం సులభంగా అందాలి



దేశ సైనికుల గురించి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. సైనికులను వారి చట్టపరమైన హక్కుల కోసం సరిహద్దుల్లో ఒకటి, స్వదేశంలో మరొకటి, ఇలా ఒకేసారి రెండు యుద్ధాలు చేసేలా దేశం బలవంతం చేయకూడదని అన్నారు. సైనికులకు మెరుగైన న్యాయ సదుపాయం కల్పించాలని ఆయన పిలుపునిచ్చారు. కేంద్రపాలిత ప్రాంతం లేహ్ జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న సీజేఐ సూర్యకాంత్ ఈ మేరకు వ్యాఖ్యానించారు. న్యాయవ్యవస్థకు, సాయుధ దళాలకు మధ్య ఉన్న పరస్పర సహకార సంబంధాన్ని సీజేఐ సూర్యకాంత్ ప్రముఖంగా ప్రస్తావించారు. న్యాయస్థానాలు రాజ్యాంగ విలువలను కాపాడుతుండగా, ఆ ఆదర్శాలు నిలబడటానికి అవసరమైన పరిస్థితులను సైనికులే సృష్టిస్తారని పేర్కొన్నారు. అలాగే 1962 నాటి రెజాంగ్ లా యుద్ధాన్ని సైతం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ప్రస్తావించారు. మేజర్ శైతాన్ సింగ్ భాటి, 13 కుమావోన్ రెజిమెంట్‌కు చెందిన చార్లీ కంపెనీలోని 114 మంది సైనికుల త్యాగాన్ని ఆయన గుర్తుచేసుకున్నారు. "రాజ్యాంగం హక్కులు, గౌరవం, సమానత్వం, న్యాయం గురించి మాట్లాడినప్పటికీ, దేశ ప్రజల కోసం ఆ వాగ్దానాలు నిలబడగలిగే పరిస్థితులను కల్పించిన పూర్తి ఘనత సైనికులకే దక్కుతుంది. ఒక దేశం తన సార్వభౌమత్వాన్ని, స్థిరత్వాన్ని, శాంతిని కాపాడుకోలేకపోతే, ఆ దేశం స్వేచ్ఛ, న్యాయం గురించి అర్థవంతంగా మాట్లాడలేదు. సైనికుల భూ వివాదాన్ని కూడా ఎదుర్కోవచ్చు. ఒక మాజీ సైనికుడు సర్వీసు లేదా సంక్షేమ హక్కుల కోసం ఇబ్బందులు పడొచ్చు. ఒక కుటుంబం పింఛనుకు సంబంధించిన జాప్యాలు, గృహ సమస్యలు, వైవాహిక కలహాలు సంబంధిత వ్యవహారాల్లో అధికార యంత్రాంగం ఉదాసీనతతో వ్యవహరించొచ్చు. దేశం తన సైనికులను ఒకేసారి రెండు యుద్ధాలు చేసే స్థితిలో ఎన్నడూ ఉంచకూడదు. చట్టం సైనికుడి వద్దకే వెళ్లాలి. ఎందుకంటే సైనికుడు ఎల్లప్పుడూ చట్టం వద్దకు వెళ్లలేడు. సైనికులకు న్యాయం సులభంగా అందాలి" అని సీజేఐ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు.

### 'దేశాన్ని కాపాడేవారికి న్యాయ సహాయం అందించాలి'

ఇది కేవలం సైనికుల సానుభూతికి సంబంధించిన విషయం మాత్రమే కాదని, ఒక రాజ్యాంగ విధి అని సీజేఐ సూర్యకాంత్ అభిప్రాయపడ్డారు. దేశ సమగ్రతను కాపాడే వారికి ప్రభుత్వ సంస్థలు సకాలంలో న్యాయ సహాయం అందించాలని పేర్కొన్నారు. అలా చేయలేకపోతే ప్రభుత్వ సంస్థలు తమ నైతిక, రాజ్యాంగ బాధ్యతలను నిర్వర్తించడంలో విఫలమైనట్లేనని అభిప్రాయపడ్డారు. తాను నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (చీూూూూ) కార్యనిర్వాహక అధిపతిగా ఉన్నప్పుడు రక్షణ సిబ్బంది, మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యులు, పారామిలిటరీ దళాలు, సీఏపీఎఫ్ సభ్యులకు ఉచిత న్యాయ సహాయం, తోడ్పాటు, మద్దతు సేవలను అందించడానికి ప్రారంభించిన 'వీర్ పరివార్ సహాయ యోజన'ను ఈ సందర్భంగా సీజేఐ ప్రస్తావించారు. నల్సా కార్యనిర్వాహక ఛైర్మన్‌గా తాను ఉన్నప్పుడు సాయుధ దళాల కోసం ఈ పథకాన్ని రూపొందించి, అమలు చేయడం తన కెరీర్‌లోని గొప్ప ఘట్టాలలో ఒకటని అన్నారు. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 14,929 మంది లబ్ధిదారులకు సహాయం అందించామని, 34 రాజ్య సైనిక్ బోర్డులు, 404 జిల్లా సైనిక్ బోర్డులతో సహా 438 న్యాయ సేవల క్లినిక్‌లను కార్యాచరణలోకి తెచ్చామని వెల్లడించారు. 'వీర్ పరివార్ సహాయ యోజన' కింద సేవలందించేందుకు విశ్వాసం, సానుభూతి సంస్కృతిని పెంపొందించేందుకు రక్షణ రంగ నేపథ్యం ఉన్న 378 మందితో సహా మొత్తం 1,123 మంది సిబ్బందిని నియమించినట్లు సీజేఐ సూర్యకాంత్ తెలిపారు. ఈ పథకం కింద ఆస్తి వివాదాలు, పెన్షన్ ఆలస్యం మొదలుకొని వైవాహిక కలహాలు, పాఠశాల ప్రవేశాల వరకు పలు సమస్యలను పరిష్కరించడం జరిగిందని చెప్పారు. సైనికులు సరిహద్దుల్లో ఉండి దేశాన్ని కాపాడుతున్నారని కొనియాడారు. సైనికుల ప్రయోజనాలన్నింటినీ పట్టుదలతో కాపాడటం దేశ సంస్థల కర్తవ్యమని అభిప్రాయపడ్డారు.

## ఏప్రిల్ 1 నుంచి జనగణన

దేశవ్యాప్తంగా ఏప్రిల్ 1 నుంచి జనగణన-2027 ప్రక్రియ మొదటి దశ ప్రారంభం కానుంది. ఇందులో భాగంగా ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి ప్రత్యేక మొబైల్ యాప్ ద్వారా హౌజ్ లిస్టింగ్ - హౌజింగ్ సెన్సస్ (నూూ)ను నిర్వహించనున్నారు. వివాహం చేసుకోకుండా చాలాకాలంగా కలిసి ఉంటున్న జంటలను ఇకపై ఒకే కుటుంబంగా గుర్తించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. సహ జీవన జంటలను పెళ్లయిన దంపతులలాగే పరిగణించాలని డిసైడ్ చేసింది. ఈ మేరకు జనగణన నిబంధనల్లో కీలక మార్పులు చేశారు. తొలిసారిగా ప్రజలకు స్వయంగా తమ వివరాలను సెల్ఫ్ ఎన్యుమరేషన్ పోర్టల్‌లో నమోదు చేసుకునే అవకాశాన్ని ఇచ్చారు. ఈ క్రమంలో ప్రజల సందేహాలను తీర్చేందుకు తరుచుగా అడిగే 33 ప్రశ్నల సమాధానాలను ఆ పోర్టల్‌లో రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా(ఆర్‌జీఐ) పొందుపర్చింది. హౌజ్ లిస్టింగ్ - హౌజింగ్ సెన్సస్ సందర్భంగా ఈ 33 ప్రశ్నలనే ప్రజలను ఎన్యుమరేటర్లు అడగనున్నారు.

### జనగణనలో ప్రజలిచ్చే సమాచారాన్ని ఎవ్వరికీ ఇవ్వం : ఆర్‌జీఐ

ఈ సందర్భంగా సోమవారం రోజు విలేకరుల సమావేశంలో రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ కీలక వివరాలను వెల్లడించారు. జనగణన చట్టం (సెన్సస్ యాక్ట్)లోని సెక్షన్ -15 అనేది అత్యంత కీలకమైందని, దీని ప్రకారం జనగణన వేళ ప్రజలు అందించే సమాచారాన్ని విశ్వసనీయమైనదిగా పరిగణిస్తామని ఆయన తెలిపారు. చివరకు సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) కింద కూడా ఆ సమాచారాన్ని తాము బహిర్గతపర్చమని స్పష్టం చేశారు. కోర్టులో రుజువుగానూ ఆ సమాచారాన్ని అందించమని, ఏ ఇతర సంస్థకూ ఈ వివరాలను అందించమని మృత్యుంజయ్ తేల్చి చెప్పారు. జనగణన ప్రక్రియలో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు కీలక పాత్ర పోషిస్తాయని ఆయన అన్నారు. క్షేత్రస్థాయిలో జనగణనను నిర్వహించేందుకు యావత్ పాలనా యంత్రాంగాన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు వినియోగిస్తాయని పేర్కొన్నారు. చివరిసారిగా మన దేశంలో 2011లో జనగణన జరిగిందని, ఇది భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జరుగుతున్న 8వ జనగణన అని మృత్యుంజయ్ చెప్పారు.

## నామినేషన్లు దాఖలు చేసిన స్టాలిన్, విజయ్

తమిళనాడు ముఖ్యమంత్రి, ఐవీఖ అధినేత వీఖ స్టాలిన్ చెన్నైలోని కొళత్తూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి నామినేషన్ దాఖలు చేశారు. నామ పత్రాలు దాఖలు చేసే సమయంలో ఆయన వెంట పార్టీ కీలక నేతలు ఉన్నారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయం నుంచి బయటకు వచ్చిన తర్వాత స్టాలిన్ రోడ్ షో నిర్వహించారు. ప్రజలకు అభివాదం చేస్తూ తనను మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా కొళత్తూర్‌లో చేపట్టిన అభివృద్ధి పనులపై ఒక పుస్తకాన్ని విడుదల చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో తన సొంత నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించారు ముఖ్యమంత్రి స్టాలిన్?. ఒకవైపు పరిపాలన వ్యవహారాలు చూస్తూనే, మరోవైపు పార్టీని గెలిపించే బాధ్యతను భుజాన వేసుకున్నారు. అయితే, కొళత్తూర్ నుంచి స్టాలిన్ నామినేషన్ వేయడం ఇది నాలుగోసారి. గతంలో మూడు సార్లు ఈ నియోజకవర్గం నుంచి బరిలో దిగి ఘన విజయం సాధించారు ముఖ్యమంత్రి స్టాలిన్. నామినేషన్ అనంతరం మాట్లాడిన స్టాలిన్, కొళత్తూర్ ప్రజలు తనకు వరుసగా నాలుగోసారి అఖండ విజయాన్ని అందిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకేకు భారీ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఇదివరకు జరిగిన ఎన్నికలతో పోలిస్తే తమకు ఈ సారి ప్రజల్లో అపారమైన మద్దతు కనిపిస్తోందని స్టాలిన్? పేర్కొన్నారు. 'ఈసారి విజయం చాలా గొప్పగా ఉంటుంది. ఢిల్లీకి తమిళనాడు ఎదురు నిలుస్తుంది' అని స్టాలిన్ వ్యాఖ్యానించారు.

### రెండు స్థానాల్లో పోటీ చేయనున్న టీవీకే అధినేత విజయ్?

మరోవైపు టీవీకే అధినేత విజయ్ కూడా పెరంబూర్ నుంచి నామినేషన్ దాఖలు చేశారు. ఈ సారి ఎన్నికల్లో విజయ్ రెండు చోట్ల పోటీ చేస్తున్నారు. మరొకటి తిరుచ్చి ఈస్ట్? నుంచి పోటీ చేస్తున్నారు. అయితే, నామినేషన్ అనంతరం విజయ్ రోడ్ షో నిర్వహించారు. ఏప్రిల్ 23న జరిగే ఎన్నికల్లో విజిల్ గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అదే సమయంలో డీఎంకే పాలనపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

VaarthaTarangalu Printed Published Edited and Owned by K.A.Vijayaraju Printed at SR Publications,Amberpet,Hyderabad. Published from PRME Home.Old Bus Stand Road Mahabubnagar - 509001 ,Editor K.A.Vijayaraju Ph.08542-222208 ,Website: www.vaarthatarangalu.com,Email: vtarangalu_222208@rediffmail.com,RNI.NO:APTEL 2004/14137